అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 21-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 172 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

నీట్ రద్దుపై తేల్చండి

- కేంద్రం, ఎన్టీఏకు సుప్రీం నోటీసులు
- జులై 8న మళ్లీ విచారణ



న్యూఢిల్లీ: నీట్- యూజీ 2024 పరీక్షల రద్దుపై కేంద్రం, ఎన్టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నీట్ రద్దు చేయాలా అనే అంశంపై వివరణ ఇవ్వాలని వారిని కోరింది. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కోర్టు ఆధ్వర్యంలో విచారణ జరగాలని సుప్రీం తెలిపింది. జస్టిస్ విక్రమ్ నాథ్, ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. అయితే నీట్ రద్దుపై వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సుప్రీంకు మార్చాలని ఎన్టీఏ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై వివిధ పార్టీల నుంచి ధర్మాసనం వివరణ కోరింది. జులై 8న మళ్లీ ఈ కేసులో విచారణ చేపట్టనున్నట్టు కోర్టు తెలిపింది. అయితే నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని కొందరు విద్యార్థులు పెట్టుకున్న పిటిషన్‌పై కూడా కోర్టు విచారణ చేపట్టనున్నది.

నీట్ లీక్ నిజమే.. బీహార్ పోలీసులకు విద్యార్థి వాంగ్మూలం..

నీట్ పరీక్షలో అక్రమాలపై విద్యార్థులు, విపక్షాలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. తొలుత బీహార్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీకైనట్టు వార్తలు రాగా కేంద్రం, ఎన్టీఏ తోసిపుచ్చాయి. కానీ పరీక్ష తేదీకి ముందు రోజే నీట్ పరీక్షా పత్రం తమ చేతికి వచ్చిందని ఇదే కేసులో బీహార్‌లో అరెస్టైన విద్యార్థులు పోలీసుల విచారణలో ...3లో



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ధర్నాలో శ్రీనివాస్,డీజీ, స్కైలాబ్ బాబు తదితరులు

విద్యావ్యవస్థ భ్రష్టు పట్టింది

విద్యాసంస్థలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ హైజాక్ చేశాయి

- నీట్‌పై పార్లమెంట్‌లో లేవనెత్తుతాం : రాహుల్ గాంధీ

వివరాలు 13లో



ఎన్టీఏను రద్దు చేయాలి

కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలి

- విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలి
- నీట్ అక్రమాలపై విద్యార్థి సంఘాల దేశవ్యాప్త ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నీట్-యూజీ, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలు జరిగిన నేపథ్యంలో బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అవకతవకలపై దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు రోడ్డెక్కాయి. ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం ప్రదర్శించారు. గురువారం నాడిక్కడ జేఎన్‌యూఎస్ యూతో పాటు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీఎస్ఎఫ్, కైవైఎస్, ఎన్ఎస్ యూఐ విద్యార్థి సంఘాలు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ (శాస్త్రి భవన్) కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాయి. ఢిల్లీ పోలీసులు విద్యార్థులపై దాడికి దిగారు. విద్యార్థినులనూ మగ పోలీసులు కొట్టారు. అనంతరం విద్యార్థులను అరెస్టు చేసి ఢిల్లీలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల దౌర్జన్యాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. యూజీసీ నెట్, నీట్, సెంట్రల్ యూనివర్సిటీస్ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూసెట్) నిర్వహణలో పేపర్ లీక్‌లు,



ఢిల్లీలోని కేంద్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నిరసన జ్వాల

స్కామ్‌లతో సహా ఎన్టీఏ చుట్టూ ఉన్న వివాదాల నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అర్హత లేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ డిమాండ్ చేశారు. పరీక్షల మాల్ ప్రాక్టీస్‌కు కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ...13లో

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం

'నీట్' అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ప్రధాని మోడీ మౌనం వీడాలి

రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) శ్రేణుల ధర్నాలు

నవతెలంగాణ- విలేకరులు

ఎన్టీఏ నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో అవినీతి, అక్రమాలు జరిగినందున వెంటనే పరీక్షను రద్దు చేయాలి.. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన నిందితులను కఠినంగా శిక్షించాలి.. అని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) శ్రేణులు ధర్నాలు చేశారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు.

నీట్ పేపర్ లీకేజ్‌పై ప్రధాని మోడీ మౌనం వీడి తక్షణమే న్యాయ విచారణ జరపాలని, జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు అన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సీపీఐ (ఎం) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులు.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. మోడీ మూడోసారి ప్రధాని అయ్యాక నీట్ పరీక్షలో తీవ్రమైన అవకతవకలు జరిగాయన్నారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న బీహార్, మధ్యప్రదేశ్, హర్యానా, గుజరాత్, రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీ జరిగిందన్నారు. నీట్ పేపర్లను రూ.50 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. విద్యార్థుల కోరిక మేరకు నీట్ పరీక్షలు రద్దుచేసి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ ...6లో





మాట్లాడుతున్న ఏచూరి, సలీం

విద్యా ప్రమాణాలను కాపాడుకోవాలి

సీతారాం ఏచూరి

మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దేశ భవిష్యత్తును నాశనం చేయ కుండా, విద్యా ప్రమాణాలను కాపాడుకోవడానికి విద్యార్థులు చేసే పోరాటాలకు సంఘీభావం తెలుపుతున్నట్టు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రకటించారు. ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవలి నీట్, నెట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులకు కేంద్రం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల అనుసరించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ఉన్న అడ్మిషన్ విధానాలను కేంద్రీకృత ప్రవేశ పరీక్షలతో భర్తీ చేసే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని అన్నారు. తద్వారా దేశంలో ప్రవేశ పరీక్షల మాఫియాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

సింగరేణి మెడపై కేంద్రం కత్తి

వందేండ్ల సంస్థను బీజేపీ, కాంగ్రెస్ బొందపెడుతున్నయి

- ఎన్డీయే చర్యలకు రేవంత్ ప్రభుత్వం మద్దతు
- ఈ విషయంపై సీఎం ఎందుకు స్పందించటం లేదు
- కేసుల భయమా..? మరేదైనా కారణమా..? : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటి ప్రశ్న



విలేకరులతో మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎనిమిది ఎంపీ సీట్లను బీజేపీ, మరో ఎనిమిది స్థానాలకు కాంగ్రెస్‌కు అప్పజెపితే... ఆ రెండు పార్టీలూ కలిసి తెలంగాణకే తలమానికమైన సింగరేణిని ఖతం పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బొగ్గు గనుల వేలం పేరిట ఆ సంస్థ మెడపై కేంద్రం కత్తిని వేలాడదీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ...6లో

SCCL

నేడే బొగ్గుగనుల వేలం

- దేశవ్యాప్తంగా 60 గనుల గుర్తింపు
- వేలంలో పాల్గొననున్న సింగరేణి
- శ్రావణపల్లి బ్లాక్‌ను దక్కించుకునేందుకు యత్నాలు

వివరాలు 6లో

సింగరేణి విచ్ఛిన్నానికి కుట్ర

బొగ్గు గనులపై బీజేపీ-బీఆర్ఎస్ తీరు అభివృద్ధికి ఆటంకం

- నాడు సింగరేణి ప్రయివేటీకరణ బిల్లుపై బీఆర్ఎస్ సంతకం
- నేడు దొంగే దొంగ దొంగ అని అరిచిన చందంగా విమర్శలు
- వేలం లేకుండా గనులను నేరుగా సింగరేణికి అప్పగించాలి
- పరిరక్షణకు అఖిలపక్ష నేతలతో కలిసి ముందుకు: ఉపముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



బీఆర్ఎస్ చేసిన సంతకాలు చూపుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బొగ్గు గనులను ప్రయివేటీకరించి రాష్ట్రాభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ విఘాతం కలిగిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తే వేలం లేకుండా గనులను సింగరేణికి ...13లో

కేజ్రీవాల్‌కు బెయిల్

- నేడు విడుదల
- రూ. లక్ష పూచీకత్తులో మంజూరు



న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు ...13లో

అలా కుదరదు

- 65శాతం రిజర్వేషన్ల పెంపు నిర్ణయాన్ని తిరస్కరించిన పాట్నా హైకోర్టు
- 50 నుంచి 65 శాతానికి పెంచిన నితీశ్ సర్కార్

వివరాలు 13లో

అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలు

- ప్రజా రాజధానిని విధ్వంసం చేశారు
- ఒక మూర్ఖుడితో రాష్ట్రానికి తీరని నష్టం
- రాజధాని పనులపై వైట్‌పేపర్ : ఏపీ సీఎం చంద్రబాబు

వివరాలు 5లో

24 గంటల్లో 17 మంది మృతి

- ఢిల్లీలో వడగాల్పులకు పిట్టల్లా రాలుతున్న జనం

వివరాలు 13లో

చెంచు మహిళపై పాశవిక దాడి

అర్ధరాత్రి కాళ్లు, చేతులు కట్టేసి..కండ్లలో కారం చల్లి.. ప్రయివేటు భాగాలపై డీజిల్ పోసి కాల్చిన వైనం

- పది రోజుల పాటు ఇంట్లోనే నిర్బంధం
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అమానుష ఘటన
- దోషులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ(ఎం) నేతలు
- విచారణ చేస్తున్నాం.. నిందితులను శిక్షిస్తాం : డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

బయటి ప్రపంచం తెలియని చెంచు మహిళ. భర్తతో గొడవ పడి పుట్టింటికెళ్లింది. దుర్మార్గులు అక్కడి నుంచి ఆమెను తీసుకొచ్చి దారుణంగా హింసించారు. ఇంట్లో బంధించి వివస్త్రను చేసి ప్రయివేటు భాగాలపై డీజిల్ పోసి కాల్చారు. కండ్లల్లో కారం చల్లారు. కాళ్లు మొక్కుతా.. నన్ను వదలండి అంటూ ఏడ్చినా వదల్లేదు. ప్రయివేటు భాగాలపై ...13లో

దోషులను కఠినంగా శిక్షించాలి

- తెలంగాణ గిరిజన సంఘం

వివరాలు 13లో

నేడు మంత్రివర్గం భేటీ

రైతు రుణమాఫీ, రైతు భరోసాపైనే ప్రధాన చర్చ

- సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధుల సమీకరణపై కసరత్తు
- కాళేశ్వరం అవినీతి, ఛత్తీస్‌గడ్ విద్యుత్ కొనుగోళ్లపైనా సమాలోచనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. నేడు మధ్యాహ్నం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ భేటీలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, రుణమాఫీ, రైతుభరోసా విధి విధానాలతో పాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు, అవినీతి ఆరోపణలపై కొనసాగుతోన్న విచారణలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వీటితో పాటు అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ రూపకల్పన, పంటల బీమాపైనా మంత్రుల బృందం చర్చించనుంది. ఆగస్టు 15లోగా పంట రుణాల మాఫీ చేస్తామంటూ సీఎం ప్రకటించిన నేపథ్యంలో ప్రధానంగా ...6లో



నులిపురుగుల నిర్మూలనతోనే బాలల ఆరోగ్యం పదిలం



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రాజ్ భవన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసిన మంత్రులు

నులిపురుగుల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం రాజ్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రితో కలిసి ఆయన ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. నులి పురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. రక్తహీనత, నీరసం, చదువులో వెనుకబడటం వంటి లక్షణాలకు నులి పురుగులే ప్రధాన కారణమని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. విద్యతోపాటు సంస్కారవంతులు కావాలన్నారు. సమాజంలో ఆణిముత్యంలా బతకాలని విద్యార్థులకు సూచించారు. రవాణా బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డీ వార్మింగ్ డే జరుపుకుంటున్నాం.. పిల్లల శారీరక ఎదుగుదలకు సంబంధించి డీ వార్మింగ్ టాబ్లెట్స్ ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. నేటి నుంచి 27 వరకు హైదరాబాద్‌లో ఉన్న 11 లక్షల 78 వేల 118 మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 1-19 ఏండ్ల వయస్సు పిల్లలకు ఈ మందులు వేస్తారన్నారు. శారీరక ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే ఈ మాత్రలు తప్పనిసరి అని, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ మాత్రలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్‌లో ఆరోగ్యానికి సంబంధించిన మరిన్ని కార్యక్రమాలను తమ ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జెడ్.చోంగ్తు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

14 పంటలకేనా మద్దతు : ఏఐపీకేఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఏడాదికి కేవలం 14 రకాల పంటలకే మద్దతు ధరలను ప్రకటించడంతో రైతులకు నిరాశ మిగిలిందని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం (ఏఐపీకేఎస్) విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాయల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో వంద రకాల పంటలుంటే, కేంద్రం 14 పంటలకే మద్దతు ధరను నామమాత్రంగా పెంచిందని విమర్శించారు. మోడీ రైతు పక్షపాతి అనీ, రైతు ఆదాయాన్ని పెంచేలా ఉన్నాయనీ, అందుకే ఈ మద్దతు ధరలను ప్రకటిస్తున్నామంటూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించడం సమంజసంగా లేదని తెలిపారు. రైతు పెట్టుబడికి వడ్డీ, రైతు కుటుంబ శ్రమను కూడా పరిగణనలోకి తీసుకుని మద్దతు ధరలను నిర్ణయించాలని సూచించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు భిన్నంగా ఈ విధానం ఉందని పేర్కొన్నారు. ఆ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వము

పురపాలక సంఘ కార్యాలయము నార్సింగి, రంగారెడ్డి జిల్లా

లేఖ నెం.ఎ1/331/2024 **పత్రికా ప్రకటన** తేది: 19-06-2024

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా, నార్సింగి పురపాలక సంఘ పరిధిలో తై బజారును మరియు కల్లు దుకాణము ప్రాంగణము ఖానాపూర్ తేది: 03-07-2024 బుధవారం రోజున మున్సిపల్ కార్యాలయంలో ఉ॥ 11.00 గంటలకు బహిరంగ వేలము నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు మునిసిపల్ కార్యాలయము నందు రూపాయలు 3000/- నగదు చెల్లించి గాని లేదా కమీషనర్ నార్సింగి పురపాలక సంఘము నందు చెల్లుబాటు అయ్యే డిమాండ్ డ్రాఫ్ట్ ను సమర్పించి నియమనిబంధనలతో కూడిన దరఖాస్తును తేది: 24-06-2024 సోమవారం నుండి పొందవచ్చును, మరియు పూర్తి చేసిన దరఖాస్తును డిపాజిట్‌తో పాటు తేదీ 02-07-2024 మంగళవారం సాయంత్రము 4.00 గంటల లోపు కార్యాలయములో సమర్పించగలరు.

సం/- కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

DIPR. R.O.No. 891-PP/CL/ADVT/1/2024-25, Dt. 20-06-2024

తెలంగాణ ప్రభుత్వము

శంకర్‌పల్లి మున్సిపాలిటి వారి కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.ఇ1/359/2024-25 తేది: 20.06.2024

శంకర్‌పల్లి మున్సిపాలిటిలో వివిధ అభివృద్ధి పనులు (5) కొరకు రిజిష్టర్డు కాంట్రాక్టర్ల నుండి టెండర్లను ఆహ్వానిస్తున్నారు. మొత్తం విలువ రూ.41.80.00 లక్షలు. టెండర్లు 27.06.2024న మ.3.30గం.ల వరకు కమీషనర్, శంకర్‌పల్లి మున్సిపాలిటి వారు స్వీకరిస్తారు మరియు అవి కమీషనర్, శంకర్‌పల్లి మున్సిపాలిటి వారిచే టెండరుదారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో మ.03.31గం.లకు తెరువబడును. పిలువబడిన టెండర్ల షెడ్యూలు: 1) టెండరు పత్రాల డౌన్‌లోడ్ తేది: 31.06.2024. 2) ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు సమర్పించు తేది: 27.06.2024న మ.3.00గం.లకు. 3) టెండర్లు తెరుచు తేది: 25.06.2024న మ.03.31గం.లకు. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫామ్ అనగా http://tender.telangana.gov.in లో దర్శించండి లేదా సంప్రదించండి: శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఆఫీసు, ఫోన్: 7995007425.

సం/- కమీషనర్, శంకర్‌పల్లి మున్సిపాలిటి

DIPR. R.O.No. 907-PP/CL/ADVT/1/2024-25, Dt. 20-06-2024

తెలంగాణ ప్రభుత్వము

జల్‌పల్లి మున్సిపాలిటి వారి కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.ఇ1/జెఎల్‌పిఎం/ఎంజిఎఫ్-అర్బన్/శానిటేషన్ మెటీరియల్/458/2024-25 తేది: 19.06.2024

జల్‌పల్లి మున్సిపాలిటీ (3 నెం.ల) శానిటేషన్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ కొరకు రిజిష్టర్డు కాంట్రాక్టర్ల నుండి టెండర్లను ఆహ్వానిస్తున్నారు. అంచనా విలువ రూ.16.00 లక్షలు. టెండర్లు 25.06.2024న మ.3.30గం.ల వరకు కమీషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ వారు స్వీకరిస్తారు మరియు అవి కమీషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ లేదా అతని డిప్యూటీ ద్వారా టెండరుదారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో మ.03.31గం.లకు తెరువబడును. పిలువబడిన టెండర్ల షెడ్యూలు: 1) టెండరు పత్రాల డౌన్‌లోడ్ తేది: 20.06.2024. 2) ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు సమర్పించు తేది: 25.06.2024న మ.3.30గం.లకు. 3) టెండర్లు తెరుచు తేది: 25.06.2024న మ.03.31గం.లకు. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్లాట్‌ఫామ్ అనగా http://tender.telangana.gov.in లో దర్శించండి లేదా సంప్రదించండి: జల్‌పల్లి మున్సిపాలిటీ ఆఫీసు, ఫోన్: 6302503323/ 6555870616/ 9652776588.

DIPR. R.O.No. 904-PP/CL/ADVT/1/2024-25, Dt. 20-06-2024 సం/- కమీషనర్, జల్‌పల్లి మున్సిపాలిటీ

UNIMONI FINANCIAL SERVICES LIMITED

RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 24.06.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంచ్ పేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: WARANGAL - MANDI BAZAR (WMB - Ground Floor# 9-8-84,Opp Syndicate Bankjpn Road, Mandi Bazar , Warangal -506002, Contact no : 9949088312) 2034686, 2035993, 2069333, 2066513, 2067501, 2014216, 2027326. WARANGAL (WAR - No.1-8-6-10/81, Ground Floor,Mayuri Complex, Main Road,Hanamkonda,Warangal -506001, Contact no : 9849744903) 2071146, 2071147, 2035125, 2052222, 2029908.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి

మల్టీజోన్-1 పదోన్నతుల్లో జరిగిన పొరపాట్లను సవరించాలి : విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి జాక్టో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



అసెంబ్లీలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విధంగా 5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) డిమాండ్ చేసింది. 11,12 జీవోలను సవరించి ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జాక్టో చైర్మెన్ జి సదానందంగౌడ్, కోశాధికారి కె కృష్ణుడు కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను మల్టీజోన్-1 పరిధిలో పూర్తి చేశారని తెలిపారు. మల్టీజోన్-2 పరిధిలో కొనసాగిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు ప్రకటించారు. మల్టీజోన్-1 పదోన్నతుల్లో ఒక ఉపాధ్యాయునికి మూడు సబ్జెక్టుల్లో పదోన్నతి వచ్చిందని తెలిపారు. వారు చేరిన సబ్జెక్టు కాకుండా మిగిలిన ఖాళీలను డీఈవోల ద్వారా తెప్పించుకుని ఈ షెడ్యూల్‌లోనే అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించాలని కోరారు. పండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్ కంటే ముందు ఖాళీగా ఉన్న 900కుపైగా ఉన్న పోస్టులను అర్హత ఉన్న ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని తెలిపారు. మల్టీజోన్-1లో బదిలీలు, పదోన్నతుల్లో జరిగిన పొరపాట్లను సవరించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. మల్టీజోన్-2లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం చేయాలని కోరారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ENGINEERING STAFF COLLEGE OF INDIA

Gachi Bowli, Hyderabad - 500 032

ESCI IEI

SHORT TENDER NOTICE

Sealed Tenders are invited from registered Contractors for the following works of Convention Centre in its campus.

1. Supply & Laying of Aluminium UG and Copper Cables of Electrical Works

Last Date to submit Tenders is **27-06-2024 @ 03:00 PM.**

For more details Visit our website: **www.escihyd.org**

Place: Hyderabad
Date: 20-06-2024

Sd/-
Director, ESCI

'అంతర్జాతీయ పీస్ కీపింగ్ మిషన్స్'లో

తెలంగాణ పోలీసులు

అంతర్జాతీయ శాంతి దళాల్లో శిక్షణకు 19మంది ఎంపిక

రాష్ట్రానికే గర్వకారణమంటున్న పోలీస్ ఉన్నతాధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఐక్యరాజ్యసమితి వివిధ దేశాల్లో నియమించిన పీస్ కమిషన్ విధుల శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్రం నుంచి 19 మంది అధికారులు ఎంపికయ్యారు. ఎంపిక కోసం జరిగిన పరీక్షలో దేశవ్యాప్తంగా 164 మంది పోలీస్ అధికారులు ఎంపిక కాగా, అత్యధికంగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపిక కావడం విశేషం. ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 'అంతర్జాతీయ పీస్ కీపింగ్ మిషన్స్'లో డిప్లమెంట్ కోసం దేశవ్యాప్తంగా 225 మంది పోలీసు అధికారులు ఢిల్లీలోని 22వ బెటాలియన్, ఐటీబీపీలో పరీక్షలు రాశారు. న్యూయార్క్ నుంచి ఇద్దరు ఫారిన్ ఆఫీసర్స్ వచ్చి ఇంగ్లీష్ పరీక్షలతోపాటు డ్రైవింగ్, ఫైరింగ్ పరీక్షలు నిర్వహించారు. 164 మంది పోలీసు అధికారులు అన్ని విభాగాల్లోనూ ఉత్తీర్ణత సాధించారు. వీరిలో రికార్డు స్థాయిలో తెలంగాణ పోలీస్ అధికారులు 19 మంది ఉత్తీర్ణులై రాష్ట్ర పోలీసు పతాకాన్ని సగర్వంగా ఎగరేశారు. ఎంతో కఠినమైన ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వీరు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు, ప్రజలు నుంచి అభినందనలు పొందారు. రాష్ట్రం నుంచి హైదరాబాద్ సీసీఎస్‌లో ఏసీపీగా పనిచేస్తున్న కెఎం.కిరణ్ కుమార్‌తో పాటు తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ నర్సింగరావు, కమాండెంట్ అలెక్స్, ఎస్పీ దేవేందర్ సింగ్, నార్కోటెక్ బ్యూరో చల్లా శ్రీధర్, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ డీఎస్పీ ప్రతాప్, ఏసీపీ జూపల్లి రమేష్, ఏసీపీ మాజీ ధాలీఖాన్, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేష్, సీఐడీ విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసుల తోపాటు ఇతర అధికారులు ఉత్తీర్ణులయ్యారు. 19 మంది రాష్ట్ర పోలీసు అధికారులు ఉత్తీర్ణులు కావడం రాష్ట్రానికే గర్వకారణమని సీనియర్ పోలీస్ అధికారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. రాబోయే రెండేండ్లలో అంతర్గత సంక్షోభం ఏ దేశంలో ఉంటుందో అక్కడ వీరి సేవలను వినియోగించుకుంటారు. ముఖ్యంగా ఏ దేశాల్లో ఐక్యరాజ్యసమితి తరపున శాంతి రక్షణకు దళాలు అవసరమో కేంద్ర ప్రభుత్వం నుంచి మీరందరికీ తప్పనిసరిగా డిప్లమెంట్ ఆదేశాలు వస్తాయి.

HMT MACHINE TOOLS LTD
HYDERABAD - 500054.

NOTICE INVITING TENDER

Ref: Tender Enquiry No.HMTV/SC/AGM (MM)/Transport/T-05/24-25 Dated 20.06.2024

Sealed tenders are invited in **"Two Bid System"** from interested parties for rate contract of all India Road Transport Services as given in the tender document. Tender details are available on websites.

https://eprocure.gov.in, https://www.hmtindia.com, https://www.hmtmachinetools.com

Contact Mobile No.9030082385

Mgr(Stores & SC)

UNIMONI FINANCIAL SERVICES LIMITED

RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 24.06.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంచ్ పేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: HYDERABAD - TOLICHOWKI (HYT - Sartaj Heights, Adams Colonyfirst Floor, 8-1-364/A-1-4,Tolichowki - 500008, Contact no : 9949088316) 2067986.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

UNIMONI FINANCIAL SERVICES LIMITED

RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 24.06.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంచ్ పేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: SURYAPET (SPT - H No : 1-2-270/14Mahatma Gandhi Roadsuryapet, Suryapet -508213, Contact no : 7093055519) 2071824, 2068636, 2031484, 2070986, 2052989, 2071657, 2033116, 2049661, 2071025, 2066953, 2067602, 2068402, 2069994

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

05101-సీతారాంపురం బ్రాంచి: డి.నెం. 30-22-76/5సి, కొల్లిపరవారి వారి వీధి, సీతారాంపురం, విజయవాడ-520003

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత : 1) మెస్సర్స్ బాలాజీ ట్రాన్స్‌పోర్ట్స్, ఫ్లాట్ నెం. టి.ఎఫ్-9, బ్లాక్ నెం. 4, మహేశ్వరి టవర్స్, పవర్ గ్రిడ్ ఎదురు, నున్న, విజయవాడ - 521212. 2) శ్రీ దాసరి లవ కుమార్, తండ్రి : డి. రాధాకృష్ణ మూర్తి, ఫ్లాట్ నెం. 407, డి.నెం. 39, 34, 254/49, కెఎస్ఆర్ గ్రీన్ వ్యాలీ, మాధవధార, మర్రిపాలెం, విశాఖపట్నం. 3) శ్రీ విదారపు రమేష్, డి.నెం. 4-76, గౌడ బజారు, వట్టిగుడిపాడు (గ్రామం), ఆగిరిపల్లి మండలం, కృష్ణా జిల్లా. హామీదారులు : శ్రీ పోలవరపు శోభనాద్రి వెంకట అప్పారావు, హెచ్.నెం. 1-2-709/బి/22, పద్మనాభనగర్ కాలనీ, మెహదీపట్నం, హైదరాబాద్ - 500028.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం 1) శ్రీ దాసరి లవకుమార్, తండ్రి : డి. రాధాకృష్ణమూర్తి & 2) శ్రీ పోలవరపు శోభనాద్రి వెంకట అప్పారావు గార్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియావారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 02-07-2019 ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని తేది. 21-09-2019న అధీకృత అధికారి సూచనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు తేది. 02-07-2019 నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు.

షెడ్యూల్ ఆస్తి

1) శ్రీ దాసరి లవకుమార్, తండ్రి : డి.రాధాకృష్ణమూర్తి గారి పేరిట విశాఖపట్నం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, ఎన్ఎస్‌టిఎల్ దగ్గర, డివిజన్ 41, మాధవధార ఏరియా, మర్రిపాలెం వద్ద కె.ఎస్.ఆర్. గ్రీన్ వ్యాలీ నందు ఎ బ్లాక్, 3వ అంతస్తు నందు ప్లింత్ ఏరియా 1540 చ॥అ॥ విస్తీర్ణంతో ఫ్లాట్ నెం. 407. హద్దులు : ఉత్తరం : ఫ్లాట్ నెం. ఎ/408, తూర్పు : ఫ్లాట్ నెం. ఎ/409, పడమర : ఫ్లాట్ నెం. ఎ/405, దక్షిణం : సెట్ బ్యాక్స్ బిల్డింగ్ (శూన్యాకాశము),

2) శ్రీ పి. శోభనాద్రి వెంకట అప్పారావు గారిపేరిట ఎ.పి. (ఇప్పుడు తెలంగాణ), హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, వార్డు నెం. 12, బ్లాక్ నెం. 2, మెహదీపట్నం, తెలంగాణ, గోల్కొండ తాలూక, గుడిమల్కాపూర్ ఖుర్ఖున్ సర్వే నెం. 29/1,2,3 వద్ద ప్లాట్ నెం. 22 కి చెందిన 273.00 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము అందలి ఆర్‌సిసి బిల్డింగ్ దానికి చెందిన గ్రౌండ్ + ఫస్ట్ + సెకండ్ ఫ్లోర్స్. హద్దులు : ఉత్తరం : ప్లాట్ నెం. 21, తూర్పు : 30.00 వెడల్పు రోడ్డు, పడమర : ప్లాట్ నెం. 23, దక్షిణం : పద్మనాభనగర్ కాలనీ.

తేది : 04-06-2024
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవాలి

మంత్రి పొన్నం, కోదండరామ్‌కు టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యం (డీఏ)లను విడుదల చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, టీజేఎస్ అధినేత కోదండరామ్‌ను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను చెల్లించాలని కోరారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ అంశాలపై వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. డీఏల విడుదలకు సహకరిస్తామన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఉమాదేవి, గోవర్ధన్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

HDFC BANK
We understand your world

రిజిష్టర్డ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబాయి-400013.
బ్రాంచ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, # 50-96-5, ప్లాటు నెం.175, సీతమ్మధార, పాత ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

డిమాండ్ నోటీసు

HDFC/DFSO /13(2)/07-06/1 తేది.07.06.2024

టు,

1) మెస్సర్స్ తమోఘ్న ఫార్మ (ఋణగ్రహీత), (ఫార్మాసుటికల్స్ అండ్ మెడికల్ గూడ్స్ యొక్క డిస్ట్రిబ్యూటర్) ప్రాతినిధ్యం వహిస్తున్నవారు మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ వేమిరెడ్డి రాజా రమేష్ రెడ్డి, డోర్ నెం.6-3-650/313, మూడవ అంతస్తు, మహేశ్వరి చాంబర్స్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500082.

2) శ్రీ వేమిరెడ్డి రాజా రమేష్ రెడ్డి, (మేనేజింగ్ పార్ట్‌నర్ / హామీదారు), తండ్రి. శ్రీ వెంకట సుబ్బారెడ్డి వేమిరెడ్డి, డోర్ నెం.6-3-650/313, మూడవ అంతస్తు, మహేశ్వరి చాంబర్స్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500082.

ప్రస్తుత చిరునామా : శ్రీ వేమిరెడ్డి రాజా రమేష్ రెడ్డి, (మేనేజింగ్ పార్ట్‌నర్ / హామీదారు), తండ్రి. శ్రీ వెంకట సుబ్బారెడ్డి వేమిరెడ్డి ఎఫ్-403, అపర్ణ సైబర్ లైఫ్, నల్లగండ్ల, సిటిజన్ హాస్పిటల్ ప్రక్కన, లింగంపల్లి (పో), శేర్లింగంపల్లి, కె వి రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500019.

3) శ్రీమతి వేమిరెడ్డి స్వప్న రేఖ (పార్ట్‌నర్ / హామీదారు), భర్త. శ్రీ వెంకట రత్నరెడ్డి, డి.నెం.15/16, లేతపల్లి, కమలపురం, కడప, ఆం.ప్ర-516289.

శ్రీ/శ్రీమతి,

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ యొక్క సెక్షన్ 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ - 2002 (సర్ఫేసి యాక్ట్ - 2002) ప్రకారం జారీ చేయబడిన నోటీసు

మీ కోరిక ప్రకారం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ వారు క్యాష్ క్రెడిట్ ఋణ సౌకర్యం కల్పించినారని మీకు తెలియును. దిగువ తెలిపిన సదరు ఋణం కొరకు వివిధ పత్రములను సెక్యూరిటీ క్రింద బకాయి చెల్లించుట కొరకు మీరు అమలు చేసినారు. నెం.1 గా ఉన్న మీ పేరున బ్యాంకు వారు మంజూరు చేసిన సదరు ఋణ వివరములు దిగువ తెలుపబడినవి.

వ.నెం.	సౌకర్యం యొక్క స్వభావం	పరిధి	తేది.30.04.2024 నాటికి బకాయి మొత్తం
1)	Cash Credit (A/c No.50200026898221	165.00	రూ.1,77,09,596.59
2)	WC-GECL-Extn	43.00	రూ.44,94,082.22
	మొత్తం	208.00	రూ.2,22,03,678.78

ఈ పై ఋణసౌకర్యము పొందుటకు, మీరు అనేక భద్రత పత్రములను, హామీతో కూడిన దస్తావేజులను, ఇతర భద్రతా పత్రములను మరియు నిల్వల తాకట్టు, పుస్తక జమలు మరియు భద్రతా ఆసక్తితో కూడిన ఈ క్రింది షెడ్యూలులో వివరముగా చెప్పిన సమాన నిష్పత్తితో ఆస్తులను తనఖా ఉంచినారు.

మీచే పొందబడిన ఋణసౌకర్యము ఖాతా సక్రమముగా నిర్వహించబడక మీలో నెం.1 వారు ఋణమొత్తము మరియు వడ్డీ సకాలములో చెల్లింపక, విఫలమైనారు. కనుక మీ ఋణఖాతా **తేది.25.02.2024** న ఆర్‌బిఐ వారి నిబంధనల ప్రకారం నిరర్థక ఆస్తిగా వర్గీకరించటమైనది.

కనుక బ్యాంక్ వారు బకాయి మొత్తములను తిరిగి పొందుటకై మీలో నెం.1 చిరునామాదారుడు, ఇందులో పార్ట్‌నర్ & హామీదారులు 2 మరియు 3, హామీదారులు / తనఖదారులు 2 అందరూ కలిసిగాని, లేక విడివిడిగా కాని **తేది.30.04.2024** నాటికి (చెల్లించవలసిన) బకాయి మొత్తములను పూర్తిగా **రూ.2,22,03,678.78 పై (అక్షరాల రెండు కోట్ల ఇరవై రెండు లక్షల మూడు వేల ఆరు వందల డెబ్బై ఎనిమిది రూపాయల డెబ్బై ఎనిమిది పైసలు మాత్రమే)** మరియు భవిష్య వడ్డీతో కలిపి చెల్లించవలసిందిగా కోరటమైనది.

సర్ఫేసి చట్టం 2002 నందలి నిబంధనల ద్వారా ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) రూల్స్ 2002 ద్వారా ఈ దిగువ సంతకందారుడు బ్యాంకు వారిచే అధీకృత అధికారిగా నియమించబడినారు.

సదరు చట్టం సెక్షన్ 13(2) ద్వారా సంక్రమించిన అధికారములతో మీరు అందరు కలిసిగాని లేక విడివిడిగా కాని బ్యాంక్ వారికి చెల్లించవలసిన ఋణ మొత్తములను **తేది.30.04.2024 నాటికి రూ.2,22,03,678.78 పై (అక్షరాల రెండు కోట్ల ఇరవై రెండు లక్షల మూడు వేల ఆరు వందల డెబ్బై ఎనిమిది రూపాయల డెబ్బై ఎనిమిది పైసలు మాత్రమే)** చెల్లించవలసిన మరియు భవిష్యవడ్డీ, కాస్ట్స్ మరియు అన్ని ఇతర ఖర్చులు, ఈ ప్రకటన అందిన 60 రోజులలోగా చెల్లించవలెను. అట్లు చెల్లించని ఎడల, సదరు చట్టం సెక్షన్ 13(4) ప్రకారం ఈ దిగువ తెల్పిన ఆస్తుల పై తరువరి చర్యలు తీసికొనగలరు.

సదరు చట్టంలో గల సెక్షన్ 13(13) ప్రకారం మీరు అమ్మకం / లీజు లేదా ఇతర విధములుగానూ నోటీసులోని తనఖాలో ఉన్న సెక్యూర్డు ఆస్తులను గాని అందలి భాగములు గాని ఏవిధముగానూ బ్యాంకు వారి వ్రాత పూర్వక అనుమతి లేనిదే బదిలీ చేయరాదు.

సదరు చట్టంలో గల సెక్షన్ 13(6) ప్రకారం బ్యాంకు వారికి సంక్రమించిన అధికారములతో ఈ సెక్యూర్డ్ ఎసెట్స్‌పై పూర్తి హక్కులు, బదిలీ హక్కులతో సహా కలిగి ఉన్నది. బ్యాంకు వారిచే జరుపబడే అన్ని బదిలీలు, చర్యలు ఆస్తి యజమానిచే చేయబడినవిగా భావించవలెను. ఇందుమూలముగా మీరు ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజులలోగా అన్ని ఋణ మొత్తములను మరియు అట్టి వసూలు కొరకు అగు అన్ని ఖర్చులు, కాస్ట్స్ మరియు ఛార్జీలు పూర్తిగా చెల్లించని యెడల బ్యాంకు వారు సదరు పై చట్టము ప్రకారము తదుపరి చర్యలు తీసుకొనగలరు. అయిననూ బ్యాంకు వారి పూర్తి బకాయి మొత్తములు వసూలు కాని యెడల చట్ట ప్రకారం మీపై మరియు హామీదారుల పై తగు చర్యలు తీసుకొనగలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇతర చట్టబద్ధ / చర్యల ప్రకారం ఇతర చట్ట బద్ధంగా ప్రస్తుతం అమలులో ఉన్న నియమముల ప్రకారంగా అనుకూలమైన చర్యలు బ్యాంకు వారు తీసుకొనుటకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీచేయబడినది. సదరు చట్టం ప్రకారం మీరు సదరు ఆదేశములకు విరుద్ధము / ఏదేని నిరోధము విరుద్ధంగా ప్రవర్తించుట నేరముగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఆస్తుల వివరములు

షెడ్యూల్-ఎ : తెలంగాణ-500019, రంగారెడ్డి జిల్లా, శేర్లింగంపల్లి (మండలం), నల్లగండ్ల (గ్రామం, సర్వే నెంలు.220(పి), 221, 222(పి), 235, 236, 241(పి), 242(పి) & 297(పి), అసెస్‌మెంట్ నెం.1209945863, డోర్ నెం.1-100/ఎసిఎల్/ఎఫ్/403 నందు విస్తీర్ణం 52756.38 చ॥గ॥లులోని 58 చ॥గ॥లు విస్తీర్ణంతో "అపర్ణ సైబర్ లైఫ్", "CUPRTINO" బ్లాక్-ఎఫ్, 4వ అంతస్తులోని ప్లింత్ ఏరియా 1598 చ॥అ॥లులోని ఫ్లాట్ నెం.403 నివాసయోగ్యమైన ఆస్తి మరియు 367 చ॥అ॥లుతో కామన్ ఏరియా, మొత్తం బిల్టప్ ఏరియా 1965 చ॥అ॥లు, 'అపర్ణ సైబర్ లైఫ్'లోని కామన్ ఏరియాతో కలిపి రెండు కార్ పార్కింగ్ స్లాట్స్ శ్రీ వేమిరెడ్డి రాజా రమేష్‌రెడ్డి గారి పేరున కలదు (దస్తావేజు నెం.2967/2019, తేది.01.05.2019, ఎస్.ఆర్.ఓ శేర్లింగంపల్లి) దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు : కారిడార్ మరియు ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై

షెడ్యూల్-బి : పుస్తక ఋణములు & రావలసినవి మరియు నిల్వలు హైపోథికేటెడ్ చేయబడినవి.

స్థలం : విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,

Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా

లాసన్స్ బే కాలనీ బ్రాంచ్, డి.నెం.4-46-11(2), గ్రౌండ్ ఫ్లోర్, జి కె మాన్షన్ మెయిన్ రోడ్డు, పెదవాల్తేరు జంక్షన్, విశాఖపట్నం-530017. ఫోన్ : 0891-27269417, 2727088. ఇ-మెయిల్ : lawson@bankofbaroda.com

ఋణగ్రహీత కొరకు నోటీసు

(SARFAESI ACT, 2002లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (2) క్రింద)

ఋణగ్రహీత : శ్రీ వై. కిరణ్ కుమార్ పాత్రో, ఇంటి నెం.40-245, రాఘవేంద్ర నగర్, హెచ్ బి కాలనీ, మౌలాలి, హైదరాబాద్, తెలంగాణ-500076.

విషయము : మా బ్యాంక్ ఆఫ్ బరోడా, లాసన్స్ బే కాలనీ బ్రాంచ్ నుండి మంజూరు చేయబడిన టెర్మ్ లోన్ ఖాతా నెంలు.55860600000618 & 55860600000621, శ్రీ వై. కిరణ్ కుమార్ పాత్రో గారి పేరున కలదు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్-3 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిష్టర్డ్ పోస్ట్ ద్వారా **తేది.04.06.2024** న మీకు తిరుగు రశీదులతో కూడిన **డిమాండ్ నోటీసు** మీచే పొందుపరచబడిన చిరునామాకు జారీచేయడమైనది. మీరు చిరునామాలో లేనందున తపాల శాఖ వారిచే బ్రాంచినకు తిరుగు వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది. మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ **తేది.29.05.2024** నుండి నిరర్థక ఆస్తిగా (ఎన్.పి.ఎ) పరిగణించబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తము **రూ.26,95,452.11** పై ప్లస్ వసూలు చేయని వడ్డీ **రూ.57,013.45** పై ప్లస్ వర్తించని వడ్డీ **రూ.23,130/-** ప్లస్ **తేది.03.06.2024** నుండి వడ్డీతో పాటు చట్టపరమైన మరియు ఇతర ఛార్జీలతో మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు పైన పేరా 1లో పేర్కొన్న విధంగా **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకము, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) ద్వారా బదిలీ చేయుట నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం జారీచేయబడినది.

స్థిరాస్తి వివరములు

విశాఖపట్నం జిల్లా, యలమంచిలి యొక్క రిజిస్ట్రేషన్ సబ్ జిల్లాలోని అచ్యుతాపురం మండలం, దుప్పితూరు గ్రామం మరియు పంచాయితీ యొక్క సర్వే నెం.51/2, 67, 68/1, 68/2 ప్రకారం లే-అవుట్ ఆమోదిత ఉడా వైడ్ ఎల్.పి.నెం.03/2014 తేది.03.04.2014, ప్లాట్ నెంలు.117 & 118 తో గల హనీ గ్రూప్-శ్రీనివాసం నందు మొత్తం విస్తీర్ణం 754.66 చ॥గ॥లు లేదా 630.97 చ॥మీ॥లులోని అవిభాజ్యమైన మరియు నిర్దిష్టపరచని వాటాతో ఉన్న 65.08 చ॥గ॥లు లేదా 54.04 చ॥మీ॥లు విస్తీర్ణం గల స్థలం నందు విస్తీర్ణం 1520 చ॥అ॥లు, ప్లింత్ ఏరియా 1216 చ॥అ॥లు + కామన్ ఏరియా 304 చ॥అ॥లుతో మొదటి అంతస్తులోని (ఈస్ట్ ఫేసింగ్) నివాసయోగ్యమైన ఫ్లాట్ నెం.201 మరియు కార్పెట్ ఏరియా 1064 చ॥అ॥లు మరియు స్టిల్ట్ ఫ్లోర్ నందు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్‌తో కలదు. మొత్తం స్థలం హద్దులు : తూర్పు : 40 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం : 40 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర : 40 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం.116 & 119. కొలతలు : తూర్పు నుండి పడమర (ఉత్తరం వైపున) : 120.00 అ॥లు లేదా 36.58 మీటర్లు, తూర్పు నుండి పడమర (దక్షిణం వైపున) : 120.00 అ॥లు లేదా 36.58 మీటర్లు, దక్షిణం నుండి ఉత్తరం (తూర్పు వైపున) : 56.6 అ॥లు లేదా 17.25 మీటర్లు, దక్షిణం నుండి ఉత్తరం (పడమర వైపున) : 56.6 అ॥లు లేదా 17.25 మీటర్లు, మొదటి అంతస్తులోని నివాసయోగ్యమైన ఫ్లాట్ నెం.201 యొక్క హద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, మెట్లు మరియు కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై.

అమ్మకం దస్తావేజు నెం.1484/2018, తేది.31.03.2018 ప్రకారం

తేది : 20.06.2024
ప్రదేశం : విశాఖపట్నం

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

ANJANI PORTLAND CEMENT LIMITED

Registered Office: #6-3-553, Unit No. E3 & E4, 4th Floor, Quena Square Off: Taj Deccan Road, Erramanzil, Hyderabad, Telangana – 500 082
Tel No.: +91 40 2335 3096/3106 | Email ID: secretarial@anjanicement.com
Website: www.anjanicement.com
Corporate Identification Number (CIN): L26942TG1983PLC157712

NOTICE

Transfer of Equity Shares of the Company to Investor Education and Protection Fund ("IEPF")

This Notice is published pursuant to the provisions of Section 124 (6) of the Companies Act, 2013 ("**Act**"), read with the Investor Education and Protection Fund Authority (Accounting, Audit, Transfer and Refund) Rules, 2016 ("**Rules**"), each as amended. The Act and Rules, inter alia, contain provisions for transfer of unclaimed dividend to IEPF and transfer of shares(s), both held in physical form as well as in electronic form, in respect of which dividend(s) has not been paid or claimed by the shareholder(s) for seven consecutive years or more, to IEPF Authority.

In compliance with the Act read with the Rules, the Company has sent individual communication in physical mode to the concerned shareholders at their registered postal address, for them to claim such dividend(s). This communication is addressed to those shareholders whose dividend(s) remain unclaimed and whose share(s) are liable to be transferred in favour of IEPF Authority on **October 12, 2024** as per the aforesaid Rules. The shareholders are advised to claim such dividend(s) by **September 10, 2024.**

The Company has made available, the complete details of the concerned shareholders whose share(s) are liable for transfer to IEPF on its website at **www.anjanicement.com**. Shareholders are requested to refer to **http://anjanicement.com/statement_unclaimed_dividend.html** to verify the details of their unclaimed dividend(s) and share(s) liable to be transferred to the IEPF in 2024.

Shareholders are requested to note that in case dividend(s) are not claimed by September 10, 2024, the unclaimed final dividend for the financial year 2016-17 will get transferred to IEPF. Further, those equity share(s) in respect of which the dividends remain unclaimed for seven consecutive years, shall be transferred to IEPF, without any further notice to the shareholders in the following manner:

In case the shares are held in physical form: New share certificate(s) will be issued and transferred in favour of IEPF Authority on completion of necessary formalities. The original share certificate(s) which stand registered in the name of the shareholder will be deemed cancelled and non-negotiable.

In case the shares are held in electronic form: The Company shall transfer the shares by way of corporate action through the Depositories to the demat account of IEPF Authority.

The concerned shareholders are further requested to note that all future benefits arising on such shares would also be issued / transferred in favour of the IEPF Authority.

The shareholders may note that both, the unclaimed dividend(s) and the equity share(s) already transferred to IEPF can be claimed by submitting an application electronically (web form IEPF-5) available on the website of the Ministry of Corporate Affairs at **www.iepf.gov.in** and sending physical copy of the same, duly signed, to the attention of the Nodal Officer, Anjani Portland Cement Limited at the Registered Office address (#6-3-553, Unit No. E3 & E4, 4th Floor, Quena Square Off: Taj Deccan Road, Erramanzil, Hyderabad, Telangana – 500 082), along with the e-form submission acknowledgment / challan and requisite documents enumerated in web form IFPF-5.

Please note that no claim shall lie against the Company in respect of unclaimed dividend amount and shares transferred to IEPF pursuant to the said Rules.

For any queries on the above matter, shareholders are requested to contact the Company's Registrar and Share Transfer Agent, Mr. Veeda Raghunath, Manager – Corporate Registry at M/s. KFin Technologies Limited, Unit: Anjani Portland Cement Limited, Selenium Tower B, Plot No. 31-32, Financial District, Nanakramguda, Serilingampally Mandal, Hyderabad – 500032. Tel: +91-40-67161606, email ID: enward.ris@kfintech.com.

For Anjani Portland Cement Limited

Sd/-
Subhanarayan Muduli
Nodal Officer and Company Secretary & Compliance Officer


Place : Hyderabad
Date : June 20, 2024

కారణం ఏదైతేనేం ? ఈ భూ ప్రపంచంలో నివసిస్తున్న ప్రతి 69 మంది ప్రజల్లో ఒక్కరు సొంత గూటిని వదిలి సుదూర ప్రాంతాలకు తరలిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12 కోట్ల మంది ప్రజలు...అంటే జనాభాలో ఒకటిన్నర శాతం మంది నిరాశ్రయుల జాబితాలో చేరిపోయారు. దీని వెనుక ఎన్నో కన్నీటి కథలు, వ్యథలు ఉన్నాయి. కుటుంబాలు చిన్నాభిన్నమై పోయాయి. జీవనోపాధి కరువైంది. సమాజాలకు సమాజాలే వలస బాట పట్టాయి. ఇలా నిరాశ్రయులైన వారిలో 6.8 కోట్ల మంది స్వదేశంలోనే ఇతర ప్రాంతాలకు తరలిపోయారు. మిగిలిన వారు శరణార్థులు. వీరిలో రక్షణ కోసం 4.34 కోట్ల మంది, ఆశ్రయం కోరుతూ 69 లక్షల మంది వలస పోయారని శరణార్థులకు చెందిన ఐరాస హైకమిషన్ కార్యాలయం తెలిపింది.

నీడ లేక గూడు వదిలి...!

ధరణిపై పెరుగుతున్న నిరాశ్రయులు

యుద్ధాలు, ఘర్షణలతో శరణార్థులుగా మారుతున్న ప్రజానీకం



న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఉన్న శరణార్థుల పరిస్థితిపై అవగాహన కల్పించేందుకు ఐరాస జూన్ 20వ తేదీని ప్రపంచ శరణార్థుల దినోత్సవంగా జరుపుతోంది. బలవంతంగా నిరాశ్రయులైన వారందరితో ఓ దేశాన్ని ఏర్పాటు చేస్తే అది ప్రపంచంలో అధిక జనాభా కలిగిన 13వ దేశంగా మారుతుంది. దారుణమైన విషయమేమంటే విధిలేని పరిస్థితుల్లో చెట్టూ పుట్టా పట్టుకొని గమ్యం తెలియకుండా సాగిపోతున్న వారిలో సగం మంది చిన్నారులే.

1951లో కన్వెన్షన్ ఏర్పాటు

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లోని శరణార్థుల హక్కుల రక్షణ కోసం 1951లో ఐరాస ఓ కన్వెన్షన్‌ను ఏర్పాటు చేసింది. 1967లో ఆ కన్వెన్షన్‌ను ప్రపంచానికంతటికీ విస్తరించింది. ప్రారంభంలో 21 లక్షల మంది శరణార్థులు మాత్రమే ఉండేవారు. 1980 నాటికి వారి సంఖ్య కోటి దాటింది. 1980వ దశకంలో జరిగిన ఆఫ్ఘనిస్తాన్, ఇథియోపియా యుద్ధాల కారణంగా 1990 నాటికి శరణార్థుల సంఖ్య రెండు కోట్లకు చేరింది. ఆ తర్వాత రెండు దశాబ్దాల పాటు శరణార్థుల సంఖ్య స్థిరంగానే ఉంది.

ఆ ఐదు దేశాల నుండే...

తాజా సమాచారం ప్రకారం శరణార్థుల్లో మూడో వంతు మంది కేవలం ఐదు దేశాలు... ఆఫ్ఘనిస్తాన్, సిరియా, వెనెజులియా, ఉక్రెయిన్, పాలస్తీనా...నుండి వలస పోయిన వారే. శరణార్థుల్లో 70శాతం మంది పొరుగు దేశాల్లోనే ఆశ్రయం పొందుతున్నారు.

యుద్ధాలు, ఘర్షణలే కారణం

2001లో ఆఫ్ఘనిస్తాన్ పైన, 2003లో ఇరాక్ పైన అమెరికా జరిపిన దురాక్రమణలతో పాటు దక్షిణ సూడాన్, సిరియా దేశాల్లో జరిగిన ప్రచ్ఛన్న యుద్ధాల కారణంగా 2021 చివరి నాటికి నిరాశ్రయుల సంఖ్య మూడు కోట్లు దాటిపోయింది. 2022లో జరిగిన ఉక్రెయిన్ యుద్ధంతో శరణార్థుల సంఖ్య భారీగా పెరిగింది. సంవత్సరం వ్యవధిలోనే 57 లక్షల మంది ప్రజలు ఉక్రెయిన్‌ను విడిచి పారిపోయారు. గత సంవత్సరం చివరి నాటికి 60 లక్షల మంది ఉక్రెయిన్ ప్రజలు బలవంతంగా స్వస్థలాలను వదిలి సురక్షిత ప్రదేశాలకు తరలిపోవాల్సి వచ్చింది. గత సంవత్సరం సూడాన్‌లో సైన్యానికి, రాపిడ్ సపోర్ట్ దళాలకు మధ్య జరిగిన ఘర్షణలో పదిహేను లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ ప్రతిరోజూ వేలాది మంది వలస పోతూనే ఉన్నారు. ఇటీవల గాజాపై ఇజ్రాయిల్ జరిపిన భీకర దాడుల కారణంగా పాలస్తీనా ప్రజలు పెద్ద సంఖ్యలో శరణార్థులుగా మారారు. గాజా స్ట్రిప్‌లో 75శాతానికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. అనేక మంది ప్రజలు ఒక్కసారి కాదు...అనేక పర్యాయాలు ఇళ్లను వదిలేసి పారిపోవాల్సి వచ్చింది. అక్కడ 23 లక్షల మంది ఆకలి కేకలు వేస్తూ అల్లాడిపోతున్నారు. తీవ్రమైన కరువు పరిస్థితులు ముంచుకొస్తున్నాయి.

నీట్ పేపర్ లీక్‌లో బీజేపీ నాయకుల హస్తం

- ఆ రాష్ట్రాల్లోనే లీకేజీ..
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



నవతెలంగాణ-పెన్‌పహాడ్

నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని, ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని శ్రీ సత్య ఫంక్షన్‌హాల్లో సీపీఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ మూలంగా 24 లక్షల కుటుంబాలు తీవ్ర ఆవేదనలో ఉన్నాయన్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకొని కోచింగులు తీసుకొని పరీక్షలు రాస్తే చివరి నిమిషంలో పేపర్ లీకేజీ, కుంభకోణాలు జరిగి విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాలు బీహార్, గుజరాత్, హర్యాన రాష్ట్రాల్లో లీక్ అయ్యాయని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ముఖ్యంగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీ జరిగిందన్నారు. పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల పాత్ర ఉందని ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. బీహార్ పోలీసులు పరీక్ష పత్రాల లీకేజీకి సంబంధించి 16 మందిని అరెస్టు చేశారని అన్నారు. పేపర్ లీకేజీ వెనుక కోట్లాది రూపాయలు తారుమారయ్యాయని తెలిపారు. గ్రేస్ మార్కులు ఉంటాయని ప్రభుత్వం ముందు చెప్పలేదని, మార్కుల్లో తేడాలు ఎందుకు ఉన్నాయని అడిగితే గ్రేస్ మార్కులు కలిపామని చెబుతోందని, ఎంట్రన్స్ టెస్టులలో ఎప్పుడూ గ్రేస్ మార్కులు వినలేదని అన్నారు. పేపర్ లీకేజీ అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి, ప్రధాని మోడీ నేటికీ నోరు విప్పలేదని విమర్శించారు. దేవుడు తనను పంపించాడని చెప్పిన మోడీకి పేపర్ లీకేజీ విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన నెట్ పరీక్షలలో సైతం అవకతవకలు జరిగాయని వాటిని వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఏ రాష్ట్రం పరీక్షలు ఆ రాష్ట్రమే నిర్వహించేదని, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తూ కేంద్రమే పరీక్షలు నిర్వహిం చడం సరైంది కాదని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కుల వివక్షకు చోటివ్వద్దు

డీఎంకే ప్రభుత్వానికి మాజీ న్యాయమూర్తి సిఫారసులు



చెన్నయ్ : తమిళనాడులోని పాఠశాలల్లో కుల వివక్ష అంతానికి మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె.చంద్రు నేతృత్వంలోని ఏకసభ్య కమిటీ డీఎంకే ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. పాఠశాల ప్రాంగణంలో కులాన్ని సూచించే రంగుతో రిస్ట్‌బ్యాండ్లు లేదా రింగులు వంటి చిహ్నాలు ధరించడాన్ని నిషేధించాలని, పాఠశాల పేర్ల నుండి కుల అనుబంధాలను తొలగించాలని, ఉపాధ్యాయులను నిర్దిష్ట కాలపరిమితిలో బదిలీ చేయాలని సిఫారసు చేసింది.

గత ఏడాది తిరునల్వెల్లిలో ఇద్దరు దళిత విద్యార్థులపై అగ్రకులాలకు చెందిన సహ విద్యార్థులు ఆటవికంగా దాడి చేసిన ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కొద్ది రోజుల క్రితం 610 పేజీలతో కూడిన సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందజేసింది.

పలు జిల్లాల్లో పర్యటించి, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యార్థులతో సమావేశాలు నిర్వహించిన తర్వాత కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. దాడికి గురైన విద్యార్థులను కూడా జస్టిస్ చంద్రు కలిశారు. సమాజంలో వేళ్లూనుకుపోయిన కుల వివక్షను అంతమొందించేందుకు పాఠశాలల్లో చేపట్టాల్సిన చర్యలను ఆయన ప్రభుత్వానికి సూచించారు. కుల వివక్ష, హింస, లైంగిక వేధింపులు, లైంగిక హింస, ఎస్సీ-ఎస్టీలపై జరుగుతున్న వేధింపులను నిరోధించే చట్టం వంటి విషయాలలో 6-12 తరగతుల విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన తెలిపారు. పాఠశాలకు కులాన్ని సూచించే పేరు ఉన్నట్లయితే దానిని తొలగించాలని, తరగతి గదిలో అక్షర క్రమంలోనే సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, హాజరు పట్టీలో విద్యార్థి కులం ప్రస్తావన లేకుండా చూడాలని సిఫారసు చేశారు.

చర్యల అమలును పర్యవేక్షించేందుకు ఎస్‌ఎస్‌ఎస్ తరహాలో సామాజిక న్యాయ విద్యార్థి దళాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్ చంద్రు సూచించారు. ఏదైనా ఓ కులం ప్రభావం ఎక్కువగా ఉన్న చోట ఆ కులానికే చెందిన విద్యాశాఖ అధికారులను నియమించకూడదని చెప్పారు. ఉపాధ్యాయులు, సిబ్బంది కోసం చట్టబద్ధమైన ప్రవర్తనా నియమావళిని రూపొందించాలని కోరారు. కాగా కమిటీ జరిపిన సంప్రదింపుల ప్రక్రియకు పలు పార్టీలు దూరంగా ఉన్నాయి. రిస్ట్‌బ్యాండ్లు, రింగులు ధరించడాన్ని నిషేధించాలని చెప్పడం హిందూ వ్యతిరేకతను సూచిస్తోందని బీజేపీ విమర్శించింది. 'తిలకధారణకు ఎలా అభ్యంతరం చెబుతారు? ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి' అని డిమాండ్ చేసింది. కొన్ని కుల సంఘాలు కూడా నివేదికను విమర్శించాయి.

ప్రజలకు, కార్యకర్తలకు సెల్యూట్

- వచ్చే శాసనసభ ఎన్నికల్లో 88 సీట్లు గెలుస్తాం : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- కార్యకర్తల కృషిని ఎంత కొనియాడినా తక్కువే : ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్
- బేగంపేట నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు తెలంగాణకు సెల్యూట్ ర్యాలీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లేసి ఆదరించిన రాష్ట్ర ప్రజలకు, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిషలు కృషి చేసిన కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సెల్యూట్ చేశారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు గెలవటం, రాష్ట్రానికి మోడీ క్యాబినెట్‌లో రెండు మంత్రి పదవులు దక్కటాన్ని పురస్కరించుకుని తెలంగాణకు సెల్యూట్ పేరుతో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో బేగంపేట నుంచి నాంపల్లిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో కిషన్‌రెడ్డి ఎంపీలు, ఎమ్మెల్యేలను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రానున్న రోజుల్లో ప్రజల ఆశీస్సుల కోసం మరింత పనిచేస్తామని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీ తరఫున 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలుగా గెలిచారనీ, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 88 సీట్లు సాధించి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..బీజేపీ కోసం ప్రాణాలు అర్పించిన కార్యకర్తలకు తెలంగాణ ఎంపీల గెలుపును అంకితం చేస్తున్నామని ప్రకటించారు. సాధారణ కార్యకర్తలుగా రాజకీయ జీవితం ప్రారంభించిన కిషన్‌రెడ్డి, సంజయ్ కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అర్వింద్‌కుమార్, జి.నగేశ్, బీజేపీ ఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి, హరీశ్‌బాబు, రామారావు, వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, సూర్యనారాయణ, పాయల్ శంకర్, పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం : బండి

తెలంగాణలో అధికారంలోకి రాగానే పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన భాగ్యలక్ష్మి టెంపుల్‌ను గురువారం రాత్రి సందర్శించారు. తమ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కార్యకర్తల కష్టార్జితమేనన్నారు. గోల్కొండ కోట మీద జెండా ఎగరవేసే వరకూ పోరాడుతామన్నారు.



రామాయణాన్ని అవమానపరుస్తూ స్కిట్ చేశారనీ..

ఐఐటీ బాంబే విద్యార్థులకు జరిమానా

- ఒక్కొక్కరికి రూ. 1.2 లక్షల వరకు ఫైన్

ముంబయి : భారత్‌లోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో ఒకటైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే (ఐఐటీ బాంబే).. వార్షిక ప్రదర్శన కళల ఉత్సవం సందర్భంగా 'రాహొవన్' అనే నాటకాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1.2 లక్షల వరకు జరిమానా విధించింది. భారతీయ ఇతిహాసం రామాయణంపై ఆధారపడిన ఈ నాటకం.. రాముడిని కించపరిచేలా, హిందూ సంస్కృతిని అగౌరవపరిచేలా ఉన్నదంటూ కొన్ని హిందూత్వ శక్తులు ఆందోళనను వెలిబుచ్చాయి. దీంతో సంస్థ విద్యార్థులపై చర్య తీసుకున్నది. ఇన్స్టిట్యూట్‌లో సెమిస్టర్ ఫీజుకు దాదాపు సమానమైన జరిమానాతో పాటు, గ్రాడ్యుయేట్ చేసిన విద్యార్థులు జింఖానా అవార్డులలో ఎలాంటి గుర్తింపు పొందరు. అదే సమయంలో, వారి జూనియర్లకు ఒక్కొక్కరికి రూ.40,000 జరిమానాతో పాటు హాస్టల్ సౌకర్యాలను పొందకుండా నిషేధం విధించబడింది. మార్చి 31న ఈ నాటకాన్ని వివిధ విభాగాలు, తరగతులకు చెందిన విద్యార్థులు ప్రదర్శించారు. నాటకానికి సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'రాహొవన్' స్కిట్.. ప్రధాన పాత్రలను చెడుగా చూపించిందని ఐఐటీ బాంబేకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సదరు ఇన్స్టిట్యూట్ ఒక క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసింది. చాలా చర్చల తర్వాత, కమిటీ జరిమానా, ఇతర క్రమశిక్షణా చర్యలను విధించింది. కాగా, కొందరు సంస్థ చర్యను తప్పుబట్టారు. విద్యార్థుల స్కిట్‌లో తప్పేమీ లేదని వారికి మద్దతుగా నిలిచారు. అయితే విద్యార్థులపై చర్యపై వ్యాఖ్యానించేందుకు ఐఐటీ బాంబే నిరాకరించింది.

ఉద్యోగ కల్పన అతిపెద్ద సవాల్

- బీజేపీ మెజారిటీ తగ్గడానికి ప్రధాన కారణం
- ఆర్థిక నిపుణుల వెల్లడి



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా చెప్పుకుంటున్నప్పటికీ.. ఉద్యోగ కల్పన అతి పెద్ద సవాల్‌గా ఉంది. వచ్చే ఐదేండ్లలో నిరుద్యోగాన్ని పరిష్కరించడమే అత్యంత కీలకం కానుందని రాయిటర్స్ పోల్‌లో నిపుణులు అభిప్రాయపడ్డారు. మే 15 నుంచి జూన్ 18 మధ్య నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది ఆర్థిక నిపుణులు, విధానవేత్తలు నిరుద్యోగమే అతిపెద్ద సవాల్‌గా నిలువనుందన్నారు. 54 మందిలో 49 మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగాలను కల్పించడంలో లేదా దాని వైఫల్యాన్ని ఖచ్చితంగా అంచనా వేయడంలో ప్రభుత్వ సామర్థ్యాన్ని మెజారిటీ నిపుణులు ప్రశ్నించారు. ఉపాధిలో మార్పులు తీసుకురావడంపై పోషించాల్సిన పాత్రను వారు నొక్కి చెప్పారు. రాయిటర్స్ రిపోర్ట్ వివరాలు.. గత ఆర్థిక సంవత్సరం భారత్ 8 శాతం పైగా వృద్ధి నమోదు చేసింది. ప్రభుత్వ మూలధన వ్యయం ఇందుకు మద్దతు నిచ్చింది. అసమానతలు, ద్రవ్యోల్బణం ఒత్తిడి, మంచి జీతాలు ఇచ్చే ఉద్యోగాలు సృష్టించలేకపోవడం తదితర కారణాల వల్లే ప్రధానీ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని బీజేపీ ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికలలో భారీగా మెజారిటీని కోల్పోయింది. "ప్రభుత్వం ఉద్యోగ కల్పన కోసం నిర్దిష్ట వ్యూహాన్ని కలిగి ఉండాలి. ప్రాథమిక సామాజిక సేవలు అయినా ఆరోగ్యం, విద్య, పోషకాహారం, పారిశుద్ధంలో ప్రభుత్వ ఉపాధిని భారీగా పెంచాలి." అని నిపుణులు సూచించారు.

"భారత్‌లో మనకు చాలా విచిత్రమైన సమస్య ఉంది. వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఉపాధిలో పెరుగుదల లేదు. యువతకు ఉద్యోగాలు, మెరుగైన జీవితాన్ని అందిస్తామని మోడీ అధికారంలోకి వచ్చారు. కానీ పరిస్థితులు చాలా దారుణంగా మారాయి" అని మసాచుసెట్స్ అమ్హెర్స్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయతి ఘోష్ అన్నారు. "ప్రతి సంవత్సరం లక్షలాది మంది శ్రామికశక్తిలోకి ప్రవేశించడానికి అవసరమైన ఉద్యోగాలను ప్రభుత్వం మాత్రమే సృష్టించలేదని.. ప్రయివేటు రంగంలోనూ అధిక, స్థిరమైన పెట్టుబడితో ముందుకు సాగాలి" అని ముంబయిలోని ఇందిరా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ నుండి ఆర్థికశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ రాజేశ్వరి సేన్‌గుప్తా అన్నారు. ప్రభుత్వ ప్రయివేటు పెట్టుబడులకు అవరోధాలను గుర్తించాలని.. విధానపరమైన అడ్డంకులను తొలగించాలని సేన్‌గుప్తా పేర్కొన్నారు. దేశంలోని 80 శాతం మంది కూడా అసంఘటిత రంగంలోనే ఉన్నారని ఇటీవల ఆర్‌బీఐ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. దేశంలోని చాలా శ్రామిక శక్తి అనధికారిక రంగంలో ఉందని.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వారిని నిరుద్యోగులుగా నమోదు చేయడం లేదని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొఫెసర్ బీనా అగర్వాల్ అన్నారు.

రాకాసి 'వాయు కాలుష్యం'



ప్రపంచవ్యాప్తంగా 81 లక్షల మంది మృతి

భారత్‌లో 21 లక్షల మంది : స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్

న్యూఢిల్లీ : గాలి కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను కలవర పెడుతున్నది. ఈ ప్రాణాంతక కాలుష్యం నానాటికీ పెరుగుతూ ప్రజల ప్రాణాలను తీస్తున్నది. వాయు కాలుష్యం 2021లో ప్రపంచవ్యాప్తంగా 81 లక్షల మంది మరణాలకు కారణమైంది. భారత్, చైనా వంటి దేశాల్లో దీని నష్టం ఎక్కువగా ఉన్నది. చైనాలో 23 లక్షల మంది, భారత్‌లో 21 లక్షల మంది గాలి కాలుష్యం కారణంగా ప్రాణాలు వదిలారు. ఇటీవల విడుదల చేసిన స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్ ఈ విషయాన్ని వెల్లడించింది.

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. "వాయు కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ ప్రాణాంతకమైనవాటిలో ఒకటి. 'అధిక రక్తపోటు' అనేది తర్వాతి స్థానంలో ఉన్నది. వాయు కాలుష్యం ప్రజారోగ్యానికి సవాలుగా మారింది. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి అస్పష్టంగా ఉన్నప్పటికీ, వాయు కాలుష్య అత్యధిక భారాన్ని భరించే దేశాలలో భారత్ ఒకటి. వాయు కాలుష్యం కారణంగా 21 లక్షల మంది మరణించారు. భారత్, చైనాల నుంచి గాలి కాలుష్య మరణాల వాటా ప్రపంచవ్యాప్తంగా 55 శాతంగా ఉన్నది. 2021లో ప్రపంచవ్యాప్తంగా 489,000 మరణాలు ఓజోన్ ఎక్స్పోజర్ కారణంగా సంభవించాయి. వీటిలో దాదాపు 50 శాతం(237,000 మరణాలు) మరణాలు భారత్‌లోనే జరిగాయి. 2021లో కనీసం 169,400 మరణాలు వాయు కాలుష్యం కారణంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో అత్యధిక కాలుష్య-సంబంధిత మరణాలను భారత్ నివేదించింది" అని నివేదిక వెల్లడించటం గమనార్హం.

నీట్ లీక్ నిజమే..

బీహార్ పోలీసులకు విద్యార్థి వాంగ్మూలం..

(మొదటి పేజీ తరువాయి)

అంగీకరించారు.మరోపక్క నీట్ లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బీహార్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బందం(సిట్)ను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకూ సిట్ అధికారులు 14 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ఒక జూనియర్ ఇంజినీర్, ముగ్గురు నీట్ అభ్యర్థులు ఉన్నారు. ఈ నలుగురిలో ఓ నీట్ అభ్యర్థి.. జూనియర్ ఇంజినీర్‌కు మేనల్లుడని తెలుస్తోంది.నీట్ పరీక్షకు హాజరైన సదరు విద్యార్థి పోలీసుల విచారణలో స్పందిస్తూ.. 'రాజస్థాన్‌లోని కోటాలో నేను నీట్ కోసం ప్రిపేరవుతున్నా. మా మామయ్య ఫోన్ చేసి, నీట్ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశా.. ఇంటికి రమ్మన్నారు. గత నెల ఐదో తేదీన నీట్ పరీక్షకు ఒక రోజు ముందు రాత్రి నా మిత్రులతో కలిసి మామయ్య ఇంటికి వెళ్లా.. అక్కడ నాకు నీట్ ప్రశ్నాపత్రం, ఆన్సర్ షీట్ ఇచ్చారు. ఆ రాత్రంతా వాటిని కంఠస్థం చేశాం. ఐదో తేదీన పరీక్షా కేంద్రంలో మాకు ఇచ్చిన ప్రశ్నాపత్రం.. ముందు రోజు మా మామయ్య ఇచ్చిన పేపర్ ఒక్కటే అని తేలింది' అని చెప్పాడు. ఇదే విషయమై రాత పూర్వకంగా రాసివ్వడంతో నీట్ యూజీ 2024 అక్రమాల వ్యవహారం మరింత తీవ్రమైంది.అయితే బీహార్‌లో నీట్ పరీక్షా పత్రం లీకేజీ కోసం సంబంధిత ముఠా రూ.32 లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తున్నది. అలా లీకైన ప్రశ్నాపత్రం అందుకున్న విద్యార్థుల్లో ఒకరికి 720 మార్కులకు 185, మరొకరికి 300, మరో ఇద్దరికి 581, 483 మార్కులు వచ్చాయని తెలుస్తున్నది.

వరుస లీకులపై చర్యలేవీ..?

- పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ విఫలం
- అధికారులపై విచారణ జరపాలి
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరీక్షలను నిర్వహించడంలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యతారహితంగా వ్యవహరించడాన్ని ఖండించారు. ఎన్టీఏ ప్రారంభం నుంచి విద్యావ్యవస్థను అపహాస్యం చేస్తున్నదని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో అది అసమర్థంగా వ్యవహరించిందని తెలిపారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, సీయూఈటీ పరీక్షలో పొరపాట్లు, ఇప్పుడు యూజీసీ నెట్ పరీక్షను సమగ్రంగా నిర్వహించడంలో విఫలమైందని విమర్శించారు. యూజీసీ నెట్ రాతపరీక్షను రద్దు చేసిందని తెలిపారు. విద్యారంగంలో సమస్యలు తీవ్రమవుతున్నా కేంద్ర విద్యాశాఖ మంత్రి పరిష్కరించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. తక్షణమే ఆ పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని, పరీక్షలను కేంద్రీకృతం చేసి ప్రయివేటు కోచింగ్ సెంటర్లు, సంస్థలను ప్రోత్సహించడాన్ని తీవ్రంగా ఖండించారు. మతోన్మాదాన్ని పెంచే దృష్టితో ఎన్ఈపీలో భాగంగా ఎన్టీఏను కేంద్రం ప్రారంభించిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ అవకతవకలకు పాల్పడుతున్నదనీ, ఆ అధికారులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

రష్యా-ఉత్తర కొరియా రక్షణ బంధం!

రష్యా-ఉత్తర కొరియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవటం ప్రపంచ పరిణామాల్లో ఒక ముఖ్యమైన అంశం. ఇరవై నాలుగేండ్ల తరువాత రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ ఉత్తర కొరియా సందర్శనలో సంతకాలు చేశారు.తమ కంట్లో నలుసుగా, పంటికింద రాయిగా, కాళ్లో ముల్లుగా ఉన్న దేశాలను అణగదొక్కేందుకు చూస్తున్న అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలకు సహజంగానే ఇది మింగుడు పడక చిందులు వేస్తున్నది. ఉక్రెయిన్‌తో పదేండ్ల రక్షణ ఒప్పందాన్ని అమెరికా కుదుర్చుకున్నపుడు లేని రచ్చ ఇప్పుడెందుకు ? తన అణుకార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు, పదును

> బంగ్లాదేశ్ విముక్తికి మన దేశం మిలిటరీని పంపి సాయం చేసినపుడు మనల్ని బెదిరించేందుకు అమెరికా బంగాళాఖాతంలోకి సప్తమ నౌకా దళాన్ని దించింది. అప్పుడు నాటి సోవియట్ యూనియన్‌తో మనదేశం కూడా ఇలాంటి రక్షణ ఒప్పందమే చేసుకోవటంతో అమెరికా తోకముడిచింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరిగింది. రష్యా, ఉత్తర కొరియా మరింత దగ్గరయ్యాయి. రెండు దేశాల మీద సామ్రాజ్యవాద కూటమి అమలు జరుపుతున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు కూడా ఉపయోగపడుతుంది.


పెంచేందుకు ఈ ఒప్పందం గురించి అమెరికా తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఉత్తర కొరియా అందిస్తున్న ఆయుధాలకు ప్రతిగా దాని అణు కార్యక్రమానికి, ఖండాంతర క్షిపణుల వృద్ధి, అణు జలాంతర్గాముల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, యుద్ధ విమానాలు,సాయుధ శకటాలను అందించనుందని అంటున్నది. ఇదంతా పశ్చిమ దేశాలను మరింతగా భయపెట్టి తన కౌగిట్లో బంధించుకొనేందుకు, వాటితో పెద్ద మొత్తంలో ఆయుధాలను కొనిపించేందుకు అన్నది స్పష్టం.నాటో కూడా దానికి తానతందాన అన్నది. అసలు ఒప్పంద పత్రాన్ని ఇంతవరకు ప్రకటించలేదు, దానిలో ఉన్న అంశాలేమిటో తెలియకుండానే ఇలా చెప్పటంలో ఆశ్చర్యం లేదు.



పశ్చిమ దేశాలు ఇస్తున్న ఆయుధాలను ఆత్మరక్షణకే గాక అవసరమైతే రష్యా భూభాగాలపై దాడులు చేసేందుకు కూడా జెలెన్‌స్కీ సేనలకు అనుమతి ఇచ్చిన అంశం తెలిసిందే. తెలివితేటలు పశ్చిమదేశాల గుత్త సొత్తేమీ కాదు. ఎవరి తురుపు ముక్కలు వారికి ఉంటాయి.కంటికి కన్ను పంటికి పన్ను మాదిరి ఉంటేనే అగ్రరాజ్యం ఒళ్లు దగ్గర పెట్టుకొని ఉంటుంది.రష్యాకు వ్యతిరేకంగా, అసలు సమస్య నుంచి ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు స్విట్జర్లాండ్‌లో నిర్వహించిన ఉక్రెయిన్ శాంతి సభ సాధించేందేమీ లేదు. అమెరికా కూటమికి చెంపపెట్టుగా దానికి హాజరైన అనేక ముఖ్యదేశాలు సమావేశ ప్రకటనపై సంతకాలు చేసేందుకు తిరస్కరించాయి. హాజరైన 90దేశాలలో భారత్, బ్రెజిల్, మెక్సికో, ఇండోనేషియా వంటి పన్నెండు దేశాలు వాటిలో ఉన్నాయి. సం తకం చేసిన ఇరాక్, జోర్డాన్ తరువాత ఉపసంహరించు కున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సమావేశానికి రష్యాను పిలవలేదు, ఆహ్వానం అందుకున్న చైనా తిరస్కరించింది. రష్యా లేకుండా ఆ సభ సాధించేదేమీ ఉండదని చెప్పింది. కొలంబియా చివరి నిమిషంలో తాము హాజరు కావటం లేదని తెలిపింది.

ఉక్రెయిన్ సంక్షోభ నేపథ్యంలోనే రష్యా-ఉత్తర కొరియా ఒప్పందం అన్నది స్పష్టం.ఉక్రెయిన్‌పై సైనిక చర్య జరుపుతున్న రష్యాకు ఉత్తర కొరియా అందిస్తున్న మందుగుండు, రాకెట్ల గురించి పశ్చిమదేశాలు గుర్రుగా ఉన్నాయి.రష్యాకు సరఫరా అవుతున్న 48లక్షల ఫిరంగి గుండ్లున్న కంటెయినర్లను తాము కనుగొన్నట్లు అమెరికా ఫిబ్రవరిలో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత నాటి సోవియట్ యూనియన్, ఉత్తర కొరియా, చైనాలను బెదిరించేందుకు, అవసరమైనపుడు దాడులు చేసేందుకు వీలుగా అమెరికన్లు దక్షిణకొరియా, జపాన్‌లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయటమేగాక జపాన్‌తో రక్షణ ఒప్పందం కూడా చేసుకుంది. ఇప్పుడు ఉత్తర కొరియాతో రష్యా అదే చేసింది. దీని ప్రకారం మూడోపక్షం లేదా కూటమి ఎవరి మీద దాడి చేసినా ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు అవకాశం కల్పిస్తుంది. బంగ్లాదేశ్ విముక్తికి మన దేశం మిలిటరీని పంపి సాయం చేసినపుడు మనల్ని బెదిరించేందుకు అమెరికా బంగాళాఖాతంలోకి సప్తమ నౌకా దళాన్ని దించింది. అప్పుడు నాటి సోవియట్ యూనియన్‌తో మనదేశం కూడా ఇలాంటి రక్షణ ఒప్పందమే చేసుకోవటంతో అమెరికా తోకముడిచింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరిగింది. రష్యా, ఉత్తర కొరియా మరింత దగ్గరయ్యాయి. రెండు దేశాల మీద సామ్రాజ్యవాద కూటమి అమలు జరుపుతున్న ఆంక్షలను ఎదుర్కొనేందుకు కూడా ఉపయోగ పడుతుంది. పశ్చిమ దేశాలతో సాగుతున్న వైరుధ్యాలు ఇప్పటికిప్పుడు సమిసేవికాదు. ఇప్పటికే చైనాతో ఎంతో దగ్గరైన రష్యా మరొక ముందడుగువేసి ఉత్తర కొరియాతో మైత్రిని పటిష్టం చేసుకోవటమే కాదు పశ్చిమ దేశాలతో పోరాడే సామర్థ్యాన్ని కూడా పెంచుకున్నట్లయింది. ఉత్తర కొరియా కూడా ఎవరిని చూసీ భయపడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవైపు రష్యా, మరొకవైపు చైనా రక్షణ కవచాల్లా ఉంటాయి.

అయోతీ థాస్: తొలి కులరహిత ద్రవిడోద్యమ మార్గదర్శి



డాక్టర్ దేవరాజు మహారాజు

"స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి, దేశభక్తి గురించి, స్వదేశీ జాగరణ గురించి మాట్లాడి జనాల నుండి చందాలు వసూలు చేసుకునే ఈ రాజకీయ నాయకులు ప్లేగు వంటి వ్యాధులు ప్రబలినప్పుడు, కరువు కాటకాలు వచ్చినపుడు అడ్రసు లేకుండా పోతారు. ప్రజల కన్నీళ్లు తుడవడానికి ఎవరూ రారు. వారికి అందించాల్సిన కూడు, నీడా వంటి కనీసావసరాలు అందించరు. కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ నాయకులు కలలో కూడా అనుకోరు. వారు చేప్పే దేశభక్తి అంతా వారి స్వార్థ ప్రయోజనాల కోసమే - అని ప్రజలు గ్రహించాలి!" అని 'తమిళన్' అక్టోబర్ 23, 1912 నాటి సంచికలో ఆ పత్రికా సంపాదకుడు సి.అయోతీ థాస్ రాజకీయ వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. దాంతో దక్షిణ భారత దేశం ఉలిక్కిపడింది. ఎవరీ అయోతీ థాస్ అని తెలుసుకోవడం ప్రారంభించింది.

దక్షిణ భారతదేశంలో కులాన్ని ప్రశ్నిస్తూ తొలిసారి గొంతెత్తిన కార్యకర్త-అయోతీ థాస్. ఆది ద్రావిడ నేపథ్యం నుండి వచ్చిన ఆయన రాజకీయం, సాహిత్యం, మతం వంటి అనేక రంగాలలో అవిరళ కృషి చేసినవారు. తమిళ పండితుడు, వృత్తి రీత్యా సిద్ధ వైద్యుడు. పందొమ్మిదవ శతాబ్దం చివరలో ఆది ద్రావిడ ప్రజల అభ్యున్నతి కోసం నడుం బిగించి 1891లో 'కుల రహిత ద్రవిడ మహాసభ'ను స్థాపిం చారు. ఈ విషయంలో రెట్టమలై శ్రీనివాసన్ అనే మరో సంఘ సంస్కర్త ఈయనకు సహకరించారు. బౌద్ధం స్వీకరించిన అయోతీ థాస్, పరయల (మాలల) అసలు మతం బౌద్ధమని తేల్చారు. అందరినీ అందులోకి మారమని సూచించారు. కులరహిత సమాజం బౌద్ధం ద్వారానే సాధ్యమని ఉద్బోధించారు.

తరతరాలుగా వైష్ణవ సంప్రదాయంలో కూరుకుపోయిన కుటుంబం వీరిది. అయినప్పటికీ తన హేతుబద్ధమైన ఆలోచనలతో బ్రాహ్మణాధిపత్యాన్ని మతపరమైన పెత్తందారీ పోకడల్నీ అయోతీథాస్ పక్కకు తొలగిస్తూ వచ్చారు. ఆ కాలంలోనే అంటే 19వ శతాబ్దపు చివరికాలంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం సంస్థలు హిందూ మత పునరుద్ధరణకు పూనుకున్నాయి. 1861-91 మధ్య కాలంలో క్రైస్తవులు, ముస్లింలు మినహా మిగిలిన వారందరినీ బలవంతంగా హిందువులుగానే పరిగణించారు. అయితే అయోతీ థాస్ 'హిందూ' అనే గుర్తింపును నిరాకరించారు. కారణమేమంటే హిందూను గుర్తిస్తే అందులో ఉన్న కుల నిర్మాణాన్ని, నిచ్చెనమెట్ల కుల సంస్కృతిని, అసమానతలను స్వీకరించాలి. అందు కని ఆయన దాన్ని తిరస్కరించడంతో పాటు, తన అనుయాయులందరినీ తిరస్కరించమని సూచించారు. కుల హింసలను గుర్తు చేసుకుని, ఆది ద్రావిడుల్ని ఆ పరిధిలోంచి బయటికి రమ్మని పిలుపు నిచ్చారు. అప్పుడే తమిళ శైవమతంలో కూడా పునరుద్ధరణకు ప్రయత్నాలు జరిగాయి. ఇది బ్రాహ్మణ వ్యతిరేకత గురించి మాట్లాడింది కానీ, కుల నిర్మూలన గురించి మౌనంగానే ఉంది. అందువల్ల అయోతీ థాస్ శైవమతం స్వీకరించలేదు.పైగా శైవమతం వైపు కూడా ఆకర్షితులు కాకూడదని తనవారికి ఉద్బోధించారు.

ఈ ప్రయత్నాలు ఇలా ఉండగా అయోతీథాస్ రాజకీయంగా కూడా కొన్ని ప్రయత్నాలు చేశారు. తను స్థాపించిన 'కుల రహిత ద్రావిడ మహాసభ' పక్షాన 10 డిమాండ్లతో ఒక వినతి పత్రం తయారు చేసి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి పంపారు. వారు వాటిని తమ 12వ సమావేశంలో చర్చించారు కూడా! అయితే, అందులో ఒక్క డిమాండుకు కూడా సుముఖత వ్యక్తపరచలేదు. ఆ డిమాండ్లలో ఉచిత విద్య, బంజరు భూముల కేటాయింపు, పరయల (మాలల) ఆలయ ప్రవేశం మొదలైనవి ఉన్నాయి. ఆలయ ప్రవేశం ఇక్కడ భక్తికి సంబంధించిన విషయం కాదు. మనుషులుగా సమానహోదా, సమాన హక్కుకు సంబంధిం చిన విషయం. కాంగ్రెస్ పార్టీతో పని కాలేదని అయోతీ థాస్ తన ప్రయత్నం మానుకోలేదు. ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ప్రారంభించారు. ఎమ్.వీర రాఘవా చారియర్, జి. సుబ్ర హ్మణ్య అయ్యర్, సి.ఆనందాచార్లు కలిసి 1884లో 'మద్రాస్ మహాజనసభ'ను స్థాపించారు. ఇది కాంగ్రెస్‌కు ప్రత్యా మ్నాయం కాగలదని భావించారు. లోగడ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అవే పది డిమాండ్ల వినతిపత్రం అయోతీ థాస్ మళ్లీ ఈ మద్రాసు మహాజనసభకు పంపిం చారు. కానీ, అక్కడా చుక్కెదురైంది. నిర్వాహక సభ్యులు వినతి పత్రాన్ని తిరస్కరించడమే కాదు, ఆయనను ఘోరంగా అవమానించారు.



> తరతరాలుగా వైష్ణవ సంప్రదాయంలో కూరుకుపోయిన కుటుంబం వీరిది. అయినప్పటికీ తన హేతుబద్ధమైన ఆలోచనలతో బ్రాహ్మణాధిపత్యాన్ని మతపరమైన పెత్తందారీ పోకడల్నీ అయోతీథాస్ పక్కకు తొలగిస్తూ వచ్చారు. ఆ కాలంలోనే అంటే 19వ శతాబ్దపు చివరికాలంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం సంస్థలు హిందూ మత పునరుద్ధరణకు పూనుకున్నాయి. 1861-91 మధ్య కాలంలో క్రైస్తవులు, ముస్లింలు మినహా మిగిలిన వారందరినీ బలవంతంగా హిందువులుగానే పరిగణించారు. అయితే అయోతీ థాస్ 'హిందూ' అనే గుర్తింపును నిరాకరించారు. కారణమేమంటే హిందూను గుర్తిస్తే అందులో ఉన్న కుల నిర్మాణాన్ని, నిచ్చెనమెట్ల కుల సంస్కృతిని, అసమానతలను స్వీకరించాలి. అందు కని ఆయన దాన్ని తిరస్కరించడంతో పాటు, తన అనుయాయులందరినీ తిరస్కరించమని సూచించారు. కుల హింసలను గుర్తు చేసుకుని, ఆది ద్రావిడుల్ని ఆ పరిధిలోంచి బయటికి రమ్మని పిలుపు నిచ్చారు.

జరిగిన అవమానంతో అయోతీ థాస్ తీవ్రమైన మనోవేదనకు గురయ్యారు. తాము హిందు వులమే అయితే జాతి విచక్షణ ఎందుకూ? కుల దూషణలెందుకూ? దేవుడు అందరివాడైనప్పుడు ఆలయ ప్రవేశం తమకెందుకు ఉండదూ? వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఆయన వాటికి సమాధానాలు కనుగొనే ప్రయత్నంలో వేదాలు, బ్రాహ్మణత్వం, ఆచారాలు వంటి వాటి గూర్చి అధ్య యనం ప్రారంభించారు. విషయాలు అర్థమౌతున్నకొద్దీ ఆయనలో ఒక ఉద్యమకారుడు రూపుదిద్దుకో సాగాడు. 1870 దశకంలో తన పాతికేండ్లప్రాయంలో తమిళనాడు నీలగిరి ప్రాంతంలోని తోడర్- కొండజాతులను సమైక్య పరిచి 1875లో అద్వైతా నంద సభకు రూపకల్పన చేశారు. అప్పుడే రెవరెండ్ జాన్ రథినమ్‌తో పరిచయం ఏర్పడింది. ఈయన మద్రసులో ఆది ద్రావిడుల కోసం నెస్లియన్ మిషన్ పాఠశాల నిర్వహిస్తున్నా డు. ఆయన పరిచయంతో అయోతీ థాస్‌కు కొత్త ఉత్సాహం లభించింది. దాంతో 1885లో 'ద్రవిడ పాండ్యన్' అనే వార్తా పత్రికను ప్రారంభించాడు. ఎప్పటి నుంచో చేస్తూ వచ్చిన అధ్యయనాల కారణంగా ఒక సంవత్సరం తర్వాత 1886లో "ఆది ద్రావిడులు హిందువులు కారు" - అని భారతదేశ చరిత్రలోనే ఒక విప్లవాత్మకమైన ప్రకటన చేశారు.

1891లో ద్రవిడ మహాసభను స్థాపించి, ఆది ద్రావిడులకు ఒక పిలుపునిచ్చారు. వారంతా తమను తాము హిందువులుగా కాక, 'కుల రహిత తమిళులు'గా ప్రకటించుకోవాలని కోరారు. ఆ రోజుల్లో అదొక సాహసోపేతమైన చర్య. ఈ రోజుల్లో కొందరు ప్రభుత్వ వ్యవస్థలతో పోరాడి, కులరహిత సర్టిఫికేట్లు తీసుకుంటున్న సంగతి మనకు తెలుసు. కానీ, ఇప్పటికి 130 ఏండ్ల ముందు ఆ ప్రకటన చేయడమంటే-ఆయన ఎంత ధైర్యం చేసి ఉండాలీ? ఎంత ముందు చూపు ఉండి ఉండాలీ? ఒకసారి అయోతీ థాస్ తన అనుచరులతో థియాసాఫికల్ సొసయిటీ వ్యవస్థాపక అధ్యక్షుడయిన కొలొనెల్ హెచ్.ఎస్.ఓల్కాట్‌ను కలుసుకున్నారు. బౌద్ధం స్వీకరించాలన్న తన కోర్కెను ఆయనకు తెలియజేశారు. ఆయన అయోతీ థాస్ శ్రీలంకకు వెళ్లే ఏర్పాటు చేశాడు. శ్రీలంకలో అయోతీ థాస్ సింహళ బౌద్ధ భిక్షువు సుమంగళ నాయక్ నుండి ధమ్మదీక్ష స్వీకరించారు. చెన్నై తిరిగివచ్చాక 1898లో 'శాక్య బౌద్ధ సంఘాన్ని' స్థాపించి దాన్ని శాఖోపశాఖలుగా విస్తరింపజేశారు. ఈయన అప్పుడు ఏర్పాటు చేసిన శాక్య బౌద్ధ సొసయిటీయే కాలక్రమంలో ఇండియన్ బుద్దిస్ట్ అసోసియేషన్‌గా మారిపోయింది. తర్వాత కాలంలో బౌద్ధానికి సంబంధించి అనేక శాఖలు, సంఘాలు ఏర్పడుతూ వచ్చాయి.

ద్రవిడ ఉద్యమ పితామహుడిగా నిలిచిన అయోతీ థాస్, రచయితగా చేసిన కృషి కూడా తక్కువది కాదు. 1.అంబికయ్యన్ కథ 2.ఇంద్ర జాతి చరిత్ర 3.ఇంద్ర దేశ బౌద్ధపండుగలు 4.శాక్య మహర్షి చరిత్ర 5.తిరుక్కురల్ దేవునికి శుభాకాంక్షలు 6.తిరువళ్లువర్ చరిత్ర 7.నందన్ చరిత్ర 8. ఆధునిక కులాల్లో భయాందోళనలు 9. బుద్ధుడు రాత్రీ పగలు లేని కాంతి 10.మురుగ భగవానుని చరిత్ర 11.వివాహ వివరణ 12. ప్రాచీన తమిళ భాష బుద్ధుడు ఆదివేదం 13.వేష బ్రాహ్మణవేదాంత వివరణ-మొదలైనవి.

'అయోతీ థాస్'గా ప్రసిద్ధుడైన ఈయనను తల్లిదండ్రులు పెట్టిన పేరు కథవ రాయన్. ఇప్పుడు ఆ పేరు చెబితే ఆయనను ఎవరూ గుర్తుపట్టరు. అయోతీ థాస్ అనేది ఆయనకు ఆయనే పెట్టుకున్న పేరు. బాల్యంలో ఈయన అయోధ్య దాసర్ పండిట్ అనే ఉపాధ్యాయుడి వద్ద చదువు నేర్చుకున్నారు. తమిళం, ఇంగ్లీషు, పాళీ భాషల్ని, తత్త్వశాస్త్రాన్ని, సిద్ధ వైద్యాన్నీ ఇలా అనేక విషయాలు నేర్చుకున్నారు. అందువల్ల గురువుగారిపట్ల ఆ బాలుడికి ఏర్పడ్డ గౌరవభావంతో తన పేరు కూడా అయోధ్య దాసర్‌గా చెప్పుకునేవాడు. అంటే తను కూడా గురువంతటి వాణ్ణి కావాలన్న ఆకాంక్ష అతనితో అలా చేయించింది. ఆ పేరే స్థిరపడి అయోతీ థాస్‌గా మారింది. తమిళ పలుకుబడి థాస్ అంటే మన తెలుగులో దాసుడు అనే అర్థం.

వీరిది విద్యావంతుల కుటుంబం. ఈయన తండ్రి కాంతప్పన్, ఫ్రాన్సిస్ వైటీ ఎల్లిస్ అనే బ్రిటీషు అధికారి దగ్గర పనిచేసేవాడు. తన కుటుంబం తరతరాలుగా భద్రపరుచుకుంటూ వచ్చిన తిరుక్కురల్, నాలదియార్‌లను కాతప్పన్ ఫాన్సిస్ ఎల్లిస్‌కు తాళపత్రాలలో అందిస్తే - ఆయన వాటి విలువను గ్రహించి, ఇంగ్లీషులోకి అనువదించాడు. తర్వాత పుస్తకాలుగా ముద్రించి ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆ రకంగా తమిళుల సాంస్కృతిక సంపదైన తిరుక్కురల్ వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకుంటూ ఉంటే - మన తెలుగు కవి వేమన పద్యాలను సేకరించి, ఇంగ్లీషులోకి అనువదించి ప్రపంచానికి పరిచయం చేసిన మన ఛార్లెస్ ఫిలిప్, బ్రౌన్ (1798-1884) గుర్తుకొస్తారు.

అయోతీ థాస్ 20 మే 1845న రోయపెట్ట, మద్రాసులో జన్మించారు. మళ్లీ అదే మే నెల 5వ తేదీన 1914లో 69వ యేట కన్నుమూశారు. తండ్రి ఉద్యోగం కారణంగా వీరి కుటుంబం నీలగిరికి వలస వెళ్ళింది. ఒక రకంగా పెరియర్, ద్రవిడర్ కజగమ్, బి.ఆర్.అంబేద్కర్‌లకు ఈయనే స్ఫూర్తి ప్రదాత! ఈయన మరణించిన చాలా కాలానికి ఆయుర్వేదం, యునాని వంటి వైద్య విధానాలతో పాటు సిద్ధ మెడిసిన్‌ను కూడా ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గుర్తించింది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిద్ధ - ను మాజీ భారత ప్రధాని డా.మన్‌మోహన్‌సింగ్ ప్రారంభించారు. చాలాకాలం అయోతీ థాస్ పేరు మరుగున పడిపోయింది. అయితే తన దళిత సాహిత్య అకాడెమీ పక్షాన ఇజిల్ మలై(గతంలో కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రిగా పనిచేశారు) అయోతీ థాస్ రచనల్ని మళ్లీ వెలుగులోకి తెచ్చారు. కేంద్ర మంత్రిగా పని చేసిన అంబుమణి రామ్‌దాస్ చొరవతో కూడా అయోతీ థాస్ జీవనం - కృషి ఈ తరానికి పరిచయమయ్యాయి.

- సుప్రసిద్ధ సాహితీ వేత్త, విశ్రాంత ప్రొఫెసర్ (మెల్బోర్న్ నుంచి)

బలమైన ప్రతిపక్షం తప్పనిసరి



కె.శాంతారావు
9959745723

ప్రజాస్వామ్యానికి పాలకపక్షం - ప్రతిపక్షం రెండూ రెండు కండ్లలాంటివి. కండ్లు సమంగా ఉంటేనే చూపు సరిగా ఉంటుంది. ప్రతిపక్షం ధీటుగా ఉంటేనే పాలకపక్షం సక్రమంగా వ్యవహరించగలు గుతుంది. కాబట్టి ప్రజాస్వామ్యం సజీవ ఆరోగ్య మనుగడకు బలమైన ప్రతిపక్షం తప్పనిసరి. స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి కమ్యూనిస్టులు ఈ పనిచేసారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు అలా చెక్ పెట్టారు. ప్రతి అంశంలో చాలా పకడ్బందీగా, నిర్మాణాత్మకంగా వ్యవహరించడం వలనే నెహ్రూ ప్రభుత్వం కొంతలో కొంతైనా ప్రజానుకూలంగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడింది.

సైద్ధాంతిక విభేదాలతో సాగే పాలక-ప్రతిపక్షం సభ్యుల చర్చల సరళి అటు పార్లమెంటులోనూ, ఇటు పార్ల మెంటు బయటా ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ప్రజల రాజకీయ చైతన్యాన్ని విజ్ఞానదాయకంగా పెంచేది. పత్రికలు మీడియా హుందాగా నడిచేవి. నేతల ఉపన్యాసాల్లో రాతల్లో ఆ భాషా సంస్కారం, రాజకీయ పరిణితి, సైద్ధాంతిక పరిపక్వత, చమత్కారం ప్రస్ఫుటించేవి. అంతిమంగా అవి ప్రజాస్వామ్యం ఉద్దీపనగావడానికి ఎంతగానో తోడ్పడేవి.



కానీ మనది భూస్వామ్య పెట్టుబడిదారీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వం గనుక దాని పరిమితులు దానికి ఉంటాయి. అలాగే ఆ వర్గస్వభావమూ ఉంటుంది. ఆ దోపిడీ పీడన పాలనాంగాల్లో, చర్యల్లో అది వ్యక్తం అవుతూనే ఉంటుంది. వీర తెలంగాణా సాయుధ పోరాట కాలంలో నిజాం పోలీసులతో పాటు నెహ్రూ పటేల్ సైన్యం ఘాతుకాలకి వేలాదిమంది ప్రజానీకం బలికావడం తెలిసిందే. ఆ నిరుపేద ప్రజానీకం భయంకర నిర్బంధ చిత్రవధలకు గురవ్వడం. ప్రజానాయకులు అజ్ఞాతవాసాలకు వెళ్లడం. ప్రజల్ని క్రూరంగా పీడించిన దొరలూ దేశ్‌ముఖ్‌లే తిరిగి కాంగ్రెస్ నేతలుగా చెలామణిగావడం అందరూ ఎరిగిందే.

ఈ నేపథ్యంలో ప్రపంచంలో తొట్టతొలిసారిగా ఎన్నికల ద్వారా ఎన్నికైన కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ఘనత ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్‌దే. 1957లో సంభవించింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం ఉందని భారత ప్రజలకు చూపింది కమ్యూనిస్టులే. దున్నేవానికే భూమి చెందాలని భూ సంస్కరణలు ప్రవేశపెట్టడం. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలపెంపు (సమాన పనికి సమానవేతనం) ఉపాధి కల్పనకై కొత్తగా ప్రయివేటు పెట్టుబడుల ఆకర్షణ, ప్రయివేటు పాఠశాలలో సైతం ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకం మొదలైన చర్యలకు, ఆ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు ఇవి ప్రత్యామ్నాయ విధానాలు. ఎక్కడ ఇవి ప్రజల్లో పాతుకు పోతాయేమోననే భయంతో 1959లో కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇ.ఎం.ఎస్. ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించింది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించడం అంటే రాష్ట్రాల హక్కులను అంటే ఆ రాష్ట్ర ప్రజల ప్రజాస్వామిక హక్కులను సామూహికంగా కాలరాయడమే. అలా ఇప్పటివరకు దాదాపు 125 సార్లు కేంద్రం, వివిధ రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించింది అంటే ఆ విధంగా ప్రతిపక్షాల నోళ్లు నొక్కేయడంగానే భావించాలి.

ఈ పరిస్థితుల్లో ఇప్పటి 18వ లోక్‌సభ ఎన్నికల పరిశీలించినట్లయితే బీజేపీ - ఎన్డీయే కూటమి గెలిచి ఓడినట్టుగా ఫీలవుతుంటే, కాంగ్రెస్ - ఇండియా కూటమి ఓడి గెలిచినట్టుగా సంబరపడిపోతున్నది. ప్రజానీకం కూడా ఈ మార్పును అర్థం చేసుకోగలుగుతున్నది. తమకు ఎదురేలేదనుకున్న బీజేపీ అందునా ప్రధాని మోడీ దుర్మార్గాలకు, దురాగతాలకు కచ్చితంగా ముకుతాడు వేసి అడ్డగించగలమని ఉత్సాహపడుతున్నది. 'ఈ ఎన్నికల్లో విపక్షాలు కొట్టిన చావుదెబ్బకు మోడీ సర్కార్ కనీసం నడవలేని స్థితికి చేరుకున్నదని' కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అంటున్నారు. భారత ఓటర్లు ప్రతిపక్షాలకు ఇచ్చిన ఆత్మస్థైర్యంగా దీనిని మనం చెప్పుకోవచ్చు.

లోక్‌సభ మెజారిటీ మార్కు 272 కాగా బీజేపీకి 240 మాత్రమే వచ్చాయి. అందుకే తెలుగుదేశం (16 మంది ఎంపీలు) నితీష్ కుమార్ జనతాదళ్ (12 మంది ఎంపీలు)పై ఆధారపడవలసి వచ్చింది. కాంగ్రెస్‌కు 99 వచ్చినా ఇండియా కూటమికి 232 లభించాయి.

ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం దాదాపు వందకోట్ల మంది భారత ఓటర్లలో 65 కోట్లమంది మాత్రమే ఓటు వేసారు. అంటే ప్రతి ముగ్గురులో ఇద్దరు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో 37శాతం మంది అంటే 23 కోట్ల మంది మాత్రమే బీజేపీకి ఓటువేసారు. ఇది మాత్రమే బీజేపీ ప్రాతినిధ్యం. మిగిలిన ప్రజాపక్షాన్ని ప్రతిపక్షంగా భావిస్తే ప్రతిపక్ష పాత్ర ఎంత విశాలమైనదో, ఎంత లోతైనదో, ఎంత పెద్ద బాధ్యతతో కూడుకున్నదో అవగతమవుతుంది. మరి దానికి తగిన విధంగా కాంగ్రెస్ వ్యవహరించగలదా? ప్రతిపక్షనేతగా రాహుల్ గాంధీ ఆ సమర్థతను చూపగలరా...? అనేది వేచిచూడాలి.


రాజ్యాంగ విలువలు లౌకిక విలువలు కాపాడడంతో పాటు ప్రజల్లో శాస్త్రీయతను, హేతువాద దృక్పథాన్ని పెంచవలసిన బాధ్యత ఎంతో ఉన్నది. హిందూత్వభావనకు వ్యతిరేకంగా సాఫ్ట్ హిందూత్వ అంటే కుదరదు. సైద్ధాంతికంగా నెహ్రూ శాస్త్రీయ దృక్పథానికి ఇది వ్యతిరేకం. ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడటమే అవుతుంది. వ్రతం చెడ్డా ఫలితం దక్కదని రుజువవుతున్నది కూడా. మొత్తం విద్యావ్యవస్థనే కాషాయికరణ గావించడంలో గత బీజేపీ గణనీయ పాత్రను నిర్వహించింది. అలాగే రైతుల నల్లచట్టాలు మెడపై కత్తిలా వేలాడుతూనే ఉన్నాయి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల చట్టాల సవరణ ప్రమాదం కొనసాగుతూనే ఉన్నది. వీటన్నిటిపై సుస్పష్ట వైఖరి అవశ్యం. దీనికి తోడు అవినీతి తారాస్థాయికి చేరింది. రూ. వందల వేలకోట్లు గల కుబేరులే ప్రజాప్రతి నిధులవుతున్నారు.

పీడిత ప్రజల ప్రియతమనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ పక్షనేతగా రాజ్యసభలో ప్రసంగించేటప్పుడు ప్రతి అంశం పూర్వాపరాలు తెలుసుకుని సాధికారంగా మాట్లాడేవారని ప్రతీతి. అంకెలు, సంఖ్యలతో సహా సభకు వచ్చేవారు. అధికారులు, పాత్రికేయులతో పాటు, ఆయా రంగాల నిపుణులు సైతం శ్రద్ధగా నోట్ చేసుకుని అమలు పరిచేందుకు ప్రయత్నించేవారు. తప్పులను పొరపాట్లను సరిదిద్దుకునేవారు. ప్రజలకు ఆ విధంగా న్యాయం జరిగేది. ఒక వ్యక్తినుండి వ్యవస్థకు, ఓ వ్యవస్థ నుండి ప్రజా సమూహానికి అలా అభిప్రాయాలు ఆచరణ చేరి మార్పుకు దోహదపడేవి. ఓ ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష పాత్ర అంటే ఇదికదా...! అని ముక్కున వేలేసుకుని అంతర్జాతీయ స్థాయిలో సైతం గమనించేవారు.

చరిత్ర ఒక్కొక్కరికి ఒక్కోసారి ఒక్కోలా అవకాశం ఇస్తుంది. దాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటే చరిత్రకారులుగా నిలబడతారు. లేకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. తేల్చుకోవాల్సింది మనమే. ■

రేపటి కామ్రేడ్స్!

- రంగనాయకమ్మ



'విముక్తి' అనేశావు. ఎలాగ?"

"ఎలాగా? ఎలాగో నీ బ్యాగ్‌లో వున్న పుస్తకంలో చదవాలన్నాను. ఆ పుస్తకం బ్యాగులో నిజంగా వుందా, తీసేశావా?"

"నిజంగా ఇప్పుడు బ్యాగులో లేదు! మొన్న మా క్లాసులో ఒకడు నేను చదువుతోంటే, తొంగి తొంగి చూసి, 'కాపిటలా? ఈ పుస్తకం గురించి బాగుంటుందనో యేదో కొందరంటారు. కొన్నావా? ఒక్కసారి నాకియ్యి! రేపొద్దున్నేకల్లా ఇచ్చేస్తానోయ్! అరె, సారీ! రేపు మార్నింగ్ సినిమాకి టిక్కట్టుందిలే, ఎల్లుండి తప్పకుండా ఇచ్చేస్తానోయ్! ప్లీజ్! ఏమన్నా రాస్తా దాని మీద!' అని గబ గబా అంటోంటే, అసలు భరించలేకపోయాను. రేపొద్దున్న సినిమా అట! అది మానకూడదట! కాపిటల్‌ని తిరగేసి, ఏదో రాస్తాడట! ఎంత వాగాడో!"

"సరే, అడిగాడులే. నువ్వేమన్నావు? ఇవ్వలేదా, ఇచ్చావా?"

"ఇచ్చానా! ఇస్తే, నీ ముందు కూర్చో గలిగేవాడినా?"

"నాకేం తెలుస్తుంది? నిన్ను కూర్చోవద్దంటానా?"

"నువ్వు అంటావని కాదు. కాపిటల్‌ని వాణ్ణి ముట్టుకోనిస్తే, నేనే నీ ముందు కూర్చోగలిగే వాణ్ణి కాదు!"

"అది తప్పు! ఆ పూట ఇవ్వక్కర్లేదు గానీ, 'నేను చదవడం అయ్యాక ఇస్తాలే' అంటే మంచిదే. ఏమో! కాస్త చదివి, తిరగేసి, తిరగేసి చదివి ఏమన్నా మారే వాడేమో! తర్వాత, ఆ పుస్తకం గురించే మాట్లాడే వాడేమో! 'తర్వాత ఇస్తాలే' అనకపోయావా? చూడనియ్యి ఒక సారి! నేను మాత్రం కాపిటల్ చదవక ముందు ఈ మాత్రం మాట్లాడ గలిగే వాడినా?"

"అవును గోపాల్! నాకూ కొత్తగానే తెలిశాయి నీ మాటల్తో!"

"ఏమో మరి! ఒక సారి ఇస్తే చదువుతాడేమో!"

"నా కలా అనిపించలేదు అప్పుడు!"

"అప్పుడు సరే! ఇప్పుడు?"

"ఏమో! అతడు మళ్ళీ అడిగితే, అడిగితేనే కాదులే. అసలు ఏ పుస్తకాలు చదివాడో అడిగి, చదవాలంటే కొనుక్కోలేవా? - అంటా."

"అవును, అంతే! ఒక్క రోజ్కైనా నువ్వు చదవకుండా ఎవరికీ ఇవ్వకు!"

"అలా ఇస్తే, నీతో అబద్ధం చెప్పాల్సిందే!"

"అలాంటి మాటలు మానెయ్యి! ఇలాంటి మాటలు చెప్పడాలూ, వినడాలూ, నీకూ, నాకూ వ్యక్తి పూజలై పోతాయి, తెలుసా?"

"సరే! సరదాగా అన్నాలే. ఇందాకేదో అడగాలనుకుంటే వచ్చింది. సమాజం, మొదట్లో బానిస యజమానుల పెత్తనం కింద ప్రారంభమైందని చెప్పి, తర్వాత ఎదిగింది, మరి కాస్త ఎదిగింది, మరీ కొంత ఎదిగింది అన్నావు. యజమానుల పెత్తనాల్లో మార్పులు వుంటే మాత్రం, వాటిని సమాజం ఎదగడం, అంటామా?"

"బాగా అడిగావు! సమాజం ఎదగడానికి కారణం, యజమానులు కారు! శ్రామిక వర్గంలో ఎదుగుదలలే, ఎదురు తిరగడాలే అసలు కారణం! ఒకప్పుడు బానిసలుగా బతికిన వాళ్ళు, తర్వాత కౌలు రైతులుగా మారి, ఆ తర్వాత జీతాల శ్రామికులుగా ఈ నాటి దశకి ఎదిగినట్టు కాదా? వాళ్ళ పోరాటాల వల్లే మార్పులన్నీ! మనకు తెలియనివి, బోలెడుంటాయిలే. మరి, అదంతా ఎదుగుదలే శ్రామిక వర్గ భావాల్లో."

"అయితే, ఇప్పుడు మనం ఎలా ఎదగాలి? మన భావాల్లో ఏం మార్పులు రావాలి?"

"ఆలోచించి చూడు!"



"మనం ఉద్యోగాలు కావాలనుకుంటున్నాం. వస్తే వస్తాయి! జీతాలూ వస్తాయి! అంతేనా జరగాల్సింది? దానితో మనకి సంతృప్తేనా? పక్కనే బిచ్చగాళ్ళు వుంటారే! పక్కనే బికార్లూ వుంటారే! వాళ్ళెలా ఎదగాలి?"

"శ్రమ దోపిడీ మొత్తంగా అంతర్ధానం అవ్వాలన్నదే మన ఆలోచన! ఇంకా, బికార్లేంటీ, బిచ్చగాళ్ళేంటీ?"

"అవును, అవును! అంతే! ఇంకా ఎంత కాలం భరించాలి దోపిడీ? అది కాదు, ఆ కౌలూ, వడ్డీ, లాభం - అన్ని దోపిడీలూ పోవాల్సిందే! కానీ, గోపాల్! 'లాభం' అనేది కూడా పూర్తిగా పోవాల్సిందే కదా?"

" 'లాభం' వేరా? కౌలూ, వడ్డీలతో కలిసిందే లాభం కదా? చెప్పలేదా? సరుకుల్ని అమ్మగా వచ్చే లాభం లోనించే పరిశ్రమ నించున్న భూమికి కౌలు! ఖర్చులికి 'పెట్టుబడి' పేరు పెట్టి, దానికి వడ్డీ! మూడోది లాభం! మూడు పంపకాలయ్యేదే మొత్తం దోపిడీ! ఇంకా ఎప్పుడు పూర్తి చేస్తావు రవి బాబూ ఆ పుస్తకం?"

"చేస్తా! చేస్తా! చేసేస్తా గోపాల్! పరీక్షల గోల ఒకటి కదా, చస్తున్నాను! వాటిని మానేస్తాలే. మరి, లాభం పోతే, దాన్ని లాక్కుంటూ, బతికే పెట్టుబడిదార్లు గార్లు ఎలా బతుకుతారంటావు?"

"నీతో లాభం లేదు, నువ్విక పనికి రావు! లాభం అని నేనూ అన్నాను గానీ, అది చెత్త మాట! నీకు ఆలోచనా శక్తి ఈ బూర్జువా పరీక్షలతో పూర్తిగా పోయింది! 'లాభాన్ని లాగే వాళ్ళు', అది లేకపోతే ఎలా బతుకుతారు - అంటావా? అంత మాత్రం ఆలోచించ లేవా? లాభాలు లేకుండా శ్రామిక వర్గం వాళ్ళంతా ఎలా బ్రతుకుతున్నారు? అసలీ 'లాభం' మాటని మనం పలక కూడదు. బొత్తిగా తప్పుడు మాట అది! ఏ విషయంలో అయినా, 'లాభం లేదే!' అన్నామంటే, ఇప్పుడే అన్నాగా? ఎక్కడి నించో ఏదో రావాలని ఆశలతో ఎదురు చూడ్డమేగా? లాభాన్ని లాగకపోతే దోపిడీ దారులెలా బ్రతుకుతారబ్బా - అని, నీకు బెంగ పట్టుకుందా?"

"సరే, తిడితే తిట్టు! ఇవన్నీ నాకు ఇంతకు ముందే ఎందుకు చెప్పలేదు? నన్ను పిలిచి పది రోజులు దాటి పోయింది."

"నువ్వయితే, పది రోజులూ దాట నిచ్చి, ఆ తర్వాత వచ్చావు. బూర్జువా పరీక్షల మత్తులో, ఫస్ట్ క్లాస్ మార్కుల పిచ్చి గర్వంలో మునిగావు. అంతేగా?"

"అంటే అను! ఇందాకే చెప్పేశాను. ఈ పూటకి ఆఖరిగా తిట్టి చెప్పెయ్! శ్రమ దోపిడీ అంతర్ధానం తర్వాత ఈ సమాజం ఎలా ఉంటుందో చెప్పు!"

"దోపిడీ పోతే, దోపిడీ జరగని సమాజం ఉంటుంది! అందరికీ కడుపులు నిండడం! అందరికీ చదువులు! అందరికీ పనులూ, విశ్రాంతులూ! అందరికీ సంతృప్తులూ, సంతోషాలూ! బాధలూ, అసూయలూ, కలహాలూ, వుండే పరిస్థితులే లేకపోతే, హత్యలుంటాయా? ఆత్మహత్యలుంటాయా? మూఢ నమ్మకాలుం టాయా?"

"మరి దేవుళ్ళు?"

"అదీ చెప్పాలా? మూఢ నమ్మకాలు వుండవు అన్నానుగా? సమాజాన్ని, అలాగే ఉత్తమంగా ఊహించు!"

"మనం కూడా, నేను కూడా, ఉత్తమంగా అయిపోవాలి! ఇప్పుడే అయ్యాను! కమ్యూనిస్టుగా అయిపోయాను!"

"అప్పుడే కాదు, నీ పరీక్షలో? రాయవా?"

"కాదు, ఇంక వొద్దు! ఉత్తమ సమాజంలో, ఉత్తమ పరీక్షల కోసం చదువుతాను. మరి నువ్వు? నీ పీహెచ్‌డీ చదువు ఆపుకుంటావా?"

"ఎప్పుడో, ఆర్నెల్ల కిందటే, కాపిటల్‌ని మొదలెట్టి, రెండు సార్లు చదివేసిన తర్వాతే, నా పీహెచ్‌డీ పరిశోధనలనీ అవగొట్టి, ఈ విషయమే ఆలోచిస్తున్నాను నిన్న మొన్నటి నించీ."

"ఏం ఆలోచించావు చెప్పు! తొందరగా చెప్పు!"

"మనం ఉత్తమ సమాజం కోసం ఆలోచించాలి!"

"అంటే, కమ్యూనిస్టులుగా మారాలంటావు. అంతేగా?"

(ఇంకావుంది) ■

రాష్ట్ర సాధనే లక్ష్యంగా పోరాడిన ప్రొఫెసర్ జయశంకర్

స్మరించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆయన్ను స్మరించుకున్నారు. ఆయన తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడన్నారు.. సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడంతో పాటు జనాన్ని జాగృతం చేయటంలో జయశంకర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. తుది శ్వాస వరకు తెలంగాణ కోసమే పరితపించారని గుర్తు చేసుకున్నారు. అందుకే తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. తన అనుభవాన్ని తెలంగాణకు ధారపోసి, రాష్ట్ర ఏర్పాటుకు ముందే అన్ని రంగాల్లో రాష్ట్రానికున్న ఉజ్వల భవిష్యత్తును వీక్షించిన స్వాప్నికుడు జయశంకర్ అని సీఎం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేటని రెవెన్యూ గ్రామంగా ప్రకటించిన విషయాన్ని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఆషాఢ మాసం బోనాలకు సీఎంకు ఆహ్వానం

వచ్చే నెల ఏడు నుంచి ప్రారంభం కానున్న ఆషాఢమాసం బోనాలకు రావాలని గోల్కొండ, సికింద్రాబాద్, లాల్ దర్వాజ దేవాలయాల కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ప్రతి ఏటా ఆషాఢమాసం బోనాలు మొదట గోల్కొండలో ప్రారంభమవుతాయి. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయి. నెల రోజులు పాటు జరగనున్న ఈ వేడుకలు లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి బోనాలతో ముగుస్తాయి.

బంగారు పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్

'పాన్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో..

ప్రత్యేకంగా అభినందించిన రాచకొండ సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా మూడు బంగారు పతకాలను సాధించిన హెడ్‌కానిస్టేబుల్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గౌరవాన్ని మరింత పెంచారు. రాచకొండ పరిధిలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్ కుమార్ 'పాన్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించారు. వీటితో పాటు ఈ ఏడాది ఫిబ్రవరి 22 నుంచి 25వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన 28వ ఏషియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ -2024 (ఏఎంఏ)లో 45 సంవత్సరాల విభాగంలో నాలుగు పతకాలు (1 బంగారు పతకం, 3 కాంస్య పతకాలు) అనిల్ కుమార్ సాధించారు. అందులో 4x400 మీటర్ల రిలేలో బంగారు పతకం, 800 మీటర్లు, 1500 మీటర్లు, 5000 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు వరించాయి. త్వరలో సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాలో జరుగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్న సందర్భంగా గురువారం నేరెడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ తరుణ్ జోషి హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అథ్లెటిక్స్ క్రీడలను ప్రోత్సహిస్తామని తెలిపారు. అనిల్ కుమార్‌కు పోలీసు శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతలో పశ్చిమబెంగాల్ కీలకపాత్ర

గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్య పోరాటం, భారతీయ తాత్వికత, జాతీయ సమైక్యత కోసం పశ్చిమబెంగాల్ కీలక పాత్ర పోషించిందని రాష్ట్ర గవర్నర్ సీ.పీ.రాధాకృష్ణన్ తెలిపారు. ఆ రాష్ట్రం నుంచి శ్రీఅరబిందో, శ్రీరామకృష్ణపరమ హంస తదితర ప్రముఖులు వచ్చారని గుర్తుచేశారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ లో నిర్వహించిన పశ్చిమబెంగాల్ రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

త్రిశంకు స్వర్గంలో వర్కర్ టూ ఓనర్ స్కీమ్

తుది నిర్మాణ దశకు వీవింగ్‌పార్క్

బాలారిష్టాలు దాటుకుని 88 ఎకరాల్లో రూపుదాల్చుకున్న షెడ్ల నిర్మాణం

పనుల్లేక, ప్రభుత్వ ఆర్డర్లూ లేక నిస్సహాయస్థితిలో పరిశ్రమ

తాము ఓనర్లమెప్పుడవుతామనే ఆందోళనలో వస్త్ర కార్మికులు

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపైనే గంపెడాశలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికున్ని.. యజమానిగా చేస్తామని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'వర్కర్ టూ ఓనర్' స్కీమ్ బాలారిష్టాలు దాటుకుంటూ ఏడేండ్ల తరువాత ఓ తుది దశకు చేరుకుంది. 88 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన వీవింగ్‌పార్క్ ఓ రూపుదాల్చుకుంది. రూ.375 కోట్లతో చేపట్టిన ఈ పార్క్‌లో షెడ్లు, ఇతర ఇంటీరియల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇక వర్కర్ ఓనర్ అయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని భావించిన నేపథ్యంలో మగ్గాలు నడవక, ప్రభుత్వ ఆర్డర్లు లేక సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రశ్నార్థకంగా మారింది. వర్కర్ టూ ఓనర్ స్కీమ్‌ను 'త్రిశంకు స్వర్గం'లోకి నెట్టేసినట్టయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ నిర్ణయాలపైనే కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు.

సిరిసిల్ల నేత కార్మికులను ఓనర్లుగా మార్చేందుకు గత బీఆర్ఎస్ సర్కార్ వర్కర్ టూ ఓనర్ స్కీమును ఏడేండ్ల కిందట తీసుకొచ్చింది. ఇందుకు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు శివారులో వీవింగ్‌పార్క్ కోసం 88 ఎకరాల భూమి కేటాయించింది. ఈ స్కీమ్ రూపకల్పనలో భాగంగా సుమారు ఎనిమిది మంది కార్మికులు ఒకేచోట పని చేసేలా నిర్మాణాలు చేపట్టి దాన్ని ఒక యూనిట్‌గా పరిగణించింది. ఒక్కో గ్రూప్ కార్మికులకు పవర్‌లూమ్స్ అందజేసి, ప్రతి కార్మికునికీ స్టోర్ రూమ్ సహా 800 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయిస్తామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి కార్మికునికీ నాలుగు సెమీ ఆటోమేటిక్ పవర్ లూమ్‌లు, వైండింగ్ మిషన్‌ను అందజేస్తామని ప్రకటించింది. పార్కులో 60 వార్పింగ్ మిషన్లనూ ఏర్పాటు చేస్తామని చెప్పింది. మొత్తంగా సిరిసిల్లలోని సుమారు 30వేల మగ్గాలపై పని చేసే 6 వేల మంది కార్మికులు, అనుబంధ రంగాలైన డైయింగ్, కండెలు చుట్టడం, బీములు పోసే ఇతరత్రా పనుల్లో కార్మికులను కలుపుకుని మొత్తంగా 10వేల మంది వర్కర్లను ఓనర్లుగా మార్చుతామని గత సర్కారు ప్రకటించింది.

బాలారిష్టాలు దాటుకుంటూ..

2017 అక్టోబర్ 11న అప్పటి సీఎం కేసీఆర్ ఈ 'వర్కర్ టూ ఓనర్' పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత రూ.220కోట్లతో షెడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందించారు. ఈ నిర్మాణాల బాధ్యతను రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) చేపట్టింది. అయితే, ప్రారంభం నుంచి పనులు నత్తనడక సాగుతూ ఏడేండ్ల కాలం గడిచిపోయింది. మధ్యలో ముడిసరుకుల ధరలు పెరగడంతో యూనిట్ ధరను రూ.8లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచిన గత సర్కారు వ్యయ అంచనాను రూ.375కోట్లకు పెంచింది. మొదటి దశలో 1,104 మంది నేత కార్మికులు కూర్చునేలా వర్క్ షెడ్లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. షెడ్ల నిర్మాణాలను పూర్తి చేసింది. అందులో 4416 పవర్‌లూమ్స్‌ను సైతం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మిగిలిన షెడ్లు, ఇతర పనులు తుదిదశలో ఉన్నాయి. అయినప్పటికీ ఈ ఏడేండ్లలో పనుల పురోగతిపై గత సర్కారు పెద్దగా దృష్టిసారించలేదనే విమర్శలున్నాయి. నిర్మాణ పనులపైగానీ, పురోగతిపైగానీ సమీక్షించిందీ లేదనే వాదనలు ఉన్నాయి. షెడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ లోపల ఇంటీరియల్ పనులు ఇంకా పూర్తవలేదు. ఆటోమెటిక్ మగ్గాలను బిగించేందుకు ఆర్డర్లు ఇవ్వలేదు. ప్రస్తుతం పాత ప్రభుత్వం కొనసాగించిన ప్రభుత్వ ఆర్డర్ల విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏ నిర్ణయాన్నీ తీసుకోలేదు. ఇక్కడి చేనేత కార్మికుల సంక్షేమ పథకాల కొనసాగింపుపైనా స్పష్టమైన కార్యాచరణ రూపొందించలేదు. ఈ నేపథ్యంలో 'వర్కర్ టూ ఓనర్' స్కీమ్ అమలు ఎప్పుడు ఉంటుందనేది చర్చ నడుస్తోంది.



వర్కర్ టు ఓనర్ ఉద్దేశమిదీ...

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులను యజమానులుగా చేయడమే వర్కర్ టూ ఓనర్ ప్రధానోద్దేశం. కార్మికులే యజమానులుగా మారి వస్త్రాలను ఉత్పత్తి చేస్తారు. ఈ పథకం అమలులోకి వస్తే సిరిసిల్లలో దాదాపు పది వేల మంది కార్మికులు ఓనర్లుగా మారనున్నారు. ఒక్కో కార్మికుడికి యూనిట్ కింద రూ.8 లక్షల విలువ చేసే నాలుగు ఆధునిక మరమగ్గాలను సమకూరుస్తారు. ఒక్కో షెడ్డులో 8 మంది కార్మికులకు యూనిట్లు కేటాయిస్తారు. ఆధునిక మరమగ్గాలపై వస్త్రాలు ఉత్పత్తి చేసేందుకు కార్మికులకు చేతినిండా పని కల్పిస్తారు. ఈ మొత్తం పెట్టుబడిలో 50శాతం రాయితీని ప్రభుత్వం కల్పించి మరో 40శాతం బ్యాంక్ రుణాన్ని అందిస్తారు. మిగిలిన 10శాతం పెట్టుబడిని మాత్రం కార్మికుడు భరించాల్సి ఉంటుంది. ఈ ఆలోచన సక్సెస్‌గా మారితే సిరిసిల్లలోని 30వేల మగ్గాలపై పని చేసే సుమారు 6వేల మంది కార్మికులు, మరో 4వేల మంది అనుబంధ రంగ కార్మికులంతా ఓనర్లుగా మారుతారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ సోదాలు

అతని సోదరుడి నివాసంలోనూ

ఏకకాలంలో పలుచోట్ల దాడులు

అక్రమ మైనింగ్ వ్యవహారమే కారణమా..?

చర్చనీయాంశంగా మారిన పారిశ్రామిక ప్రాంతం



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఈడీ దాడులు జరిగాయి. గురువారం ఉదయం నుంచే ఈడీ అధికారులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డితో పాటు బంధువుల ఇండ్లు, వారికి సంబంధించిన కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సుమారు 40 మందికి పైగా అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, అతని కుటుంబ సభ్యులు అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్‌లో భారీఎత్తున పెట్టుబడులు పెట్టినట్టు ఆరోపణలు ఉండటంతో పాటు పలువురి ఫిర్యాదులతో ఈడీ అధికారులు రంగంలోకి దిగినట్టు సమాచారం. పటాన్‌చెరు మండలం లక్దారం గ్రామపంచాయతీ పరిధిలో మధుసూదన్ రెడ్డికి సంబంధించిన సంతోష్ సాండ్ మైనింగ్ తమకు కేటాయించిన భూమితోపాటు మరో 11 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ అక్రమాలపై విచారణకు సంగారెడ్డి ఆర్డీవో నేతృత్వంలో ప్రత్యేక కమిటీని నియమించింది. అక్రమాలు జరిగినట్టు కమిటీ తేల్చడంతో గూడెం మధుసూదన్ రెడ్డిపై కేసు నమోదు చేసి గతంలో అరెస్టు చేశారు. 20 రోజులు సంగారెడ్డి జైల్లో ఉన్న ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. అనధికారికంగా మైనింగ్ చేసినందుకుగాను క్రషర్ యాజమాన్యానికి మైనింగ్ అధికారులు రూ.341 కోట్లపైన పెనాల్టీ విధించారు. దానికి తోడు రియల్ ఎస్టేట్ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టినట్టు ఆరోపణలు రావడంతో పాటు అక్రమ మైనింగ్‌పై పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈడీ అధికారులు ఎమ్మెల్యే ఆయన బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించినట్టు తెలుస్తోంది. అక్రమ మైనింగ్ వ్యవహారంతో పాటు బినామీ పేర్లపై పెట్టుబడుల గురించి ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. సోదాలు పూర్తయితేనే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది. ఈడీ సోదాలతో పటాన్‌చెరువాడతోపాటు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ఐఐఎంలో సీటు సాధించిన అంధ విద్యార్థిని



నవతెలంగాణ-జహీరాబాద్

సాధారణ రైతు కుటుంబం.. అందునా అంధత్వాన్ని జయించి జాతీయ స్థాయి ఐ.ఐ.ఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ మేనేజమెంట్) పోటీ పరీక్షల్లో విద్యార్థిని మంచి ప్రతిభ కనబర్చి సీటు దక్కించుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గడీకి చెందిన కోత్తకాపు గోపాల్ రెడ్డి- విజయలక్ష్మి దంపతుల రెండో సంతానమైన శివాని అంధురాలు. అయినా చదువు పట్ల ఉన్న ఆసక్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలనే లక్ష్యంతో కష్టపడింది. అందుకు తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహం తోడైంది. ప్రాథమిక, ఉన్నత విద్యను హైదరాబాద్ బేగంపేట్‌లోని దేవనార్ పబ్లిక్ స్కూల్‌లో కొనసాగించి.. పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ విద్యను జహీరాబాద్‌లోని మాస్టర్ మైండ్స్ కళాశాలలో కామార్స్ కోర్సు పూర్తి చేశారు. చెన్నైలోని సత్యబామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బిబిఎ కోర్స్ పూర్తి చేసింది. క్యాట్ ఎగ్జామ్ కోసం ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకొని 2023లో నిర్వహించిన ఐ.ఐ.ఎం కోర్స్ కోసం పరీక్ష రాసింది. దేశంలో 21 ఐఐఎం కళాశాలలు ఉండగా, 19 ఐఐఎం కళాశాలల్లో అర్హత సాధించింది. అందులో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ ఐఐఎంను ఎంపిక చేసుకుంది. రెండు సంవత్సరాల ఐఐఎం కోర్స్ విజయవంతంగా పూర్తి చేసి ఉన్నత స్థానానికి చేరుకుని తల్లిదండ్రులకు, తాను పుట్టిన ప్రాంతానికి మంచి పేరు తేవాలన్నదే తన లక్ష్యమని శివాని స్పష్టం చేశారు.

హామీల అమలుకు ఉద్యమాలు

గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్

వైరాలో రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు ప్రారంభం



నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు కోరుతూ త్వరలో రాష్ట్రస్థాయి ఉద్యమాలు నిర్వహిస్తామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్ తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా పట్టణంలోని పరుచూరి ఫంక్షన్ హాల్‌లో గురువారం బానోత్ బాలాజీ అధ్యక్షతన గిరిజన సంఘం రాష్ట్రస్థాయి రాజకీయ, సామాజిక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సంఘం జెండాను సీనియర్ నాయకులు గుగులోత్ పంతు నాయక్ ఆవిష్కరించారు. అమరజీవి గుగులోతు ధర్మా నాయక్, భూక్యా జగ్యి నాయక్‌కు సంతాపం ప్రకటించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆర్.శ్రీరామ్ నాయక్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో అనుసరించిన గిరిజన వ్యతిరేక విధానాలపై ఎన్నికల్లో గిరిజనులు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ తీసుకొచ్చిన అటవీ సంరక్షణ నియమాల చట్టం 2023ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీలో 80శాతం రిజర్వేషన్లు గిరిజనులకు కేటాయిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించాలని కోరారు. తెలంగాణలో గిరిజనులకు 6 నుంచి 10 శాతానికి పెంచిన రిజర్వేషన్ జీవో 33ను 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు కార్యాచరణ చేపట్టడానికి తక్షణం గిరిజన శాఖ మంత్రిని నియమించాలని, లేకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మైదాన ప్రాంతం జిల్లాల్లో ఐటీడీఏలను ఏర్పాటు చేయాలన్నారు. ట్రైకార్ సంస్థను మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ తీసుకున్న నిర్ణయం ప్రకారం విధివిధానాలు రూపొందించి గిరిజన నిరుద్యోగులు పెట్టుకున్న దరఖాస్తులన్నింటికీ 90 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని కోరారు. తండాల గ్రామ పంచాయతీ లకు రెవెన్యూ హోదా ఇవ్వడంతోపాటు, తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై త్వరలోనే అన్ని గిరిజన సంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపడతామని తెలిపారు. జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. వర్షాకాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న పోడు భూముల హక్కు పత్రాలను పంపిణీ చేయడానికి కార్యాచరణ రూపొందించాలని, గిరిజనులపై దాడులు ఆపాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బానోత్ బన్సీలాల్, భూక్యా జ్యోతి పాల్గొన్నారు.

అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలు

ప్రజా రాజధానిని విధ్వంసం చేశారు

ఒక మూర్ఖుడితో రాష్ట్రానికి తీరని నష్టం

రాజధాని పనులపై వైట్‌పేపర్

ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతిలో పర్యటన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రానికి అమరావతి, పోలవరం సంపద సృష్టి కేంద్రాలని...గత పాలకుల మూర్ఖత్వం వల్లే రెండూ విధ్వంసానికి గురయ్యాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రాజధాని అమరావతిని అపహాస్యం చేసి విధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో తన రెండో పర్యటనలో భాగంగా ఆయన గురువారం అమరావతిలో పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన, విధ్వంసాలకు గురైన నిర్మాణాలు, శిథిలాలను పరిశీలించారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చిన ఉండవల్లిలోని ప్రజావేదిక శిథిలాలను తొలుత వీక్షించారు. అక్కడి నుంచి బయలుదేరి ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా నాడు రాజధానికి భూమిపూజ జరిగిన వేదిక వద్ద మోకాళ్లపై ప్రణమిల్లారు. అక్కడ నుంచి బయలుదేరి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మించిన గృహాలను చూశారు. తరువాత ఆలిండియా సర్వీసెస్ న్యాయమూర్తుల కోసం నిర్మించిన భవన సముదాయాలనూ పరిశీలించారు. అనంతరం మంత్రుల నివాస గృహాలు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల, నాల్గొ తరగతి ఉద్యోగుల కోసం నిర్మించిన అపార్ట్‌మెంట్లను పరిశీలించారు.

ఏ అంటే అమరావతి....పీ అంటే పోలవరం

'రాజధాని కోసం భూములిచ్చిన రైతులు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. "అనేక సవాళ్లను, కేసులను అధిగమించి 1,631 రోజులు ఆందోళనలు చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ప్రభుత్వం మారడంతో అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో రైతులు ఆందోళనలు విరమించారు. రాజధాని కోసం రైతులు చేసిన పోరాటం...భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఏపీ అనే పదంలో ఏ అంటే అమరావతి...పీ అంటే పోలవరం. అమరావతి ప్రజారాజధాని...తెలుగువారికి చిరునామాగా ఉంటుంది. 5 కోట్ల మంది ప్రజలకు దశ, దిశను నిర్దేశిస్తుంది. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గర్వంగా పనులు చేసుకోవచ్చు. కానీ రాజధానిని జగన్ అతలాకుతలం చేశారు. దక్షిణ భారతదేశంలో ఎక్కువనీళ్లు ఉండే నది గోదావరి. పోలవరం నిర్మాణం జరిగి నదులు అనుసంధానం చేస్తే ప్రతి ఎకరాకు నీళ్లివ్వచ్చు. విభజన అనంతరం రాజధాని కట్టుకోవడానికి ఆర్థిక తోడ్పాటు, పోలవరం పూర్తి చేసుకునేందుకు కేంద్రం వెసులుబాటు కల్పించింది. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, అమరావతి రాజధానికి ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చింది." అని ఆయన అన్నారు.

పోలవరం-అమరావతి వ్యక్తిగత అంశాలు కావు..

'ప్రజలు కూటమికి ఏకపక్షంగా ఓట్లు వేశారు...రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద విజయం ఎప్పుడూ రాలేదు. ఒక వ్యక్తి ముఖ్యమంత్రి పదవికి పనికిరాడని ప్రజలు తీర్పు ఇచ్చి 11 సీట్లకు పరిమితం చేశారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి, అర్హతలేని వ్యక్తి సీఎం అయితే రాష్ట్రం ఎంత నష్టపోతుందో గత ఐదేండ్లలో చూశాం. పోలవరం, అమరావతి ప్రాజెక్టులు వ్యక్తిగత అంశానికి సంబంధించినవి కాదు... వాటి ద్వారా సంపద సృష్టి జరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది....అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు పెరుగుతాయి. పోలవరం పూర్తి చేసి, నదుల అనుసంధానం పూర్తయితే రాయలసీమ రతనాలు సీమ అవుతుంది. గత ప్రభుత్వం పోలవరంను గోదావరిలో కలిపింది. పోలవరానికి శాపంగా మారిన వ్యక్తి వల్ల, ఆయన మూర్ఖత్వం వల్ల ఖర్చు కూడా రెట్టింపైంది." అని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో శ్వేతపత్రం విడుదల

"రాజధానిలో ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయి...పైగా ఇష్టానుసారంగా విధ్వంసం చేశారు. పైపులు, ఇసుక దొంగతనం చేయడంతో పాటు రోడ్లను కూడా తవ్వుకుపోయారు. ఒక్క బిల్డింగును కూడా పూర్తి చేయలేదు. రోడ్ల నిర్మాణాలన్నీ సగంలో ఆగిపోయాయి. కొన్ని బిల్డింగ్‌లు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీల భవనాలు, మంత్రుల భవనాలు, గెజిటెడ్ అధికారుల, నాన్ గెజిటెడ్ అధికారుల భవనాల నిర్మాణాలు ప్రారంభించాం....ఆ పనులన్నీ అర్ధాంతరంగా నిలిపేశారు. శ్వేతపత్రం విడుదల చేసి రాజధాని ప్రస్తుత పరిస్థితిపై ప్రజలకు వివరాలన్నీ తెలుపుతాం. ప్రజల్లో కూడా గత ప్రభుత్వం విధ్వంసంపై చర్చ జరగాలి. ఏం చేయాలనే దానిపై అధ్యయనం చేయాల్సి ఉంది." అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

గర్వంగా తలెత్తుకు తిరిగే రాజధాని అమరావతి

'తెలుగుజాతి గర్వంగా, గౌరవంగా తలెత్తుకు తిరిగే రాజధాని అమరావతి. విశాఖను ఆర్థిక రాజధానిగా, కర్నూలును ఆధునిక నగరంగా తయారు చేయాలనుకున్నాం. కేంద్రం 12 విద్యా సంస్థలను ఇచ్చింది. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీ, మంగళగిరిలో ఎయిమ్స్, విశాఖలో ఐఐఎం, తాడేపల్లిలో ఎన్ఐటీ, ఒంగోలులో ఐఐటీ, విజయనగరంలో గిరిజన యూనివర్సిటీని...ఇలా ప్రాంతాల వారీగా నెలకొల్పాం. కానీ గత ప్రభుత్వం ఏదీ జరగ నివ్వలేదు ..ముందుకు సాగనివ్వలేదు. రాజధానిపై ఇష్టారీతిన బురదజల్లారు. నిత్యం విష ప్రచారం చేశారు... బ్రాండ్ దెబ్బతీయడానికి ప్రయత్నించారు. ఇన్ సైడర్ ట్రేడింగ్ అన్నారు...స్విస్ ఛాలెంజ్‌లో మోసం అన్నారు. సింగపూర్ కన్సార్టియంపైనా విషం చిమ్మి తరిమేశారు. రాష్ట్రానికి మధ్యలో ఉండేలా ఎక్కడైనా రాజధాని పెట్టండని శివరామకృష్ణ కమిటీ నివేదికలో చెప్పింది. దానికి అనుగుణంగానే 12 పార్లమెంట్ స్థానాలు ఒకవైపు...మరో 12 పార్లమెంట్ స్థానాలు ఇంకోవైపు ఉండేలా చూసి...గుంటూరు సెంట్రల్ గా అమరావతిని రాజధానిగా గుర్తించాం." అని చంద్రబాబు వివరించారు.

మూడు ముక్కలాట

'మూడు రాజధానులు అని మూడు ముక్కలాట ఆడారు. పదేండ్ల తర్వాత రాజధాని ఏది అంటే చెప్పుకోలేని దుస్థితికి తీసుకొచ్చారు.

రాజధాని నిర్మాణానికి డబ్బులు ఎక్కడివి అని మాట్లాడారు. రైతులు ఇచ్చిన భూములే కాకుండా ప్రభుత్వ భూములు కలుపుకుని 55 వేల ఎకరాలను సేకరించాం. 29 వేల మంది రైతుల్లో ఒక్కరు కూడా కోర్టుకు వెళ్లకుండా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. ఒక ప్రాజెక్టు కట్టాలంటే భూమి ఇవ్వడానికి ఇష్టపడని ఈ రోజుల్లో రాజధాని కోసం ముందుకు వచ్చి రైతుల భూములు ఇచ్చారు. వారిచ్చిన భూములు, ప్రభుత్వ భూముల్లో రోడ్లు, బిల్డింగులు, ఇతర నిర్మాణాలు పోను మిగిలిన భూములు అమ్మితే రాజధానిని నిర్మించుకోవచ్చు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని నేను మొదటి నుండి చెప్తూనే ఉన్నా. ఇక్కడ వచ్చే ఆదాయమే రాజధాని నిర్మాణానికి సరిపోతుంది. రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు కూడా రాజధాని సంపదతోనే అమలు చేయవచ్చు...కానీ గత పాలకులు నిర్వీర్యం చేశారని చంద్రబాబు విమర్శించారు.


రాజధాని విధ్వంసంపై ప్రజలకు వివరిస్తాం...

"ఐదేండ్లు పట్టించుకోకపోవడంతో బిల్డింగులన్నీ బూజు పట్టాయి. కొన్నింటిని పగలగొట్టారు. రాజధానికి వ్యతిరేకంగా ఏమేం చేయాలో అన్నింటినీ చేశారు. కాపాడుకోవాలనుకున్న రైతులపైనా పోలీసులు ఏకపక్షంగా కేసులు పెట్టారు. నిర్మాణాల కోసం కాంట్రాక్టర్లు తెచ్చిపెట్టిన మెటీరియల్ దోచుకెళ్లారు. రాజధానిలో గత ప్రభుత్వం ఎంతటి నష్టం కలిగించిందో ప్రజలకు వివరిస్తాం. బ్రహ్మాండంగా ఉండాల్సిన రాజధానిలో..ఇప్పుడు తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలతో కమ్మేసుకుంది. ఇవన్నీ బాగుచేస్తాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

నిరుద్యోగ మార్చ్ కాదు... బీఆర్ఎస్ కార్యకర్తల మార్చ్

వారి గురించి మాట్లాడే అర్హత గులాబీ నేతలకు లేదు

టీపీసీసీ అధికార ప్రతినిధులు రియాజ్, చనగాని దయాకర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగుల మార్చ్ పేరుతో బీఆర్ఎస్ రాజకీయం చేయడం సిగ్గు చేటని టీపీసీసీ అధికార ప్రతినిధులు రియాజ్, చనగాని దయాకర్ అన్నారు. ఆ పార్టీ నిరుద్యోగ మార్చ్ పేరుతో కార్యకర్తల మార్చ్ నిర్వహించిందని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు రవళిరెడ్డి, డాక్టర్ లింగం యాదవ్‌తో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కారు ఎంతో మంది నిరుద్యోగులను పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఉద్యోగుల నోటిఫికేషన్లు వేయడం లేదంటూ మనస్థాపానికి గురైన నిరుద్యోగ యువతి ప్రవల్లిక హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవల్లిక విషయంలో మాజీ మంత్రి కేటీఆర్ పోలీసుల సహకారంతో కట్టు కథలు చెప్పించి ఆమె కుటుంబాన్ని సైతం ఆవేదనకు గురి చేశారని విమర్శించారు. ఆమె ఆత్మహత్యను కూడా హేళన చేసిన చరిత్ర వారిదని వాపోయారు. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ సర్కారు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన అశోక్ కుమార్ వెనుక కేటీఆర్ పైసల ముఠా ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్ నిర్వహించిన నిరుద్యోగుల మార్చ్ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఏ ఒక్క నిరుద్యోగి కూడా లేడని చెప్పారు. అడ్డా మీది కూలీలతో మార్చ్ నిర్వహించడం ద్వారా కేటీఆర్ కుట్రకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగ జాబ్ క్యాలెండర్ దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మాత్రం కృత్రిమ ఉద్యమాన్ని సృష్టించే పనిలో పడిందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని వారు హెచ్చరించారు.

మొక్కుబడి బాట

కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి హోదాలో పాల్గొనని వైనం

ఒకటో తరగతిలో 60,673 మంది మాత్రమే చేరిక

గతేడాది జూన్ 12 నాటికి 1.46 లక్షల మందికి ప్రవేశం

బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు

సర్కారు స్కూళ్లలో 18.50 లక్షల మంది విద్యార్థులకు యూనిఫారాలు

20.98 లక్షల మందికి పాఠ్యపుస్తకాలు, 11.65 లక్షల మందికి నోట్ పుస్తకాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభమైన జయశంకర్ బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంకా కొనసాగుతూనే ఉన్నది. ఇందులో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు బిజీబిజీగా ఉన్నారు. దీంతో బడిబాట కార్యక్రమాన్ని పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై ప్రభావం పడడమే అందుకు నిదర్శనం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు ఒకటో తరగతిలో ఇప్పటి వరకు 60,673 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. గత విద్యాసంవత్సరంలో జూన్ 12 నాటికి ఒకటో తరగతిలో 1,46,824 మంది చేరడం గమనార్హం. గతేడాది కంటే ఈ ఏడాది 86,151 మంది విద్యార్థులు తక్కువ చేరారు. అంటే ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పాల్గొనలేదని అర్థమవుతున్నది. ఇంకోవైపు విద్యాశాఖ అధికారులు ఎక్కువ సమయాన్ని ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల కోసమే కేటాయించినట్టు తెలుస్తున్నది. అందుకే ఎక్కువ మంది విద్యార్థులను ఆకర్షించలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తుందని అందరూ ఆశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని విద్యాశాఖ అధికారులు ముందుగా ప్రకటించారు. కానీ మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి నడిచారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ముఖ్యమంత్రి హోదాలో పాల్గొనకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అయినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు.

విద్యార్థులను ఆకట్టుకోని వినూత్న ప్రచారం

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం... విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది ప్రభుత్వం వినూత్నంగా ఈ ప్రచారాన్ని నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేలా వారిని చైతన్యవంతులను చేయాలని నిర్ణయించింది. ప్రయివేటు పాఠశాలల్లో చేరితే ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పిస్తే ఆ డబ్బు ఆదా చేసే అవకాశముంటుందనీ, పిల్లల ఉన్నత చదువులకు పొదుపు చేయొచ్చని సరికొత్త ప్రచారానికి సర్కారు శ్రీకారం చుట్టింది. ప్రయివేటు విద్యారంగంపై మోజు తగ్గించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేసినా విస్తృతంగా ప్రచారం నిర్వహించినా ఆశించిన స్థాయిలో విద్యార్థులను ఆకట్టుకోలేదు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరలేదు.

వందశాతం ఒక జత యూనిఫారం పంపిణీ

రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో స్వయం సహాయక బృందాల సహకారంతో వంద శాతం ఒక జత యూనిఫారాలను విద్యార్థులకు ప్రభుత్వం అందించింది. బడులు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు పంపిణీ చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 18,50,400 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫారాలను అందించింది. 20,98,099 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసింది. 11,65,748 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలను ఇచ్చింది. ఇప్పటి వరకు 4,31,780 మంది విద్యార్థులకు వర్క్ బుక్స్ పంపిణీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విద్యార్థికీ ఏ కారణంతో ప్రవేశాన్ని నిరాకరించబోమని విద్యాశాఖ ప్రకటించింది. ఉదయం రాగిజావ, మధ్యాహ్నం పౌష్టికాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపింది. ఒత్తిడి లేని విద్యతోపాటు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి చక్కని అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. సర్కారు బడుల్లో పిల్లలను చదివిస్తే ఆదా అయ్యే డబ్బు వారి ఉన్నత విద్యకు వాడుకునే అవకాశముందని తల్లిదండ్రులకు వివరించింది.

ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాది

ప్రతిపక్ష నేతగా నేనే : నవీన్ పట్నాయక్



ఒడిశా: భువనేశ్వర్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాధి బాధ్యతలు చేపట్టారు. అసెంబ్లీలో ఆమె బాధ్యతలు స్వీకరించేటపుడు ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ, ప్రతిపక్ష నేత, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ అభినందనలు తెలిపారు. ఒడిశా అసెంబ్లీలో తానే ప్రతిపక్ష నేతగా ఉంటానని మాజీ సీఎం నవీన్ పట్నాయక్ చెప్పారు. పార్టీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు మీడియాకు తెలిపారు. బీజేడీ ఎమ్మెల్యేలంతా తనను బీజేడీ సభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. 24 ఏండ్ల పాటు ఒడిశాలో అధికారంలో ఉన్న బీజేడీ ఇటీవల అసెంబ్లీలో ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. 78 సీట్లు గెలుచుకున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, ఎన్టీఏ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్టీఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ..2013 కంటే ముందు రాష్ట్రాల వారీగా జరిగినట్టు పాత పద్ధతిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ నుంచి ప్రదర్శనగా వెళ్లి సరిత క్లినిక్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పరీక్ష లీకేజీపై తక్షణమే నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్‌తో చెలగాటమాడటం సరికాదన్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు.

ముందుగా సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు.సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, పటాన్‌చెరు, ఇతర ప్రాంతాలలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. నీట్ అక్రమాలపై ప్రధాని మోడీ ఎందుకు నోరు విప్పడం లేదని సీపీఐ(ఎం) నాయకులు ప్రశ్నించారు. నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నీట్ పరీక్షలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అంతవరకు విద్యాశాఖ మంత్రి బాధ్యతల నుంచి వైదొలగాలని నేతలు డిమాండ్ చేశారు.

'నీట్'పై విచారణ జరిపించాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిద్ధగోని రమేష్ గౌడ్



నవతెలంగాణ- హైదరాబాద్

నీట్‌లో అవకతవకలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన సంబంధిత మంత్రులు వెంటనే రాజీనామా చేయాలని, నీట్‌పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిద్ధగోని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓవైపు కేంద్రం గ్రేస్ మార్కుల గందరగోళం సృష్టించగా, మరోవైపు పేపర్ లీకేజీతో తమ పిల్లల భవిష్యత్ ఏంటని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. పరీక్షా పే చర్చ నిర్వహించే ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు నీట్ వ్యవహారంపై స్పందించాలని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రేయింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని అన్నారు.

సింగరేణి మెడపై కేంద్రం కత్తి

(మొదటిపేజీ తరువాయి)

తదితరులతో కలిసి కేటీఆర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. వందేళ్ల చరిత్ర ఉన్న సింగరేణిని బొందపెట్టేందుకు మోడీ సర్కారు ప్రయత్నించటం దారుణమన్నారు. కేంద్రానికి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో మోడీ సర్కారుకు మద్దతు పలుకుతోందని దుయ్యబట్టారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రధానికి లేఖ రాసిన రేవంత్... ఇప్పుడు సీఎం హోదాలో ఎందుకు వ్యతిరేకించటం లేదని ప్రశ్నించారు. ఆయన ఎందుకు మౌనం దాల్చుతున్నారని నిలదీశారు. కేసుల భయమా..? లేక మరేదైనా కారణమా..? అని ఎద్దేవా చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయటానికి కేంద్రం సాహసించలేకపోయిందని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. అప్పట్లో మాజీ సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాయటంతో వాటి జోలికి రాలేదని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి అంతా తారుమారైందని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో రెండు కోల్ బ్లాకులను అక్కడి ప్రభుత్వరంగ సంస్థ అయిన మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు, ఒడిశాలో రెండు లిగ్నైట్ గనులను అక్కడి ప్రభుత్వరంగ సంస్థలకు ఇచ్చారని తెలిపారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై కూడా వేలం విషయమై అభ్యంతరం తెలిపితే...ఎలాంటి వేలం లేకుండానే అక్కడి లిగ్నైట్ గనులను కేటాయించారని వివరించారు.ఆ మూడు రాష్ట్రాలకు భిన్నంగా తెలంగాణలోని సింగరేణికి మాత్రం ఎందుకు గనులు కేటాయించటం లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేవనే కారణంతో, నష్టాల బూచి చూపి, దాన్ని ప్రయివేటీకరించేందుకు కేంద్రం పావులు కదిపిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో సింగరేణికి కూడా అదే దుస్థితి ఎదురుకానుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బొగ్గు బ్లాకుల వేలానికి కేంద్రం పూనుకుందని వాపోయారు. ఈ వేలం ప్రక్రియలో ఎందుకు పాల్గొంటున్నారో చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆయన ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు సైతం ఈ దుర్మార్గంపై ఆలోచించాలనీ, సంస్థను కాపాడుకునేందుకు నడుం బిగించాలని కేటీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డి.. తెలంగాణకు ఏదో చేస్తారనుకుంటే, ఆయన ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ సింగరేణిని ప్రయివేటీకరించటమేనా..? అని ఎద్దేవా చేశారు. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవటంతోనే కేంద్రం ఇలాంటి చర్యలకు ఒడిగడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ గద్దలకు బొగ్గు గనులను కేటాయిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. 'నాలుగున్నరేండ్ల తర్వాత మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం, అప్పుడు బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేస్తాం, ఇప్పటి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాం... అందువల్ల వేలంలో పాల్గొనే వాళ్లు ఆలోచించుకోవాలి...' అని కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రెండు, మూడు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

జీఓ 5ని వెంటనే ఉపసంహరించుకోవాలి

ఐటీ పరిశ్రమలో కార్మిక చట్టాల సడలింపు సరికాదు

తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని ఐటీ పరిశ్రమల్లో కార్మిక చట్టాలను మరో నాలుగేండ్ల పాటు సడలిస్తూ కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జారీ చేసిన జీవో నెంబర్ 5ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆ జీవో వల్ల ఐటీరంగంలో పనిచేస్తున్న కార్మికులకు నష్టం చేకూరే ప్రమాదముందని జె.వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లుగా రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలో కార్మిక శాఖ తనిఖీలు చేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కరోనా కాలం తర్వాత ఐటీ రంగంలో ఉన్న సౌకర్యాలను తగ్గించారనీ, వేతనాల్లో కోతపెట్టడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్మిక చట్టాలు ఆ రంగంలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.సురేశ్, ప్రధాన కార్యదర్శి జెనీమా, కోశాధికారి ఎవీబీ లక్ష్మి, సహాయ కార్యదర్శి కవిత, ఉపాధ్యక్షులు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల నూతన రేట్ల ఒప్పందంపై కార్మిక సంఘాలతో కలిసి ఐక్యపోరాటం

పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాలశాఖలోని హమాలీల నూతన రేట్ల ఒప్పందం అమలు కోసం కార్మిక సంఘాలన్నింటితో చర్చించి, ఐక్య పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. పౌరసరఫరాలశాఖ, జీసీసీ హమాలీల ఉద్యమానికి సీఐటీయూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. తెలంగాణ సివిల్ సప్లయిస్, జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్స్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ సివిల్ సప్లై భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి భాస్కర్ మాట్లాడుతూ 2024 జనవరి 1 నుంచి నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాల్సి ఉన్నా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగీకరించిన సమస్యలను కూడా పరిష్కరించడం లేదని విమర్శించారు. జీసీసీ హమాలీలకు పీఎఫ్, స్వీపర్లకు కనీస వేతనాల హామీని అమలు చేయడం లేదని తెలిపారు. వారి పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించినట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో సివిల్ సప్లయిస్, జీసీసీలో 3,500 మంది హమాలీ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 80 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు, పేద పిల్లల హాస్టళ్లు, మధ్యాహ్న భోజనం నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించడంలో హమాలీల పాత్ర కీలకమని తెలిపారు. అయినప్పటికీ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు, కనీస వేతనాలు ఇచ్చేందుకు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, గ్రాట్యుటీ తదితర చట్టబద్ధ హక్కులతో ఉద్యోగ భద్రత కల్పించేందుకు పాలకులు నిరాకరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ గోదాములు నిర్మించి హమాలీలకు భద్రత కల్పించాలనీ, ప్రమాదంలో మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా, 60 ఏండ్లు పైబడిన హమాలీ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్లు కల్పించాలనీ, స్వీపర్లకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, హమాలీల కాలనీల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామంటూ హామీలిచ్చిందని గుర్తుచేశారు. అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు గడుస్తున్నా రేట్ల ఒప్పందం చేయకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.ధర్నాలో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్, అధ్యక్షులు కె.బాలయ్య, జీసీసీ హమాలీల సంఘం అధ్యక్షులు బుస్సా మొగిలి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి వీరాస్వామి, నాయకులు సవారి, వంగూరు ఇస్తారి, గోపాల్, రమేష్ భాస్కర్, శివ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారానికి కృషి :వీఎస్ఎన్ వీ ప్రసాద్

అనంతరం యూనియన్ ప్రతినిధులు సివిల్ సప్లైస్ డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, కమిషనర్ సెలవుల నుంచి వచ్చిన తర్వాత చర్చించి త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

దళితులపై దాడి చేసిన పెత్తందారులను తక్షణమే అరెస్ట్ చేయాలి

దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించాలి:కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళితులపై దాడి చేసిన పెత్తందారులను తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట చెందిన బుడగజంగాలపై ఆ గ్రామానికి చెందిన పెత్తందారులు మూకుమ్మడిగా దాడులకు పాల్పడి నాలుగు కుటుంబాలను విచక్షణ రహితంగా కొట్టారని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో గత నాలుగేండ్లుగా వరసగా దళితులపై సదరు పెత్తందారులు దాడులకు పాల్పడుతున్నారనీ, పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పదేపదే ఆ దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇంత జరిగినా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. జిల్లా మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ఈ ఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపై దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా ఊట్కూరు మండలం చిన్న పొర్ల గ్రామంలో భూతగాదాల విషయంలో ఓ దళితుడిపై మూకుమ్మడిగా కర్రలతో దాడి చేసి హత్య చేశారనీ, అక్కడ జరిగిన వివాదంపై ముందస్తుగా పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఆ సంఘటన జరిగిందని పేర్కొన్నారు.

హైదరాబాద్ శివారు మియాపూర్ ప్రాంతంలో 12 ఏండ్ల గిరిజన బాలిక అదృశ్యమైతే తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. పోలీసులు స్పందించకపోవడంతో బాలికపై లైంగిదాడి చేసి, తలవరకే నిప్పు పెట్టి కర్కశత్వానికి ఒడిగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పాలడుగు నాగార్జున అధ్యక్షతన జరిగిన కేవీపీఎస్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ బాల పీరు, రెమిడాల పరుశరాములు, నాయకులు బొట్టు శివకుమార్, పెరిక విజయ్, బొల్లు రవీంద్ర కుమార్, దైద దేవయ్య, బొంగరాల వెంకన్న, రాజేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోండి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి కోదండరాం లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు పాఠశాలల్లో ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం కోరారు. ఈ మేరకు గురువారం ఆయన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశానికి లేఖ రాశారు. పాఠ్య పుస్తకాలకు సంబంధించి ప్రయివేటు పాఠశాల కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 1 అమలు కావడం లేదని టెక్స్ట్ బుక్ ప్రింటర్స్, పబ్లిషర్స్ వెలిబుచ్చుతున్న ఆవేదనను పరిగణనలోకి తీసుకుని సమీక్షించాలని సూచించారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తమ సొంత పుస్తకాలు అమ్మకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలోని అన్ని ప్రయివేటు పాఠశాలలు జీవో నెంబర్ 1 ప్రకారం... ప్రభుత్వ సూచించిన టెక్స్ట్ బుక్స్‌నే ఉపయోగించాల్సి ఉందని గుర్తుచేశారు. ఈ విషయంపై పాఠశాల విద్య సంచాలకులు ప్రొసీడింగ్ ఇస్తూ, ఈ ఆదేశాలను పాటించని ప్రయివేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించినట్టు తెలిపారు. వీటిని బేఖాతరు చేస్తూ రాష్ట్రంలో పలు ప్రయివేటు పాఠశాలలు తమ సొంత టెక్స్ట్ బుక్స్‌కు అధిక ధరలు నిర్ణయించి అమ్ముకుంటున్నాయని తెలిపారు. ఈ యాజమాన్యాలు కేవలం ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా పని చేయడమే కాకుండా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులపై అధికంగా ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన టెక్స్ట్ బుక్స్ సెట్ ధర రూ.900 ఉంటే వాటిని కాకుండా రూ.10 వేల నుంచి రూ.15 వేలకు ధర ఉన్న తమ సొంత పుస్తకాలు కొనుగోలు చేయాలని యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయని వివరించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తూ దోపిడీ చేస్తున్న ప్రయివేటు యాజమాన్యాలు ప్రభుత్వ, ఎస్సీఈఆర్టీ అధికారాలను లెక్కచేయడం లేదని తెలిపారు. వీరి కారణంగా ప్రభుత్వం చేత అనుమతి పొందిన ప్రింటర్లు, పబ్లిషర్స్ ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముద్రించిన వాటిలో కేవలం 35 శాతం మాత్రమే అమ్ముకోగలిగారని తెలిపారు. మిగిలిన పుస్తకాలు కూడా అమ్ముకునేందుకు వారికి అనుమతివ్వాలని కోరారు.

రైతుభరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలి

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుభరోసా పథకం కింద పంట పెట్టుబడి సాయం కోసం ప్రతి ఎకరాకూ ఏడాదికి రైతులకు రూ.15 వేలు అందిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. ఆ నిధులను తక్షణమే విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని గురువారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందనీ, అందువల్ల ఆరు గ్యారంటీల్లో ఒకటైన రైతు భరోసా నిధులను తక్షణమే అందించాలని కోరారు. ఈ సీజన్‌లో కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతుల ఖాతాల్లో రూ.రెండు వేల సహాయం అందిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రైతు భరోసా డబ్బుల కోసం వారు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఖరీఫ్ వ్యవసాయ పెట్టుబడులకు డబ్బుల్లేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేసి, కొత్త రుణాలను అందించాలని సూచించారు. రైతు బీమా రెన్యూవల్, పంటల బీమా ప్రీమియాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. శుక్రవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతాంగ సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

మద్దతు ధర నిర్ణయంలో కేంద్రం మోసం :తెలంగాణ రైతు సంఘం

వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలను లెక్కల్లో పెంచినట్టు చూపి కేంద్రం మరోసారి రైతులను మోసం చేసిందని తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి. సాగర్ విమర్శించారు. ఆ రకంగా ఉత్పత్తి ఖర్చులను తగ్గించి చూపిందని తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్పత్తి ధరలను శాస్త్రీయంగా, వాస్తవ ఖర్చు ఆధారంగా నిర్ణయించి దానికి స్వామినాథన్ కమిషన్ చెప్పినట్టు 50శాతాన్ని జత చేసి మద్దతు ధర నిర్ణయించాలని కోరారు. 50 శాతం కలుపుతున్నట్టు పదే పదే చెబుతున్న కేంద్ర ప్రభుత్వం...ఉత్పత్తి ఖర్చును 40 శాతానికి తగ్గించి ధరలను నిర్ణయిస్తున్నదని విమర్శించారు. ధరల నిర్ణాయక కమిషన్ నిర్ణయించిన ఉత్పత్తి ఖర్చును పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు.

నేడు మంత్రివర్గం భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఇదే అంశంపై క్యాబినెట్‌లో చర్చించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. రుణమాఫీకి సుమారు రూ.30వేల కోట్లు, రైతుభరోసాకు మరో రూ.7వేల కోట్లు అవసరమవడంతో, నిధుల సేకరణ ఎలా అనే అంశంపై క్యాబినెట్‌లో చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. రైతులతో ముడిపడి ఉన్న ఈ రెండు అంశాలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకోవడంతో సాధ్యమైనంత త్వరగా వీటిని అమలు చేసి ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఏకకాలంలో, ఏక మొత్తంలో రైతులు తీసుకున్న రూ.2లక్షల వరకు రుణాలన్నీ ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రుణమాఫీ విషయంలో కొందరిని మినహాయించాలని నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్, ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారు, ఉద్యోగులను దీని నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో .రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది. రుణమాఫీ పథకానికి ఎప్పటి నుంచి కట్ ఆఫ్ డేట్‌ను నిర్ణయించాలి, ఇంకా ఎలాంటి నిబంధనలు విధించాలన్నదా నిపై కసరత్తు చేస్తున్నారు. దీనిపై క్యాబినెట్ భేటీలో కూలంకషంగా చర్చించి, మంత్రుల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని సీఎం ఆలోచిస్తున్నారు. అలాగే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నందున ప్రారంభ తేదీని ఖరారు చేయనున్నారు. ఇప్పటికే ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఈ సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సమాయత్తమవుతోంది.ఎన్నికల కోడ్ అనంతరం జరుగుతున్న ఈ భేటీలో వివిధ పథకాలకు, అభివృద్ధి పనులకు కేటాయింపు లు, సమావేశాల నిర్వహణ, అధికార చిహ్నం, పార్లమెంట్ సెగ్మెంట్‌కో జిల్లా గా, 17 జిల్లాలకు కుదింపు, రాష్ట్ర విభజన అంశాల్లోని 9, 10 షెడ్యూల్‌కు సంబంధించిన ఆస్తులపైనా చర్చించనున్నట్టు సమాచారం.గవర్నర్ సంతకమయినా సాంకేతిక సమస్యతో బ్రేక్ పడ్డ ప్రభుత్వంల ఆర్టీసీ ఉద్యోగుల విలీనంతో పాటు ఏపీ తెలంగాణ ఉద్యోగుల అంశాల గురించి ఈ భేటీలో చర్చించే అవకాశముంది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తో న్న ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో వచ్చిన అవినీతి, ఆరోపణలు, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో వెలుగుచూసిన కుంభకోణంపై కొనసాగుతోన్న విచారణలు, కేంద్ర నివేదికల ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు గత ప్రభుత్వంలో ఆయా శాఖలకు వ్యవహరించిన మంత్రులు, అధికారులపై తీసుకోవాల్సిన చర్యల గురించీ ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అనేక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు జరుగుతున్న ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

నేడే బొగ్గుగనుల వేలం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం హైదరాబాద్‌లో బొగ్గు గనుల వేలం నిర్వహించనున్నారు. ప్రతి ఏటా ఏదో ఒక నగరంలో బొగ్గు బ్లాకుల వేలాన్ని నిర్వహిస్తారు. మన రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉండటంతో 10వ రౌండ్ కమర్షియల్ మైనింగ్ వేలాన్ని ఆయన నేడు హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా 60 బొగ్గు బ్లాక్‌లను వేలం వేయనున్నారు. ఇందులో వివిధ రకాల కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు గనులున్నాయి. వీటిలో 24 బొగ్గు గనులను పూర్తిగా అన్వేషించగా, 36 గనుల్లో పాక్షిక అన్వేషణ జరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా ఒడిశా 16, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో 15, జార్ఖండ్‌లో 6, పశ్చిమబెంగాల్, బీహార్‌లలో మూడేసి బొగ్గు బ్లాకులను గుర్తించారు. తెలంగాణ, మహారాష్ట్రలో ఒక బ్లాక్‌లను వేలం వేయనున్నారు. బొగ్గు రంగంలో పారదర్శకత, పోటీతత్వ ం, సుస్థిరతను పెంపొందించడానికి దోహదపడుతుందని అధికార బీజేపీ అంటోంది. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ఉన్న ఈ బ్లాక్‌లు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు దోహదం చేస్తాయని వాదిస్తోంది. అయితే ఈ వాదనను రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ మొదలగు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెట్టేందుకే వేలం అని విమర్శిస్తున్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వేలంలో పాల్గొనేందుకు నిర్ణయించింది. బిడ్‌లో పాల్గొనకుంటే సింగరేణి కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నది. గత బీఆర్ఎస్ సర్కార్ వేలానికి మద్దతు పలికిందని ఈ సందర్భంగా వాదిస్తోంది.

శ్రావణపల్లి కోసం సింగరేణి ప్రయత్నం

రాష్ట్రంలో గుర్తించి ఏకైక బొగ్గు బ్లాకైన శ్రావణపల్లిని దక్కించుకునేందుకు సింగరేణి ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు వేలంలో పాల్గొనేందుకు ఆ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసుకుంది. రాష్ట్రంలో సింగరేణి మొత్తం 40 గనుల్లో బొగ్గును వెలికి తీస్తోంది. 2030 కల్లా 22 గనులు మూతపడే అవకాశం ఉంది. ఇప్పుడున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి 15 టన్నులకు పడిపోనుంది. కొత్త గనులు సంపాదించుకోక పోతే సింగరేణి చరిత్రలో కలిసి పోవడం ఖాయం. ఈ నేపథ్యంలో సంస్థను రక్షించుకునేందుకు 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలున్న రాష్ట్రంలోని శ్రావణపల్లి గనిని దక్కించుకునేందుకు సింగరేణి తనవంతుగా వేలంలో పాల్గొనేందుకు సిద్ధమైంది.

'సమయ పాలన పాటించకుంటే కఠిన చర్యలు'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమయ పాలన పాటించని ఉద్యోగులకు కఠిన చర్యలు తప్పవని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు.హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని (టీజీటీడీసీ) గురువారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రిసెప్షన్‌లో ఉన్న హాజరు పట్టిక, బయోమెట్రిక్‌లో అటెండెన్స్‌ను పరిశీలించారు. ప్రతీ ఫ్లోర్‌ను కలియ తిరిగి ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. పూర్తి స్థాయిలో సిబ్బంది రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటే ఏం చేస్తున్నారని ఎమ్‌డీ రమేశ్‌నాయుడుపై ఈ సందర్భంగా మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ దారి మారేనా...



నవతెలంగాణ-కొత్తపేట్

శ్రీరామలింగేశ్వర కాలనీకి చెందిన కమాన్ నుంచి నాగోల్ మెయిన్ రోడ్డు పోయే దారిలో దాదాపు 500 మీటర్ల పొడవునా రోడ్డు మొత్తం కరాబై పోయింది. ఇది గత నాలుగు నెలలుగా ఇలాగే ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. ఈ దారిలో జీహెచ్ఎంసీ పార్క్, గోశాల గుడి ఉండడం ఇంకా ప్రజలకు ఇబ్బందిగా మారింది. వాకర్, భక్తులు వాహనాలతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోపుతున్నారు. దీనిని అధికారుల వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ చైర్మెన్‌కు సన్మానం



నవతెలంగాణ-సంతోష్ నగర్

దేవరకొండ మున్సిపల్ చైర్మెన్ అల్లంపల్లి నరసింహకు బుధవారం దేవరకొండ ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సభావత్ రాము చౌహాన్, దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. శాలువాతో ఘనంగా సన్మానించి, ఎల్ఐసి ఆధ్వర్యంలో రూపొందించిన మిషన్ విజన్ సంచికను అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ప్రజలకు, పాలసీదారులకు అందజేస్తున్న ఉత్పత్తులను, సేవలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిబ్బంది, అభిమానులు పెద్దలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణీ



నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య శాఖ అధికారులు అధికారుల ఆధ్వర్యంలో నులి పురుగుల మందులు విద్యార్థులకు పంపిణీ కార్యక్రమంలో భాగంగా మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్ పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనీమియాను నివారించేందుకు నులిపురుగుల నివారణ ఎంతో ముఖ్యమని అందుకు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులు అందరు వేసుకోవాలన్నారు. అందువల్ల కడుపులో ఉన్నటువంటి నులిపురుగులు అన్నీ కూడా నిర్మూలించబడతాయని తద్వారా రక్తహీనత, శారీరక అలసట తగ్గుతాయని మంచి ఆరోగ్యం పెంపొందించుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు. ప్రతీ సంవత్సరం కూడా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. విద్యార్థి దశనుంచి పిల్లలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన పెంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పాలన్నారు. ప్రభుత్వం తరపున ప్రతీ ఆరునెలలకోకసారి 1-19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గజ్జల రామచందర్, ఆర్ఓ అంజన్ రెడ్డి, డాక్టర్ వైశాలి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ రమేష్, లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయురాలు సరళ, విద్యార్థులు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ మందులను వేసుకోవాలని డివిజన్ పరిధిలోని నందనవనం భూపేష్ గుప్తా నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరపర చేసిన టాబ్లెట్లను పంపిణీ హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని సుజాత నాయక్ తెలిపారు.

నవతెలంగాణ-హస్తినాపురం



విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణిస్తారనీ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు నులి పురుగుల నివారణ కోసం మందులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పంపిణీ చేశారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



తమ పిల్లల ఆరోగ్యల పట్ల తల్లిదండ్రులు ఎప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఏ చిన్నపాటి జబ్బు సోకిన నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యుల సలహా తీసుకొని వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌నాథ్ యాదవ్ సూచించారు.

నవతెలంగాణ-నాగోల్

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- **సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎండీ. అబ్బాస్**

నవతెలంగాణ-సంతోష్ నగర్

నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి, విద్యార్థులకు నాయం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ.అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్‌క్రాస్రోడ్స్ సంతోష్‌నగర్ వద్ద నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ... ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నీట్ మొదటిసారి నిర్వహించినప్పుడే సీపీఐ(ఎం) ఇది సరైన పద్ధతి కాదని, మెడిసిన్ విద్యార్థులకు నిర్వహించే కామన్ టెస్ట్ ఏరాష్ట్రానికి ఆరాష్ట్రమే నిర్వహించడం సరైందని చెప్పినట్లు గుర్తు చేశారు. ఏ పరీక్షలోనైనావందకు వంద మార్కులు వస్తే లక్షల్లో ఒకరు ఉంటారేమో కానీ, 4750 పరీక్ష కేంద్రాలుంటే ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురికి వందశాతం మార్కులు రావడం, మొత్తం 67మందికి వందకు వంద శాతం రావడం సోచనీయమన్నారు. ఇదంతా ప్రశ్నాపత్రం లీక్ కావడంతోనే జరిగిందని దేశమంతా గగ్గోలు పెట్టినా కేంద్రప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. దేశవ్యాపితంగా 571పరీక్ష కేంద్రాలు ఉంటే 14పరీక్ష కేంద్రాలు విదేశాల్లో ఉన్నాయి. పరీక్ష ముందురోజే బీహార్, పాట్నాలలో పేపర్ లీక్ అయినట్లు బయటపడింది. 30 నుంచి 50 లక్షల రూపాయలు వసూలు చేసి పరీక్ష పత్రాన్ని లీక్ చేశారు. దానికి బాధ్యులైన 13మందిని బీహార్ పోలీసులు అరెస్ట్‌చేశారు. అయినా కేంద్రప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నదో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ఎవరైతే ఈ లీకేజికి పాల్పడ్డారో వారిని కఠినంగా శిక్షించాలి. సుప్రీం కోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరిపించి, నీట్ రద్దు చేయాలి. ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులువిఠల్, ఎం.మీనా, ఎల్. కోటయ్య, ఎం.బాలు, ఎం.శ్రావణ్, గిరిజన సంఘం నాయకులు శోభనా నాయక్, జి.కిషన్, విద్యార్థి నాయకులు జి.రమేష్, యువజన సంఘం నాయకుడు ఎ.క్రిష్ణ, కార్యకర్తలు, సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



షాదిముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..



నవతెలంగాణ-మలక్ పేట్

మలక్ పేట్ నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 72 మంది లబ్దిదారులకు షాదిముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం ఎంఎల్ఏ బాలాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బలాల మాట్లాడుతూ నిరు పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదిముబారాక్, కల్యాణలక్ష్మి పథకాలు దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఎకౌంట్‌లో జమ అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ అధికారులు, ఆర్ఐ శ్రీకాంత్, ఎంఐఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రాక్ టౌన్ కాలనీలో శిక్షణ తరగతులు

నవతెలంగాణ-నాగోల్

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రాకు టౌన్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యోగ తరగతిలో నిర్వహిసున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్ రెడ్డి తెలిపారు. యోగ గురువు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 5:30 నుంచి 6:30 వరకు గంటపాటు రాక్ టౌన్ కాలనీలోని జిమ్ పార్కులో యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో కాలనీవాసులు, మిత్రులు, శ్రేయోభిలాషులు యోగా మ్యాట్లు, వాటర్ బాటిల్లతో యోగా శిక్షణ తరగతులలో పాల్గొనాలని ఆయన కోరారు.

బాలుడు అదృశ్యం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బాలుడు అదృశ్యమైన సంఘటన పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో నివాసం ఉండే ఈదుల తిరుపతమ్మ, భర్త సాయి కుమార్‌లకు ఒక కుమారుడు ఒక కుతూరు ఉన్నారు. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19 సాయంత్రం తన కుమారుడు సాయి(చింటు) ఇంటి ముందు ఆడుకుంటూ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ఇంటి చుట్టూ పక్కల ఉన్న వారిని, బంధువులను, స్నేహితులను సంప్రదించగా సమాచారం శూన్యం. తల్లి పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమిషనర్‌కు వినతి పత్రం అందజేత



నవతేలంగాణ-ఎల్‌బి నగర్

సీపీఐ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం ఎమ్మెల్యే ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా చిరు వ్యాపారం చేసుకుంటున్న సుమారు 300 కుటుంబాలు పోలీసులు జీహెచ్ఎంసీ అధికారులు వేధింపులకు గురి చేస్తుంటే వారికి న్యాయం చేయాలని సీపీఐ నాయకులు సాంబశివరావు ఈస్ట్ జోన్ కమిషనర్ పంకజంకు వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ అధికారులని, కాలనీ వాసులను, చిరు వ్యాపారులను పిలిపించి మాట్లాడి వీలైనంత త్వరగా చిరు వ్యాపారస్తులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు బోయపల్లి రాములు, గౌడ్ ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పండ్ల మార్కెట్ ముంగట చిరు వ్యాపారస్తులు వ్యాపారం చేసుకుని ఏండ్ల తరబడి వాళ్ల కుటుంబాలను నడుపుకుంటున్నారన్నారు. పోలీసులు జీహెచ్ఎంసీ అధికారులు వారి వ్యాపారులను తొలగించే విధంగా నాలుగు నెలలుగా వేధింపుల గురి చేయడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకుని వారికి న్యాయం చేసే విధానంగా చేయాలని లేని ఎడల వ్యాపారస్తులను అందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సరూర్‌నగర్ మండల్ కార్యదర్శి బాతురాజు, నరసింహ, ఏఐటీయూసీ హయత్ నగర్ మండల్ కార్యదర్శి సెక్రు నాయక్, సరూర్‌నగర్ మండల్ కౌన్సిల్ నాయకులు జ్యోతి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న కాలువ కథనానికి స్పందన



- **సంపూర్ణ హెూటల్‌కు నోటీసులు జారీ**
- **ఆహార విక్రయ కేంద్రాలలో శుభ్రం లోపిస్తే కఠిన చర్యలు**
- **కమిషనర్ రవీందర్ రెడ్డి**

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ ఓఆర్ఆర్ సమీపంలోని సంపూర్ణ హెూటల్ వదిలిన మురుగునీరు కాలువపై దుర్గంధం వెదజల్లుతున్న కాల్వ అనే శీర్షిక కథనం నవతెలంగాణలో గురువారం ప్రచురితమైన విషయం విధితమే. ఈ కథనానికి పెద్ద అంబర్ పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి స్పందించి, సంపూర్ణ హెూటల్ ను సందర్శించి అక్కడ పరిసరాలను పరిశీలించిన అనంతరం నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఆహారపు విక్రయ కేంద్రాలలో తప్పనిసరిగా నాణ్యతను, పరిశుభ్రతను పాటించాలని సూచించారు. నిబంధలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వడ్డేపల్లి విద్య విజేందర్రెడ్డి, హెూటల్ నిర్వాహకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలి



- **మేయర్ పారిజాత నర్సింహారెడ్డి**

నవతెలంగాణ-బడంగ్‌పేట్

గుర్రంగుడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి అని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంట్రాక్టర్లు సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుక రావాలని అధికారులను మేయర్ ఆదేశించారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ గుర్రంగుడలోని ఆదిత్య నగర్ కాలనిలో హెచ్ఎండిఏ ప్రత్యేక నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయటం కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, డీఈఈ యాదయ్య, ఏఈఈ వినీల్ గౌడ్, నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణు వర్ధన్ రెడ్డి, కాలనీ వాసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుపై కోదండరాం ఎందుకు ప్రశ్నించడం లేదు..

- **ఆర్కేపురం డివిజన్ అధ్యక్షులు శ్రీరాములు**



నవతెలంగాణ-చైతన్యపురి

ఆచరణ సాధ్యంగానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని, జన సమితి అధ్యక్షుడు కోదండరాం ఎందుకు ప్రశ్నించడం లేదని ఆర్కేపురం డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షులు శ్రీరాములు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ పై మాట్లాడుతున్న రఘు, కోదండరాంలు అప్పుడు ఎందుకు మాట్లాడలేదని అన్నారు. బీఆర్ఎస్‌ను భదనం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతున్నదని, ఆ కుట్రలో కోదం డరాం భాగస్వామ్యం అవ్వడం బాధాకరం అని పేరొన్నా రు. ఇప్పటి వరకు రైతుబంధు, ఆడ పిల్లలకు స్కూటీ లు, ఆటో వాళ్ళకు రూ.12000, దళిత బంధు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తులం బంగారం ఎక్కడ పోయింది అని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి ఉంటే బాగుండేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పుడు ఉన్న కరెంటు కోతల నుండి, మిగులు కరెంటును కేసీఆర్ తీసుకువచ్చాడని అన్నారు.

డ్రయినేజీ పనులను పూర్తి చేయండి



- **కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్**

నవతెలంగాణ-నాగోల్

నాగోలు డివిజన్లో నూతనంగా ప్రారంభమవుతున్న డ్రయినేజీ పైప్ లైన్ పనులను నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తేవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్ అధికారులకు సూచించారు. గురువారం డివిజన్‌లోని ఫతుల్లగూడలో సుమారు 2.00లక్షల నిధులతో డ్రయినేజీ లైన్స్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా నిర్మించబోయే డ్రయినేజీ లైన్స్ నాణ్యత పరిణామాలలో ఏమాత్రం తగ్గకుండా కాలనీ వాసులు ఏ ఇబ్బందీ కలగకుండా భారీ వర్షాలు రాకముందే తొందరగా డ్రయినేజీ లైన్స్ పూర్తి చేయాలని, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో ఎక్కడ ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే సకాలంలో సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అర్చన, వాటర్ వర్క్స్ సూపర్‌వైజర్ రమేష్, నాయకులు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, నరేందర్ రెడ్డి, సరస్వతి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీఎంకు ధన్యవాదములు : వీఆర్‌పీఎస్



నవతెలంగాణ-సంతోష్ నగర్

గత నెల 15న వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గుంజి సంతోష్ కుమార్ వడ్డెరలకు ఎస్టీ రిజర్వేషన్ కావాలని, వారు పడుతున్న సమస్యలను వివరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖను పంపించారు. గురువారం అందుకు సానుకూలంగా వీఆర్‌పీఎస్‌కు, సీఎంఓ ఆఫీస్ నుంచి లెటర్ వచ్చినందుకు గాను, వీఆర్పీఎస్ తరపున సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. వీఆర్‌పీఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అంతేకాక వడ్డెర్ల సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు గురించి చర్చించి, తదుపరి కార్యాచరణ రూపకల్పనను సిద్ధం చేశారు. ఈ సమావేశంలో వీఆర్‌పీఎస్ ముఖ్య నాయకులు తమ్మిశెట్టి శివకృష్ణ, బత్తుల ఉపేంద్ర, గంగాధర్ పాల్గొన్నారు.



మధ్యప్రదేశ్ కు చెందిన డాక్టర్ వీరేంద్ర కుమార్ కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంత్రిని , తెలంగాణ ఆరేకటిక సంఘము రాష్ట్ర నాయకులు జమాల్పూర్ బాలరాజు కలిసి బన్సీలాల్ శంకర్..శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-మీర్ పేట్

అక్రమ వాటర్ ప్లాంట్ ద్వారా విద్యుత్‌లో అంతరాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

విద్యుత్ సమస్యకు కారణం అవుతున్న వాటర్ ప్లాంట్‌లపై చర్యలు తీసుకొని మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని ఆల్విన్ కాలని ఏఈకి పాపి రెడ్డి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊట్ల చంద్రా రెడ్డివినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్‌లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్ల ద్వారా నిత్యం లక్షల లీటర్ల తోడేస్తూ మౌలిక వనరులకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే విషయం పలుమార్లు సంబంధిత విభాగాల అధికారులకు వినతి పత్రాలు అందించి సమస్యను పరిష్కరించాలని కోరినప్పటికీ, అధికారులు మాత్రం వాటర్ ప్లాంట్‌లపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని వదిలేస్తున్నారని అన్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌కు, కూకట్‌పల్లి మండల తహసిల్దార్‌కు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసిన వాటర్ ప్లాంట్‌ను తొలగించడంలో విఫలమవుతున్నారు. ప్రజల పక్షాన నిలబడాల్సిన పలువురు సంబంధిత అధికారులు వాటర్ ప్లాంట్ నిర్వాహకుల పక్షాన నిలబడడంతో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ఆడింది ఆటగా పాడింది పాటగా, నిత్యం లక్షల లీటర్లతో వ్యాపారం చేస్తున్నారు. ఒక్క పాపిరెడ్డి నగర్‌లోనే సుమారు ఐదు వాటర్ ప్లాంట్‌లు యెదేచ్ఛగా కొనసాగుతున్నాయి. బస్తీలో నిత్యం విద్యుత్ సమస్య ఏర్పడుతూనే ఉందనీ, విద్యుత్ అంతరాయం కలగడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎప్పుడు పడితే అప్పుడు లోవోల్టేజ్ సమస్యలు అధికమయ్యాయని తెలిపారు. అదే సమయంలో ఇంట్లో వాడే గృహెూపకరణాలు పాడైపోతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు స్థానిక నేతలు మొగుళ్ల కనగారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నాంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్ఎన్ ఎస్. మరనత అన్నారు. గురువారం నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బజార్ ఘాట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాంత రాజ్, కృష్ణ సందీప్, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'మలబార్ ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షో'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హిమాయత్ నగర్ మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూమ్ లో 'ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ' షోను ప్రముఖ మోడల్స్ నీలిమ, స్రీలు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం పీఆర్ఓ రాంబాబు మాట్లాడుతూ ఈ జ్యువలరీ షోలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతిరత్నభరణాలను ప్రదర్శిస్తుందని, ఈ ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యతతో అంతులేని హుందాతనంతో కూడినవని, నగిషీ చెక్కిన ప్రతి ఆభరణం తయారు చేసిన వారి అనుభవం, కళాత్మకతకు ఈ జ్యువలరీ షో నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ షో నేటి నుంచి ఈనెల 23వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని నగరవాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నులి పురుగుల సంక్రమణను పూర్తిగా నిర్మూలించాలి







నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్త పారమౌంట్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూలి పురుగుల నివారణ మాత్రలను పానీ పూరా క్లస్టర్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మల్లీశ్వరి, గోషా మహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్ సింగ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్‌పిహెచ్ఓ డాక్టర్ మల్లీశ్వరి మాట్లాడుతూ.. ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులి పురుగు నివారణ మాత్రలు వేసి పురుగులను పూర్తిగా నిర్మూలించడానికి ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పానీపూరా క్లస్టర్ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రాలను ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేశారు. ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు ప్రతి పిల్లలకు మాత్రలను తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్ కల్పన, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, నవీన్ అగర్వాల్, జైపాల్ సింగ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న బేగంబజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద్, పి హెచ్ ఎన్ నాగేశ్వరమ్మ తదితరులు

కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని

కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ డీప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, పి హెచ్ఎన్ రామలక్ష్మి, ఆర్‌బిఎస్‌కే డాక్టర్ రమేష్, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ నగర్‌లో ..

నేతాజీ నగర్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న గన్ ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, ఆగాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం జ్యోత్స్న, ఆశ వర్కర్ తదితరులు

నవతెలంగాణ-ధూల్‌పేట్

నూలి పురుగుల మాత్రలు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగిస్తాయని పురానాపూల్‌లో గల ఎస్వీ నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అఫ్జల్ గంజ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజా కుమారి అన్నారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో జాతీయ నూలి పురుగుల దినోత్సవ సందర్భంగా నూలి పురుగులను విద్యార్థులకు వేసిన తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొనీ మాట్లాడుతూ.. రోజురోజుకు కొత్త కొత్త వైరస్ లు ప్రాణాంతకమైన వ్యాధులకు దారి తీస్తున్నాయనీ ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహనను పెంపొందించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, సీనియర్ టీచర్స్ జ్యోతి, ప్రద్యుమ్న రెడ్డి, బల్వంత్ రెడ్డి, కౌసర్ ఫాతిమా, శ్రీనివాస్, పురానాపూల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా వర్కర్లు రజని, రజనీ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల సంక్రమణను పూర్తిగా నిర్మూలించాలి

నవతెలంగాణ-ముషీరాబాద్

నులి పురుగుల సంక్రమణను పూర్తిగా నిర్మూలించాలి అని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు.గాంధినగర్ డివిజన్ లోని అభ్యు దయ హై స్కూల్ , జవహర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులి పురుగుల నిర్మూలన యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన నిర్మూలించేందుకు అల్బెండజోల్ మాత్రలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, వివిఎస్‌టి రాజు, ఎం.ఉమేష్, సత్తి రెడ్డి, నర్సింహ, గణేష్, ప్రశాంత్ , ఏఎన్ఎం అనిత, కృపా సిస్టర్,ఆశా వర్కర్లు దుర్గా,స్వప్నా పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులను అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలి

- టీజీయుఈఈయు-సీఐటీయు జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్
- బేగం బజార్ డివిజన్ నూతన కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-ధూల్‌పేట్

రాష్ట్రంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులందరినీ అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయుఈఈయు-సీఐటీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి గోవర్ధన్ అన్నారు. టీజీయుఈఈయు - సీఐటీయు బేగంబజార్ డివిజన్ లో మంగళ్ హాట్ కార్యాలయం టీఎస్జీ వెట్స్ ఫంక్షన్ హాల్ లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ బాడీలో యూనియన్ కార్మికుల సమస్యలు, కార్యవర్గం పై చర్చించారు. అనంతరం నూతన కమిటీనీ ఎన్నుకున్నారు. ఈ కమిటీలో డివిజన్ అధ్యక్షులు కె. మహేందర్ కుమార్, డివిజన్ కార్యదర్శి ఎం.వి. క్రిష్ణ రెడ్డి, కోశాధికారితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్రంలో సుమారు 23, 667 మంది ఆర్టిజన్ కార్మికులున్నారన్నారు. వారి అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలన్నారు. 5ఏండ్లు పూర్తి చేసుకున్న కార్మికులందరికీ వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సీఐటీ యు సౌత్ జోన్ కార్యదర్శి శ్రావణ్ కుమార్, యం. మున్నిలాల్ నాయక్, ఇ రాజయ్య, బి.కనకయ్య, ఎ.లక్ష్మి నారాయణ, పి.శ్రీనివాస్, యం.రాము, డివిజన్‌లో ముఖ్య నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రప్రభుత్వ' లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్ వీ.మహేందర్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ సద్విని యోగం చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్ వీ.మహేందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప, కూలీ లతో పాటు అందరు అర్హులేనన్నారు. తెల్ల రేషన్ కార్డు తప్పని సరిగా ఉండాలన్నారు. ఏడాదికి రూ 22లు మాత్ర మేనని, 5ఏండ్లకు ఒకేసారి రూ.110లు మాత్రమే చెల్లిం చాలన్నారు. వీరికి 18 నుండి 55 ఏండ్ల ఉన్న స్త్రీ, పురుషులు అర్హులనీ, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరులైన ఇందులో చేరవచ్చునని పేర్కొన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జిరాక్స్ లు జత చేయాలన్నారు.

"ప్రయోజనాలు"..

పాలసీదారు సహజ మరణం పొందితే రూ.లక్ష 30 వేలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.6లక్షల ఇన్సూ రెన్స్ సౌకర్యం కల్పిస్తుంది. ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒకొక్కరికి వివాహ నజరానాగా రూ.30వేలు, ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు ఒక్కో ప్రసవానికి రూ.30వేలు అందిస్తుంది. ఒక ఏడాది పాలసీ పొందిన తరువాత లబ్ధిదారునికి ఏదైన ప్రమాదవ శాత్తు ప్రమాదం జరిగినా 50 శాతం వికలాంగులుగా ఉంటే రూ.2.50 లక్షలు, అదే 100శాతం ఉంటే రూ.5 లక్షల పరిహారం ఉంటుందన్నారు. ఈ అవకాశా న్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ లేబర్ ఇన్సూరెన్స్ ఒకసారి రూ. 110లు చెల్లిస్తే 5 సంవత్సరాలు వరకు చెల్లించనక్కర్లేదు. జిల్లాల వారీగా ఉన్నవారు ఎంపీడీఓ, ఎంఆర్ఓ, జిల్లా కార్యాలయాల్లో సంప్రదించవచ్చున్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి వున్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఏ పని చేసేవారైన ఈ కార్డును పొందవచ్చుని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న పార్టీ సీనియర్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.మహేష్ యాదవ్ టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం కాచిగూడ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కష్టకాలంలో కూడా పార్టీనే నమ్ముకుని పార్టీ కోసమే పనిచేసిన నేతలకు గుర్తింపు కల్పించాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారు లకు అందే విధంగా పార్టీ కార్యకర్తలతో కలిసి సీనియర్ నేతలు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పదవులను సీనియర్లకు ఇస్తే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యే విధంగా చూస్తారని తెలిపారు. పార్టీ సీనియర్లకు గుర్తింపు కల్పించే విధంగా పార్టీ అధి ష్టానం, సీఎం, మంత్రులు అన్ని విధాలుగా ఆలోచించాలని కోరారు.

యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జీహెచ్ఎంసీ మైదానంలో ఇన్స్టిట్యూట్ ఫర్ కల్చరల్ ట్రైనింగ్ ఫౌండేషన్, అంబర్‌పేట మండల గుర్తింపు పొందిన పాఠశాలల అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో విద్యార్థులచే యోగ ఆసనాలు చేయించారు. ఇందులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ బి.పద్మ వెంకటరెడ్డిలు పాల్గొని విద్యార్థులతో పాటు యోగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా భారతదేశపు ప్రాచీన కళ అని, ఎన్నో వందల, వేల సంత్సరాలుగా వస్తుందని చెప్పారు. యోగ మాస్టర్లు, కార్యని ర్వాహకులను, ఇందులో పాల్గొన్న వారిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ మధుసూదన్, రాజశేఖర్ రెడ్డి, మధుసూధన్, శ్రీకాంత్‌రెడ్డి, కెంచె రవికుమార్, నిరంజన్, భాస్కర్ రెడ్డి, శ్రావణ్, రామ్మూర్తి, డాక్టర్ సత్యరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రూప్ పోస్టులు, టీచర్ పోస్టులను పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య
- నిరుద్యోగులతో ధర్నా చౌక్‌లో భారీ ప్రదర్శన



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచి, టీచర్ పోస్టులు 25వేలకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ జేసి చైర్మన్ నీలా వెంకటేష్, నాయకులు అశోక్, అన్వర్ అధ్యక్షతన నిరుద్యోగులతో కలిసి భారీ ప్రదర్శన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం 2 లక్షల ఉద్యోగాల భర్తీకై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. గ్రూప్-1 సర్వీస్ కింద 503 పోస్టులు ప్రకటించారు. కానీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోట పోస్టులు కరెక్టుగా లెక్కిస్తే 1600కు, గ్రూప్-2 సర్వీస్ కింద 783 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. వీటిని కూడా కరెక్టు గా లెక్కిస్తే 2200లకు, గ్రూప్ 3 పోస్టులు 1383 ప్రకటించారు. వాస్తవంగా 3వేలకు పైగా ఉన్నవి, గ్రూప్-4 సర్వీస్ కోటా కింద 8500 పోస్టులు ప్రకటించారు. ఇవి 25 వేలకు పైగా ఉంటాయి. టీచర్ పోస్టులు 11వేలు ప్రకటించారు. పీఆర్‌సీ రిపోర్ట్ ప్రకారం 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా యున్నవని తెలిపారు. ముఖ్యమంత్రి ఒకే దఫా 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఆదేశాలు జారీ చేయడం గొప్ప విషయమని డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోటా క్రింద భర్తీ చేయాల్సిన గ్రూప్-1,2,3,,4 సర్వీస్ ఉద్యోగాలను పూర్తి స్థాయిలో లెక్కించి గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంపలేదని ఎదో నామమాత్రంగా లెక్కించి ప్రతిపాదనలు పంపారన్నారు. ఇప్పటికే అన్ని శాఖలలో అడ్‌హక్ ప్రమోషన్ల పేరుమీద భర్తీ చేశారు. కొందరు ఉన్నతాధికారులు డైరెక్టు రిక్రూట్ మెంట్ లెక్కించడంలో అన్యాయం చేస్తున్నారు. డైరెక్టు రిక్రూట్ మెంట్ కోటా పోస్టులను ప్రమోషన్ల క్రింద భర్తీ చేశారని అన్ని పోస్టులను క్షుణ్ణంగా లెక్కించి భర్తీ చేయాలని కోరారు. ఈ ధర్నాలో జిల్లాపల్లి అంజి, అనంతయ్య, పగిళ్ళ సతీశ్, మోదీ రాందేవ్, హర్షిత, శ్రీనివాస్, కోటేశ్వరి, అనిత, సుకేష్, మిత్రా, నందగోపాల్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేయాలి



- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలను కప్పిపుచ్చే ప్రయత్నం మానుకొని నీట్ అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యానగర్ బీసీ భవన్ లో విద్యార్థి సంఘం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వేముల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష అవకతవకల కారణంగా విద్యార్థులు వైద్య వృత్తిపై విశ్వాసం కోల్పోతున్న 24 లక్షల మంది నీట్ అభ్యర్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలను కప్పిపుచ్చే ప్రయత్నం మానుకొని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నీట్ పరీక్షను వెంటనే రద్దుచేసి సుప్రీంకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయకుండా నీట్ అభ్యర్థులకు న్యాయం చేసి వైద్య వృత్తిపై భరోసా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలలో వైద్య వృత్తికి భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దాని ప్రతిష్టను కాపాడాలని ప్రదానమంత్రి దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకూ ఎంతవరకైనా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గ్రూప్స్ అభ్యర్థులకు బీఆర్ఎస్ మద్దతు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులు ఇందిరా పార్క్ దగ్గర నిర్వహించిన కార్యక్రమానికి బీఆర్ఎస్ నేత ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు నిరుద్యోగులు గుణపాఠం చెబుతారని తెలిపారు. గ్రూప్1కు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. గ్రూప్2, గ్రూప్ 3 పరీక్షల మధ్య 2 నెలల గ్యాప్ ఉండాలన్నారు. జూలై డీఎస్సీ, ఆగస్టు 7,8న గ్రూప్ 2 పరీక్ష ఉందని ఒత్తిడితో సంగీత అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఏడాదిలోగా 2 లక్షలు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. డీఎస్సీ 25 వేల పోస్టులతో నిర్వహించాలన్నారు. కానీ 11 వేల పోస్టులను మాత్రమే ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలపై హరీష్ రావు మాట్లాడితే కాంగ్రెస్ నేతలు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని వాపోయారు. ప్రతిపక్షాలపై ఆరోపణలు, బెదిరింపులకు పాల్పడితే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. తప్పుడు హామీలు, అబద్ధపు ప్రచారంతో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను రోడ్లమీదకు ఈడ్చిందన్నారు. ఏడాది పూర్తి కాకముందే కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హెూదా కల్పించాలి

- ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు



నవతెలంగాణ-ముషీరాబాద్

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హెూదా కల్పించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా వద్దగల మెనోనైట్ బ్రదరన్ బేతేలు చర్చిలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలు కమిటీ చైర్మెన్ డాక్టర్ గిరిధి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఎస్‌సి కార్పోరేషన్ చైర్మెన్ నాగరిగారి ప్రీతం, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్‌సి హెూదా కల్పించాలని సమావేశంలో తీర్మానించారు. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రధాని మోడీ దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు. ఏఐసిఎఫ్ సంస్థ గడచిన 28 సంవత్సరాలుగా దళిత - క్రైస్తవుల సంక్షేమం, అబివృద్ధి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకై పాటుపడుతుందని తెలిపారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురికి అవార్డులతో సన్మానించారు. పాస్టర్ జోయెల్ గుమ్మడి ఆధ్యాత్మిక సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు డేవిడ్ కడారి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిషప్ శామ్యూల్ జాన్, డా. యస్. అబ్రహం, కళ్యాణి చొప్పల, బిషప్ యం. యస్. దయానంద్, జయశ్రీ , పాస్టర్ ప్రవీణ్ కుమార్, గ్రేస్ నిర్మల, మంగేశ్వరి, సోలమన్, నిత్యసుజాత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు కామ్రేడ్ అబ్దుల్ సత్తార్ పితృ వియోగం



నవతెలంగాణ-ధూల్‌పేట్

సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు, అవాజ్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ అబ్దుల్ సత్తార్ పితృయోగం ఆయన తల్లి ఖాదర్ (75) అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం ఉస్మానియా ఆస్పత్రిలో మృతి చెందా రు. ఆమె బ్రతికి ఉన్నంత కాలం తన కొడుకు సత్తార్‌ని కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఆమె మృతి ఆ కుటుంబానికి తీరని లోటని వారి స్వగ్రామమైన కడప జిల్లా సీతంపేటలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ సౌత్ జిల్లా కమిటీ నాయకులు ఆమెకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మారేడుపల్లి తహసీల్దార్, గిర్దవర్, రికార్డు అసిస్టెంట్‌లు సస్పెండ్

- కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-ఓయూ

ఉద్యోగులు జవాబుదారి తనంతో పని చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగులకు చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. గురువారం మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్లక్ష్యం వహిస్తూ సక్రమంగా విధులు నిర్వహించని కారణంగా మారేడుపల్లి తహసీల్దార్ పద్మ సుందరి, గిర్దవర్ పి.ప్రసన్న లక్ష్మి, రికార్డ్ అసిస్టెంట్ ఎస్.రవిలను విధుల నుండి సస్పెండ్ చేశారు. కార్యాలయంలోని అన్ని రకాల రిజిస్టర్లలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ఎవరు ఎక్కడికి వెళ్లారని వాకబు చేశారు. ఇన్వర్డ్ రిజిస్టర్‌ను పరిశీలించి ప్రతి దరఖాస్తును ఇన్వర్డ్ చేసి దరఖాస్తుపై డేట్ స్టాంప్ వేసి సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని ఆదేశించారు. సంబందిత సెక్షన్లు బాధ్యతగా, జవాబుదారితనంగా పనిచేసి దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. విధులు, రికార్డులు సక్రమంగా నిర్వహించని ఉద్యోగులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయ స్థాయి, ప్రజావాణి, ప్రజా దర్బార్, లోకయుక్త, హ్యూమన్ రైట్ కమీషన్, కోర్టు కేసుల రిజిస్టర్ల నిర్వహణతో పాటు నివేదికలను నిర్దేశించిన లక్ష్యం లోగా డిస్పోస్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీల్లో ఆయన వెంట సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్ పాల్గొన్నారు.

బోనాల పండుగకు సీఎంకు ఆహ్వానం



నవతెలంగాణ-ధూల్‌పేట్-చాంద్రాయణగుట్ట

అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డినీ కోరారు. రానున్న ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా సత్కరించి, ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలో ఈ సారి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కన్నుల పండుగ జరిగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్లు పొటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ గౌడ్, ఆలే భాస్కర్ రాజ్ లతోపాటు ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, దినేష్, హన్స్ రాజ్, కైలాస్, వెంకటేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న ప్యాంట్రీ కార్ కోచ్‌లో మంటలు..

- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆగిఉన్న ప్యాంట్రీ కార్ కోచ్‌లో మంటలు చెలరేగాయి. కోచ్ నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. కోచ్ నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. తెలిసిన వివరాల ప్రకారం గురువారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్యాంట్రీ కార్ కోచ్ వాషింగ్ కోసం మెట్టుగూడ వద్ద ఉన్న క్లీనింగ్ పిట్ యార్డుకు వెళ్లాయి. క్లీనింగ్ పూర్తయ్యాక 11 గంటల ప్రాంతంలో బోగీలను తిరిగి స్టేషన్ ప్లాట్ ఫ్లారం లోకి తరలించే క్రమంలో కోచ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు ఆ ప్రాంతమంతా కమ్ముకున్నాయి. ఒక్కసారిగా బోగీల నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు రైల్వే అధికారులకు, ఫైర్ స్టేషన్కు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన రైల్వే అధికారులు ఒక వైపు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇస్తూనే మరో వైపు స్టేషన్‌లో మంటలు ఆర్పే యంత్రాలతో తగలబడుతున్న బోగీలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అంటుకున్న బోగీలోని మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా రైల్వే సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్న సమయంలోనే ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు మంటలు అదుపులోకి తెచ్చాయి. రైలు బోగీలలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు బోగీలు దగ్దం అయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్యాంట్రి కార్ కోచ్ కావడం వల్ల అందులో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా బోగీలలో అగ్ని ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఘటన స్థలాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ సందర్శించారు.

ఖైరతాబాద్ డీసీసీ జనరల్ సెక్రటరీ, మంగళహాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్ లోధ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్ రెడ్డి నివాసంలో మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సిఎన్ రెడ్డి, ఇతరులతో కలిసి బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించారు.

నవతెలంగాణ-ధూల్ పేట్



బి ఫార్మసీ ప్రారంభించడం పేద విద్యార్థులకు లాభం

- జేఎన్‌టీయూ హెచ్ ఫార్మసీ విద్యార్థులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూ లాంటి ఉన్నతమైన విశ్వవిద్యాలయంలో బి ఫార్మసీ ప్రారంభించడంతో చాలా మంది పేద, విద్యార్థులు లాభపడుతారని జేఎన్‌టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఫార్మసీ విద్యార్థులు అన్నారు. విద్యార్థుల విన్నపం మేరకు బీ ఫార్మసీ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి అనుమతి ఇచ్చిన ఇన్‌చార్జి ఉప కులపతి బుర్ర వెంకటేశంకి, ఇందుకు సహకరించిన యూనివర్సిటీ రెక్టర్, రిజిస్ట్రార్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ కూకట్‌పల్లి క్యాంపస్‌లో నూతనంగా ఫార్మసీ విభాగంలో 2007 వ సంవత్సరం నుంచి ఎం ఫార్మసీ కోర్సులో వివిధ స్పెషైలైజేషన్స్‌లో అద్భుతమైన విజయాలు సాధించిన ఘనత ఈ ఫార్మసీ విభాగమన్నారు. మంచి ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్ నగరంలోనే పుష్కలంగా లభిస్తాయి అని విద్యార్థులు అభిప్రాయ పడ్డారన్నారు.



బాలానగర్ డివిజన్ పరిధిలోని స్థానిక అసోసియేషన్లు ప్రజా సమస్యల పరిష్కారం ఇంద్రానగర్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అధ్యక్షుడిగా పుట్టపాక మధు గెలిచారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుగౌడ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు పుట్టపాక మధుతో పాటు అసోసియేషన్ సభ్యులు గురువారం బండి రమేష్‌ను బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రమేష్ వారిని అభినందిస్తూ.. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

నవతెలంగాణ-బాలానగర్

నీట్ పై న్యాయ విచారణ జరిపించాలి



- సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య


నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నీట్‌పై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) మంగల కమిటీ సభ్యులు పసుల అంజయ్య అన్నారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించి, విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య కే. బీరప్ప పాల్గొని మాట్లాడుతూ.. ప్రధాన మోడీ పాలనలో నీట్ వంటి ప్రవేశ పరీక్షలలో అవకతవకలు, లీకేజీలు సర్వసాధారణంగా మారాయని వారు మండిపడ్డారు. కేంద్రం తీరుతో విద్యార్థుల జీవితాలు గందరగోళంగా మారాయన్నారు. బీహార్, గుజరాత్లలో ప్రశ్నాపత్రాలు లీక్ చేశారని ఆరోపించారు. నీట్ పరీక్షలు రాసిన విద్యార్థుల కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఎక్కువమంది నీట్ పరీక్షా రాశారన్నారు. లీకేజీలపై న్యాయ విచారణకు కేంద్రం ఆదేశించాలని విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు జి.వెంకన్న, సీపీఐ(ఎం) నాయకులు స్వాతి, ఈ దేవదానం, కే.శీను, మల్లారెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో శ్రీ సాయి విద్యానికేతన్ విద్యార్థులు ప్రభంజనం



- విద్యార్థులను భావితరాల మేధావులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయం
- కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

(2023-24 విద్యా సంవత్సరం) పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచి అథరహో అనిపించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికే తలమానికంగా నిలిచామని పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు అన్నారు.ఈ మేరకు గురువారం నవతెలంగాణతో మాట్లాడారు .కృషితో నాస్తి దుర్భిక్షం అన్న నానుడిని సార్ధకత చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలతో దినదిన ప్రవర్ధమానంగా పాఠశాల ఎదుగుతుం దన్నారు. తమ పాఠశాల క్రమశిక్షణకు, ఉన్నతమైన చదువుకు మారుపేరుగా గత కొన్నేండ్ల నుంచి కుత్బుల్లాపూర్ నియోజక వర్గంతో పాటు జగద్గిరిగుట్ట, గాజులరామారం డివిజన్లోని పరిసర ప్రాంతంలోనే ప్రత్యేకత గుర్తింపు పొందిందన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ భగత్ సింగ్ మార్గ్,(మగ్దుమ్ నగర్)ప్రాంతంలో శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ఏర్పాటుచేసి దశాబ్దాల కాలంగా అపార అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా విద్యా బుద్ధులు నేర్పుతూ... వారి ఉజ్వల భవిత పునాదులు వేస్తున్నామన్నారు. ఎంతోమంది తమ పాఠశాలలో విద్యార్థులు విదేశాలతో పాటు, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డార న్నారు. చదువు విషయంలో ఎక్కడ రాజీ పడకుండా తమ పాఠశాల పరిసర ప్రాంతాలు (స్లమ్స్ ప్రాంతం) అత్యధికంగా కూలీలు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పేద ప్రజలు ఎక్కువగా స్థిరపడ్డారని తెలిపారు.తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి సంవత్సరం కార్పొరేట్ స్థాయి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. పాఠశాలనే దేవాలయంగా భావిస్తూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతిలో సాధారణ విద్యార్థులచే అసాధారణ ఫలితాలతో ప్రభంజనం సృష్టిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పదో తరగతిలో జీపీఏ.10.(3)డి. జాహ్నవి, టి.శ్రీవాణి.డి.అక్షయ, విద్యార్థులు సాధించారని, జీపీఏ.9.7(4) మంది విద్యార్థులు, జీపీఏ.9.5(3)విద్యార్థులు, జీపీఏ 9.3 (1)విద్యార్థులు, జీపీఏ 9.0(4) విద్యార్థులు,8.8(4) విద్యార్థులు 8.7(4) విద్యార్థులు 98.5(శాతం) ఉత్తీర్ణతతో విజయ విహారం చేశారన్నారు. విద్యార్థుల లోని మేధస్సు పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు తోపాటు ఎస్.ఏ.రైటింగ్ నిర్వహిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నామన్నారు. తమ విద్యార్థులు ఎస్.ఏ.రైటింగ్‌లో మండల,జిల్లా స్థాయి ప్రతిభ కనబరిచారని తెలిపారు. అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పలు అంశాలపై వాటికి సంబంధించిన ప్రత్యేక ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి బోధించడం జరుగుతుందన్నారు. తమ పాఠశాలలో ప్రతీ పండుగ విశిష్టత తెలియజేసేలా వాటికి సంబంధించిన కార్యక్రమాలను విద్యార్థులచే నిర్వహిస్తూ ఉత్తేజపరుస్తున్నామన్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా విద్యాసేవలో నిమగ్నమై విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు.

సువిశాలమైన గదులు.ఆహ్లాద వాతావరణం చక్కని క్రీడా మైదానం....పాఠశాల ప్రత్యేకత..

విద్యార్థులకు విద్యతోపాటు పలు క్రీడల్లో శిక్షణ ఇచ్చే విధంగా పాఠశాల ప్రాంగణంలో సువిశాలమైన క్రీడమైదానం,ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశామన్నారు. నర్సరీ నుంచి పదవ తరగతి చదువుతున్న ప్రతీ విద్యార్థులు సెక్షన్లలో పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పాఠశాల ప్రాంగణంలో చెట్లు పెంచామన్నారు. వీటితో పాటు విద్యార్థులు పుస్తకాలకు పరిమితం కాకుండా మేధస్సు పెంపొందించేందుకు సాలార్జంగ్ మ్యూజియం, బిర్లా ప్లానిటోరియం, జూ పార్క్, ఓసియన్ పార్క్ వంటి విహారయాత్రలకు తీసుకెళ్తూ వారిలో ఉల్లాసాన్ని నింపుతున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పలు వినతులు, ఆహ్వానాలు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కాలనీ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి : ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 131 కుత్బుల్లాపూర్ డివిజన్‌కు చెందిన వెంకటేశ్వర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి కాలనీలో చేపట్టవలసిన భూగర్భ డ్రయినేజీ, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి కాలనీలో త్వరలోనే భూగర్భ డ్రయినేజీ, వీధి దీపాల ఏర్పాటు పనులను చేపడతామని తలిపారు. గత పదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధిని కొనసాగిస్తూ రానున్న రోజుల్లో కాలనీలో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మధుకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్, కోశాధికారి జ్ఞానేశ్వర్ గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యమే మహాభాగ్యము



- కార్పొరేటర్ కొలుకుల జగన్
- విద్యార్థులకు నులిపురుగుల మందుల పంపిణీ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆ దిశగా విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.ఈ మేరకు గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్‌లో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 'ఆల్బెండజోల్ మందును పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు విద్యతోపాటు, ఆరోగ్యం కాపాడుకోవడానికి వైద్యశాఖ అధికారులు చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు.పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి మల్లారెడ్డి, నర్సింగ్ గౌడ్, విటల్ ముదిరాజ్, నరసయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తలిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలి..

బాలానగర్: తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం బాలానగర్ మండల ప్రాథమిక పాఠశాలలో బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసిన కార్యక్రమాని కార్పొరేటర్ విచ్చేసి ఆరోగ్య అధికారిణి డాక్టర్ మమతతో కలిసి విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్బెండ జోల్ మాత్రలను స్వయంగా వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు నులిపురుగులు ఉన్న పిల్లలకు పౌష్టికహార లోపం అలాగే రక్తహీనతలతో ఎల్లప్పుడూ అలసటగా ఉంటారన్నారు. అదేవిధంగా శారీరక, మానసిక అభివృద్ధిలో మందబుద్ధిగా ఉంటారని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రను వేసినచో పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సుధాకర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఓ.డాక్టర్ మమత, డాక్టర్ రాజలక్ష్మి, జీహెచ్ఓ మన్మథమ్మ, పీహెచ్ఎన్ రాములమ్మ, ఏఎన్ఎం రోహిణి, ఇందిర, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



- కార్పొరేటర్ రావుల శేషగిరి
- అక్షరాభ్యాస్ పాఠశాల ప్రారంభం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల దేనని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. ఈ మేరకు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి శ్రీరామ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన "అక్షరాభ్యాస్ పాఠశాల"ను విశ్రాంత మండల విద్యాధికారి ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన దినందించినప్పుడే పాఠశాలలు మనగడ సాధిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాయి నేత, నాయకులు నవాబ్, సింగారం మల్లేష్, మురళీకృష్ణ, ఇబ్రహీం, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతంగా చేయాలి



- డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వ.శంకరయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు వేగవంతంగా చేయాలని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, ఆదర్శనగర్ హౌసింగ్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఏర్వ.శంకరయ్య కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ కాలనీలోని పలు వీధుల్లో జరుగుతున్న భూగర్భ డ్రయినేజీ మరమ్మత్తుల పనులను సొసైటీ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఎటువంటి డ్రయినేజీ సమస్యలు తలెత్తకుండా పనులు చేయాలని సిబ్బందికి తెలిపారు. కాలనీ ప్రజల సహాయ సహకారాలతో ఆదర్శ నగర్ ప్రాంతాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు నాగభూషణం, నారాయణ గౌడ్ జె.శ్రీనివాస్ కాలని వాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో ఐటీఐలకు పునర్వవైభవం



- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీ భవన్‌లో సాంకేతిక నైపుణ్యాల కోసం ఐటిఐలను, ఏటిసిలుగా మార్చడానికి రూ. 2వేల 3 వందల కోట్ల రూపాయలు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, కాల్వ సుజాత గుప్తా మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడు హైదరాబాద్‌కు ఏజిల్లా నుంచి ఎవరు వచ్చినా ఐటీఐ సర్టిఫికెట్ ఉంటే ఏ కంపెనీలో ఏదో ఉద్యోగం దొరికేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రభుత్వ ఐటీఐలు నిరుపయోగంగా మారాయని, ఐటీఐల్లో నేర్పించే నైపుణ్యాలు విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోయాయన్నారు. హైదరాబాద్ నగరాన్ని సాంకేతిక, పారిశ్రామిక నగరంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఇప్పుడు చాలా రోజుల తరువాత మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్ళీ ఐటీఐలకి పునర్వ వైభవం తీసుకురావాలని ప్రియతమ ముఖ్యమంత్రి ధృఢ సంకల్పంతో రెండు వేల మూడు వందల మూడు వందల కోట్ల రూపాయలు కేటాయించి భవిష్యత్ తరాలకి, విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వాలని మంచి నిర్ణయం తీసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. హరీష్ రావు తప్పులు మాట్లాడుతున్నారని, చంద్రబాబుని చూసి నేర్చుకోండని హరీష్ రావు మాట్లాడే మాటలకి కొంచమైనా విజ్ఞత ఉందా అని ప్రశ్నించారు. పది సంవత్సరాలు మంత్రిగా ఉండి రాష్ట్రాన్ని ఆరు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిన హరీష్ రావు, కేసీఆర్ ఘనత అన్నారు. కేసీఆర్ రూ.లు, 3, 4 రూపాయల లోపు వచ్చే విద్యుత్ రూ.6 రూపాయల పెట్టి కొని, ఎనభైతొమ్మిది వేల కోట్ల రూపాయల నాశనం చేసారని, డిస్కంల అన్నింటిని అప్పుల పాలు చేసారని అన్నారు. కేసీఆర్ తప్పు చేయకపోతే ఎటువంటి అవినీతికి పాలుపడకపోతే నిజాయితీగా చేసి ఉంటే మీకు న్యాయవ్యవస్థ మీద ఏ మాత్రం నమ్మకం ఉన్నా జస్టిస్ నర్సింహా రెడ్డి కమిషన్ ముందు హాజరు కావాలని సత్యం శ్రీరంగం డిమాండ్ చేసారు.

మాధవరం సుదర్శన్ రావు జయంతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

దివంగత మాధవరం సుదర్శన్ రావు కార్మిక పక్షపాతి అని, కార్మిక లోకానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ కొనియాడారు. దివంగత నేత సుదర్శన్ రావు 66వ జయంతిని పురస్కరించుకొని, మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్ లో కార్మికులు ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి బండి రమేష్, కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సుదర్శన్ రావు నిత్యం కార్మికులకు, పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమించిన గొప్ప మానవతావాది అన్నారు. ఈ సందర్భంగా కార్మికుల నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



సుదర్శన్ రావు అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారు వద్దేపల్లి రాజేశ్వర్ రావు అన్నారు. పేదల పెన్నిధి, బడుగుల ఆశాజ్యోతి, తెలంగాణ ఉద్యమకారుడు కీర్తి శే " మాధవరం సుదర్శన్ రావు జయంతి సందర్భంగా, మూసాపేట్ గుడ్స్ షెడ్ రోడ్‌లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో సుదర్శన్ రావు విగ్రహానికి వద్దేపల్లి, పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు.



తమ పరిసరాలలో నీరు నిలువ ఉండకుండ చూసుకోవాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్ అంబేద్కర్ నగర్ ముళ్ళకత్వ చెరువులో జి.హెచ్.ఎం.సి ఎంటోమోలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చెరువులో లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంటోమోలజి సిబ్బంది నగేష్, మహేందర్ రెడ్డి, దామోదర్, ఎస్.జి.ఓ రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

నీట్ పరీక్షను రద్దు చేయాలి



నవతెలంగాణ-బాలానగర్

నీట్‌ను రద్దు చేసి సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి సీపీఐ(ఎం) డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణ ఫలితాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో గురువారం శ్రీశ్రీ నగర్ సీపీఐ(ఎం) కార్యాలయంలో జరిగన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలానగర్, కూకట్‌పల్లి జంట మండలాల కార్యదర్శులు ఐలాపురం రాజశేఖర్, ఎం.శంకర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలో (నేషనల్ టెస్టింగ్ సెంటర్) అవకతోవకలు జరిగాయని, పరీక్షలను రద్దు చేసి సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలన్నారు. ఈ నేపథ్యంలో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు కష్టపడి పరిక్ష రాయాలని చూస్తే పరీక్ష పత్రాలను రూ. 30లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అమ్ముకుని విద్యావ్యవస్థ నీరు గార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రభుత్వం వెంటనే స్పందించి, భాద్యులపై చర్యలు తీసుకుని, పేపర్ లీకేజీకి ప్రధాన మంత్రి బాధ్యవ వహించి, సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్, తాజ్, రాము, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీకి ఓయూ ఉద్యోగుల సత్కారం



నవతెలంగాణ-ఓయూ

టీఎన్‌జీఓఎస్ సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీమారేం జగదీశ్వర్ , ముజీబ్ హుస్సేన్‌లను గురువారం ఓయూ బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కలిసి సన్మానించారు. యూనివర్సిటీలో ఉన్న ఉద్యోగుల సమస్యల సాధన కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, శంకరయ్య భీమయ్య, అశోక్, భూమరావు, శంకర్ నాయక్, రాకేష్ ఎంప్లాయిస్ నాయకులు అక్బర్ బేగ్, రాజేష్, మల్లేష్, మెహతాబ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్టు తెలంగాణ అధ్యక్షుడు డా.ఎ. పరశురాం కోరారు. గురువారం డా.పరశురాం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డిని ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని యూజీసీ 7వ పీఆర్సీ ఇవ్వాలని, బేసిక్ పే, డీఏ, హెచ్‌ఆర్ఏ అమలు చేయాలని పరశురాం సీఎంను కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ 25 లక్షలు ఇవ్వాలని, పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల కు పెంచాలని కోరారు. సీఎం స్పందించి త్వరలోనే ఈ సమస్యలు పరిష్కరించటానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ డా.బాలకోటి ,ఆర్గనైజింగ్ సెకరేటరి టి.శ్రీశైలం , కార్యవర్గ సభ్యులు డా.అంబటి.శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలి

- ఓయులో ఎస్ఎఫ్ఐ నిరసన వ్యక్తం



నవతెలంగాణ-ఓయూ:

ఎన్టీఏ సంస్థని తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. వరుస పరీక్షల అవకతవకలుపై ఎన్టీఏ అధికారులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలని విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్. మూర్తి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో విద్యారంగంలో పోటీ, ప్రవేశ పరీక్షలను నిర్వహించడంలో విద్యా మంత్రిత్వశాఖ యొక్క అత్యంత బాధ్యతా రాహిత్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎన్టీఏ సంస్థ ప్రారంభం నుండి మొత్తం విద్యా వ్యవస్థను అపహాస్యం చేస్తుందన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ పూర్తిగా అసమర్థంగా ఉందన్నారు. నీట్‌లో పేపర్ లీక్ తాజాగా యూజీసీ నెట్ - 2024 పరీక్ష సమగ్రంగా నిర్వహించడంలో విఫలమైదన్నారు. ఎన్టీఏ బాధ్యత రహిత్యానికి, యూజీసీ నెట్ పరీక్షను రద్దు పారదర్శకత్వానికి నిదర్శనమన్నారు. మోడీ ప్రభుత్వం లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవి నాయక్ మాట్లాడుతూ.. ఎన్‌టిఏ సంస్థ యుజీసీ నెట్ పరీక్షను ప్రతి సంవత్సరం కంప్యూటర్ బెస్ట్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు తో ఆటలాడుతున్న ఎన్టీఏ సంస్థను రద్దు చేయాలని అలానే కంప్యూటర్ బెస్ట్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు మల్సూర్, హుస్సేన్, కృష్ణ, నాయకులు రమాటేంకి శ్రీను అరవింద్, పవన్, రాజకుమార్ శ్రీనాథ్ విద్యార్థులు భవాని, నిర్మల, రమ్య ముక్తి సౌజన్య పాల్గొన్నారు.

పలు హెూటళ్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- సికింద్రాబాద్‌ని హెూటళ్లు, బార్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు..
- ఆల్ఫాహెూటల్‌కు రూ.లక్ష జరిమానా



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్‌లోని పలు హెూటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని ఆల్ఫా హెూటల్, రాజ్ బార్ అండ్ రెస్టారెంట్, సందర్శిని హెూటళ్లలో తనిఖీలు నిర్వహించిన అధికారులకు చాలా రోజులుగా ఫ్రిడ్జ్‌లో స్టోర్ చేసి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మటన్, చికెన్, అపరిశుభ్రంగా ఉన్న వంట గదులు, మురుగు నీరుతో కంపు కొడుతున్న పరిసరాలను గుర్తించి ఆయా హెూటళ్లపై కేసులు నమోదు చేశారు. అపరిశుభ్రతతో పాటు నిబంధనలకు విరుద్ధంగా హెూటల్ నిర్వహిస్తున్న ఆల్ఫా హెూటల్‌పై కేసు నమోదు చేశారు. ఆల్ఫా హెూటల్, సందర్శిని, రాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌లలో నాసిరకం వస్తువులతో పాటు దుర్గంధంగా ఉన్న వంటశాలలను గుర్తించారు. సికింద్రాబాద్ ఆల్ఫా హెూటల్ లో టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేయగా పాడైపోయిన మటన్ తో బిర్యాని తయారు చేసినట్లు గుర్తించారు. హెూటల్లో ఎలుకలు తిరుగుతూ ఉండడం, దుమ్ము ధూళితో అపరిశుభ్ర వాతావరణం కలిగి ఉందని పేర్కొన్నారు. ఆల్ఫా హెూటల్ లో తయారు చేసే బ్రెడ్ తో పాటు ఐస్ క్రీమ్ డేట్ బ్యాచ్ లేకుండా ఉన్న ఆహార పదార్థాలను సీజ్ చేశారు. సందర్శిని హెూటల్, రాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో తనిఖీలు చేసిన అధికారులు అపరిశుభ్రంగా ఉన్న కిచెన్, వంటకాలను గుర్తించి ఈ రెండు హెూటళ్ల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.

ఆల్ఫా హెూటల్‌కు రూ.లక్ష జరిమానా

నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, కుళ్లిపోయిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న ఆల్ఫా హెూటల్‌కు ఆహార భద్రత టాస్క్‌ఫోర్స్ అధికారులు లక్ష రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆహార భద్రత టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ హెూటల్లో అపరిశుభ్రతతో పాటు సరైన ఆహార భద్రత ప్రమాణాలు పాటించడం లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెస్టారెంట్లు, హెూటళ్లపై చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

గతంలో సీజ్ చేసినా తీరుమారని ఆల్ఫాహెూటల్ ..

నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వినియోగదారులకు కుళ్లిన ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్న ఆల్ఫా హెూటల్ పై గతేడాది జీహెచ్ఎంసీ అధికారులు దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తూనే వస్తున్నారు. అయినా హెూటల్ యాజమాన్యం తీరుమారడం లేదు. గతేడాది ఓ వ్యక్తి ఆల్ఫా హెూటల్‌లో బిర్యాణి పర్సిల్ తీసుకోని ఇంటికి వెళ్లి తిని అస్వస్థత కు గురయ్యారు. దీంతో బాధితుడు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు తనిఖీలు చేపట్టి కుళ్లిపోయినస్థితిలో ఉన్న మటన్, చికెన్, రెండు, మూడు రోజులక్రితం వండి మిగిలిపోగ తిరిగి కస్టమర్లకు సప్లై చేసేందుకు ఫ్రిడ్జ్‌లో పెట్టిన బిర్యాణిని గుర్తించిన అధికారులు అప్పట్లో హెూటల్‌కు భారీ మొత్తంలో జరిమానా విధించి సీజ్ చేశారు. ఈ హెూటల్‌ను సీజ్ చేసిన వారం రోజులకే తిరిగి ప్రారంభించిన యాజమాన్యం దిద్దుబాటు చర్యలకు పోకుండా తిరిగి పాత పద్ధతిలోనే తమ కార్యకలాపాలు సాగిస్తూ వస్తున్నారు. పట్టుబడిన ప్రతిసారి జరిమానాలు కట్టి తిరిగి తమ వ్యాపాలను యదావిధిగా కొనసాగిస్తూ పాడైన ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ సమస్యలకు శాశ్వతమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తూతూమంత్రంగా జరిమానాలు వేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం పర్యవేక్షణ లోపం వల్లనే ఈ హెూటళ్ల ఆటలు సాగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు తగువిధంగా స్పందించి పాడైన ఆహారపదార్థాలు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఆల్ఫా హెూటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. శుభ్రత పాటించకుండా, పాడైన ఆహార పదార్థాలను విక్రయించే హెూటళ్లు, రెస్టారెంట్లపై దాడులు నిర్వహించి వాటిని కనీసం ఏడాది పాటు సీజ్ చేయాలని, వారిలో మార్పు వస్తుందని చెపుతున్నారు.

తలసాని శంకర్ యాదవ్‌కు ఘన నివాళి





నవతెలంగాణ-బేగంపేట్

మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్‌కు పలువురు ఘన నివాళులర్పించారు. తలసాని శంకర్ యాదవ్ ఈ నెల 10న మరణించగా గురువారం సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో కుటుంబ సభ్యులు దశదిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎగ్గే మల్లేశం, బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, సుధీర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, మాజీ ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, వినోద్ రావు, దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, బొల్లం మల్లయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, మాజీ కార్పొరేషన్ చైర్మెన్‌లు సోమా భరత్ కుమార్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజీవ్ సాగర్, పల్లె రవి కుమార్, కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి నివేదిత, యాదవ సంఘాల నాయకులు రాజారామ్ యాదవ్, గోవర్ధన్ యాదవ్, అరిగెల నాగేశ్వర్ యాదవ్, పలువురు కార్పొరేటర్ లు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

నివాళులర్పించిన మంత్రులు

మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ కు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజ్ ఠాకూర్, హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహన్ రెడ్డిలు నివాళులర్పించారు. సికింద్రాబాద్ లోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన శంకర్ యాదవ్ దశదిన కర్మ కార్యక్రమా నికి హాజరయ్యారు. అనంతరం వారు శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళ్ళర్పించి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

ఓయూలో ఘనంగా భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలు



- మొక్కలు నాటిన సీబీఎన్ ఫ్యాన్స్..

నవతెలంగాణ-ఓయూ

ఆపద సమయంలో కృంగిపోకుండా కుటుంబానికి, పార్టీకి, నేతలకు, కార్యకర్తలకు, ప్రజలకు అండగా నిలిచిన గొప్ప ధీర వనిత నారా భువనేశ్వరి అని సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ సీబీఎన్ అధ్యక్షుడు, ఓయూ పరిశోధన విద్యార్థి తలారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి పుట్టిన రోజు వేడుకలు సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్, స్కూల్ ఆఫ్ సీబీఎన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఎదుట కేక్ కట్ చేసి అనంతరం మొక్కలు నాటారు. ఎన్టీఆర్ కుమార్తెగా క్రమశిక్షణ కలిగిన మహిళగా ఇక చంద్రబాబు నాయుడు సతీమణిగా గొప్ప పరిపాలన దక్షతతో పాటుగా తండ్రి భర్త స్ఫూర్తితో విద్యా, వైద్య,ఆరోగ్య రంగాల్లో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న వ్యక్తి అన్నారు. గత జగన్ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు అకారణంగా 53 రోజులు జైల్‌లో ఉంచితే ప్రజల కార్యకర్తలకు నేతలకు ధైర్యం, భరోసా కల్పించి తన సత్తా చాటుకున్న ఈ తరం మహిళ అన్నారు. ఇటు నందమూరి కుటుంబ అటు మెట్టినింటి ప్రతిష్టాత్మను పెంపొందించి వారు భువనేశ్వరి అన్నారు. ఈకార్యక్రమంలో సతీష్ గౌడ్ , సప్పిడి గోపయ్య , బాబులాల్ మహాజన్, శంకర్ శివ , శంకర్ గౌడ్, సందీప్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, స్వాతి , సరస్వతి , మనిషా ,విద్యార్థులు ఫ్యాన్స్ పాల్గొన్నారు.

నులిపురుగులను నివారించాలి





నవతెలంగాణ-ఓయూ

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరిష్ డివిజన్లోని వెంకటరెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాల, గాంధీ గిరిజన బస్తీ కమ్యూనిటీ హాల్‌లో పిల్లలకు గురువారం మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. ఆరోగ్యవంతమైన పిల్లలకోసం అల్బెండజోల్ టాబ్లెట్ వేయించండి, పిల్లలకు నులిపురుగులు రాకుండా సులభంగా నివారించండన్నారు 1-19 సం.ల వయస్సు ఉన్న పిల్లలందరికీ అల్బెండజోల్ టాబ్లెట్ ను కళాశాలలు, పాఠశాలలు మరియు అంగన్ వాడీ కేంద్రాల వద్ద ఉచితంగా ఇవ్వబడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల,ప్రదానోపాద్యులు సత్యారెడ్డి, సిస్టర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్ స్వాతి ,ఆశా, బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, జిల్లా శ్రీనివాస్, పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవంలో డిప్యూటీ మేయర్

గురువారం జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా తార్నాక డివిజన్ లోని లాలాపేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు ఆల్బెండజోల్ మాత్రలను జీహెచ్ఎంస్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి విద్యార్థులకు ఇచ్చారు. ఈ సందర్భంగా 1-19 సంవత్సరాల పిల్లల్లో నులిపురుగు నివారణకై ఈ ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల పిల్లలకు రక్తహీనత తగ్గడానికి, మెరుగైన పోషణ, మానసిక, శారీరక అభివృద్ధికి ప్రయోజనం చేకూరుతుందని తద్వారా విద్యార్థులు చదువు, క్రీడాల్లోనూ మంచి ఫలితాలు సాధిస్తారని డిప్యూటీ మేయర్ అన్నారు. ప్రతీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఈ ఆల్బెండజోల్ మాత్రలు అందేలా, వారు వేసుకునేలాగా ప్రోత్సహించి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వం బయ్యారంలో ఉక్కు కర్మాగారం నిర్మించి తీరాల్సిందే..



నవతెలంగాణ-ఓయూ

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో షెడ్యూల్డ్ 13లో ఉన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనను కుంటి సాకులు చెప్పి తప్పించుకోవాలని చూస్తే బీజేపీ ప్రభుత్వానికి తగిన శాస్తి తప్పదని పండేళ్ల బీజేపీ పాలనలో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వేరే రాష్ట్రానికి తరలించి తెలంగాణకు ద్రోహం చేసిన మోడీ ప్రభుత్వం కనీసం ఈసారైనా బయ్యారం లో ఉక్కు కర్మాగారం స్థాపించి తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నేరవేర్చాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ, తెలంగాణ రక్షణ వేదిక చైర్మెన్ కోటూరి మానవతారాయ్ అన్నారు. బయ్యారంలో నాణ్యమైన ఉక్కు లేదన్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని, బొగ్గు గనుల శాఖ మంత్రిగా తనకు వచ్చిన అవకాశాన్ని కిషన్ రెడ్డి సద్వినియోగం చేసుకొని బయ్యారంలో ఉక్కు కర్మాగారం నిర్మించేలా తక్షణమే చర్యలు చేపట్టి తెలంగాణ ఉద్యమ ఆకాంక్షను నేరవేర్చాలన్నారు. తెలంగాణ యువత బయ్యారం ఉక్కు కర్మాగార సాధనకి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చిన కోటూరి మానవతారాయ్ సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు లేఖలిచ్చి బయ్యారం ఉక్కు కర్మాగార సాధన పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల దృష్టికి తీసుకువెళ్లి ఢిల్లీ స్థాయిలో బయ్యారం ఉక్కు కర్మాగారం సాధన కోసం ఉద్యమం చేయనున్నట్లు రాయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ చేసిన నాయకులు ఇంటి బానోత్ ప్రవీణ్ నాయక్, మణికంఠ, గణేష్, తరుణ్, షాబుద్దీన్, షకీలేష్, సంతోష్, రషీద్, బాలాజీ, రవీందర్, అంజన్, హేమంత్ చౌదరి పాల్గొన్నారు.

ఎన్టీఏ, నీట్, నెట్ అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ సమన్వయంలో ఎన్టీఏ నీట్, నెట్ అక్రమార్కులపై చర్యలు తీసుకొని, విద్యార్థులకు భరోసానివ్వాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఓయూలో భారీ ర్యాలీ నిర్వహించారు. జాతీయస్థాయి అర్హత పరీక్షలు నిర్వహించే(ఎన్టీఏ) నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, సంస్థ యొక్క గుర్తింపుని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ విద్యార్థుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నెట్, నీట్‌లో అక్రమాలు జరిగాయని తెలిసిన, సంబంధిత అధికారులు చోద్యం చూస్తూ పర్యవేక్షణలో నిర్లక్ష్య పూరితమైన వైఖరి అవలంభిస్తూ లక్షలాదిమంది విద్యార్థుల జీవితాల ఉన్నత విద్యార్హత అవకాశాలను అక్రమార్కులకు కట్టబెడతూ విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం చేస్తు వారి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పైన క్రిమినల్ చర్య క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏజెన్సీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గ్యారనరేష్, పీడీఎస్‌యు జాతీయ నాయకులు ఎస్. నాగేశ్వరరావు, బహుజన విద్యార్థి నాయకుడు పులిగంటి వేణుగోపాల్, డీబీసీఏ స్టేట్ కోఆర్డినేటర్ జంగ్లి దర్శన్ , ఓయూ జేఏసీ అధికార ప్రతినిధి బోనాల నగేష్, పీడీఎస్‌యూ నాయకుడు అల్లూరి విజయ్, ఓయూ లెఫ్ట్ సంఘాల అధ్యక్షులు రవి నాయక్, నెల్లిసత్య సుమంత్ విద్యార్థి నాయకులు దూడపాక సురేష్ , మామిడాల రవికుమార్, పార్థు, కుమార్, అభిలాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

జూలై 15న సెక్రటేరియట్ ముట్టడిస్తాం



నవతెలంగాణ-బంజారాహిల్స్

సబండ వర్గాలకు న్యాయం చేయాలని బీసీల కులగణన రిజర్వేషన్ అమలు ప్రక్రియను ఎందుకు కాలయాపన చేస్తున్నారో తెలపాలని బీసీ కుల సంఘాల, బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించి వారితో ఎన్నికలు నిర్వహించే విధంగా తీర్పు అమలు చేసుకొని తప్పని పరిస్థితుల్లో ఎన్నికల్లో వెళ్లాలనే కుట్ర చేస్తున్నారని అసలు సూత్రధారి సీఎం రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు. జూలై 15 తమ హక్కుల కోసం సచివాలయం ముట్టడిస్తామని ప్రకటించారు. 15న తలపెట్టిన చలో సెక్రటేరి యట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రముఖ న్యాయవాది, బీసీ సంఘం మహిళా నాయకురాలు శారదా గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హిం దూ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర యాద వ్, ఓయూ జేఏసీ నాయకులు దత్తాత్రేయ, టి.జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల క్రిష్ణ, అడ్వొకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, ముదిరాజ్ సంఘం నాయకు లు రాజు ముదిరాజ్, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల వీరన్న, బీసీ కుల సంఘాల ఐక్య వేదిక అధికార ప్రతినిధి మహేష్ గౌడ్, ఓయూ విద్యార్థి నాయకుడు లింగం శాలివాహన, హిందు బీసీ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొంగర నరహరి, పద్మశాలి సంఘం నాయకులు అశోక్ పోశం తదితరులు పాల్గొన్నారు.

జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎమ్మార్పీఎస్ ఉద్యమం ముప్పై ఏండ్ల ప్రస్థానానికి చేరుతున్న సందర్భంగా మాదిగలు వారి మద్దతు దారులు జులై 27న వరంగల్‌లో జరిగే ఆత్మగౌరవ కవాతుకు హాజరై జయప్రదం చేయాలని సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకులు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఒకటి నుంచి రెండు శాతం ఓట్లు, సీట్లు తగ్గిన పెరిగిన దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం ఎమ్మార్పీఎస్ మద్దతు వల్లే బీజేపీ పార్టీకి అసెంబ్లీలో కేవలం 14 శాతం ఓటు శాతాన్ని 21 శాతానికి పెరిగిందనీ దానికి ముఖ్య కారణం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ ఓటు బ్యాంక్ పెరగడానికి పరోక్షంగా సహకరించింది ఆయనేన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం కీలకంగా ఉన్న సందర్భంలో పార్లమెంట్‌లో మాదిగ ఎంపీ లేకుండా చేసి మాదిగలను, బీసీలను కాంగ్రెస్ దూరం చేసుకుందని విమర్శించారు. ప్రధాని మోడీపై సంపూర్ణ విశ్వాసంతో ఉన్నామని అందుకే మద్దతు ప్రకటించి గెలిపించడంలో తమ సహకారాన్ని చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బుంజూరు విజయ్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు టివీ నరసింహ మాదిగ, తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, జిల్లా అధ్యక్షులు సామ్సన్ రాజు, ఎమ్మెస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, విజయ్, మహేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ డివిజన్‌లో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ ఎర్రగడ్డ డివిజన్, సుల్తాన్ నగర్ షంషేర్ ఫంక్షన్ హాల్‌లో 24 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష 116వేల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డిప్యూటీ తహసీల్దార్ నవీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎర్రగడ్డ డివిజన్ ప్రెసిడెంట్ డి.సంజీవ జావీద్, అజీమ్, సయెద్ రసూల్, టాకీ, పోతురాజు, నర్సింగ్ రావు, బాలకృష్ణ, తరుణ్, బాలు, నర్సింగ్, యాదగిరి, రూపేష్, శివ, చందర్, సదానంద్, కళ్యాణి, జులేఖా, సుజాత, యాదమ్మ, సైదమ్మ, సరితా, స్రవంతి, శంఖు బయి, రజియా బేగం, కళ్యాణి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బేగంపేట

నగర కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాంగోపాల్ పేట డివిజన్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వ హించారు. డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారుల మధ్య రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెక్లోడ్ గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హైదర్‌బస్తీ, మోండా మార్కెట్, పార్క్ లైన్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మల్లికార్జున్, నగర ఉపాధ్యక్షులు కతారీ మహేష్, నాయకులు నాగరాజు, రహీం, సోహైల్, రఘు, ఎల్లేష్, సతీష్, రాజు గౌడ్, నౌమాన్, శ్యామ్, వెంకటేష్ లు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరీ, స్పోర్ట్స్ కిట్లను అందించారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశానికి ఎంతో సేవలు చేశారని, దేశం కోసం ప్రాణాలు సైతం అర్పించారని కొనియాడారు.


జేఎన్టీయూ విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



నవతెలంగాణ-ఓయూ

జేఎన్టీయూ విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరుతూ ఉన్నత విద్యా మండలి చైర్మెన్ డా. లింబాద్రికి గురువారం వినతి పత్రం సమర్పించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని నిరసనలు చేపడితే నోటీసులు జారీ చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఎన్టీయూలో 15న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, 17న అన్నంలో పురుగులు వచ్చాయని ఆందోళన చేసినటువంటి 27 మంది విద్యార్థులకు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. సమస్యలపై పోరాడితే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి గాని భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. విద్యార్థుల కు జారీ చేసిన నోటీసులు వెనక్కి తీసుకొని వైస్ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యారంగంపై సమగ్ర సమీక్ష నిర్వహించండి



నవతెలంగాణ-బంజారాహిల్స్

చాలాకాలంగా రాష్ట్రంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని అతి కీలక మైన ఈ రంగంపై సమగ్ర సమీక్ష నిర్వహించి విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని ఓ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీఎంకి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమ్ము ఉదయ్ కుమార్ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని భావించినా ఆ స్థాయిలో ప్రాధాన్యత లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల లేని, ఉపాధ్యాయుల కొరత, వసతి గృహాలలో నాణ్యతలేని ఆహారము వంటి సమస్యలు విద్యారంగాన్ని పట్టి పీడిస్తున్నాయన్నారు. పదోన్నతులు బదిలీల విషయంలో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సీఎం అపాయింట్మెంట్ ఇస్తే విద్యారంగం ఎలా ఉండాలో తన వంతుగా వివరిస్తానని తెలిపారు.

'ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్' బెస్ట్

- ఆకస్మికంగా తనిఖీ చేసిన అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం కన్నా ఫేస్ రికగ్నిషన్ సిస్టం భాగుంటుందని, ఖర్చు తక్కువవుతుందని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో అన్ని పారిశుద్య కార్మికుల హాజరు నమోదు 'ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్' ప్రక్రియను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. గురువారం దోమలగూడ ఏరియాలోని ఏవీ కాలేజీ వద్ద కవాడిగూడ ఎస్.ఎఫ్.ఏ పరిధిలోని శానిటేషన్ బందాల హాజరు నమోదుపై 'ఫేస్ రికగ్నిషన్ యాప్'లో హాజరు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ సంబంధిత ఎస్ఎఫ్ఏ కింద నాలుగు బందాలు పనిచేస్తున్నాయని, ఒక్కో బందంలో ఏడు మంది కార్మికులు ఉంటారని తెలిపారు. అందులో 20 మంది కార్మికులు హాజరు కాగా, ముగ్గురు గైర్హాజ రైనారని, నలుగురు వీక్లీ ఆఫ్‌లోవుండగా ఒకరు మెటర్నిటీ లీవ్‌లో వెళ్లారని తెలిపారు. ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా లైవ్ ఇమేజ్‌తో రెండు నుండి మూడు సెకండ్లలో ఫోటో క్యాప్చరై హాజరు నమోదవుతుందని, కళ్ళు బ్లింక్ చేయకుండా ఫోటో క్యాప్చర్ కాదని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీలో ఏప్రిల్ నుండి ఈ యాప్‌ను అమలు చేస్తున్నామని, ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పని చేస్తుందన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం కన్నా ఫేస్ రికగ్నిషన్ సిస్టంతో ఖర్చు తక్కువవుతుందని తెలిపారు. ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా జీహెచ్ఎంసిలో పనిచేస్తున్న 19,700 మంది శానిటేషన్ వర్కర్ల రోజు వారీ అటెండెన్స్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ యప్ జూన్ 14, 15 పనిచేయలేదన్నారు. దాంతో కొందరు హాజరు నమోదు అయినట్లు, మిగిలిన వారిది క్యాప్చర్ కాలేదన్నారు. ఈ విషయంలో సంబంధిత ఎస్ఎఫ్ఏలపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ముందు ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా గట్టి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు.

ముగిసిన బడిబాట

- కొనసాగనున్న ప్రవేశాల ప్రక్రియ
- రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మంది చేరిక
- హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 3 వేలకు పైగా అడ్మిషన్లు
- అంగన్‌వాడీ, ప్రయివేటు స్కూళ్ల నుంచి పలువురి చేరిక
- పూర్తి లెక్కలు త్వరలో వెల్లడిస్తాం : విద్యాశాఖ అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సర్కారు బడుల బలోతానికి రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఆ దిశగా కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రధానంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు నడుం బిగించిన విషయం తెలిసిందే. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా సాగింది. జూన్ 6 నుంచి 19 వరకు జరిగిన బడిబాట కింద రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 60వేల మంది అడ్మిషన్లు తీసుకున్నారని అధికార వర్గాల సమాచారం. 18వ తేదీ వరకు అందిన సమాచారం మేరకు 42వేల మంది ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పూర్తి లెక్కలు త్వరలో వెల్లడిస్తామంటున్నారు. హైదరాబాద్ జిల్లాలో పది రోజుల పాటు నిర్వహించిన బడిబాటలో ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కొత్తగా 3వేల మందికిపైగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించినట్టు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ బడుల వైపు ఆకర్షించేలా ప్రచారం!

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజు దోపిడీకి అడ్డు అదుపు లేకుండాపోతోంది. రకరకాల పేర్లతో పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి అందినకాడికి దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రయివేట్ యాజమాన్యాలు.. స్కూళ్లను కిరాణా షాపుల్లా మార్చేస్తున్న తీరు అందరిని ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో జూన్ వచ్చిందంటే చాలు పేద కుటుంబాలు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. విద్యార్థులను సర్కారు స్కూళ్ల వైపు ఆకర్షించడం కోసం ప్రభుత్వం ప్రతియేటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం రోజుకో కార్యక్రమంతో విద్యార్థులు, తల్లిదండ్రులను జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు కలిసి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు. యూనిఫామ్ పంపిణీ, డిజిటల్ విద్య, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా పాఠశాలల అభివృద్ధి వంటి తదితర సౌకర్యాలను వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడుల వైపు ఆకర్షించేలా అవగాహన కల్పించారు. గతేడాదితో పోల్చిచూస్తే ఈ విద్యాసంవత్సరం సంఖ్య కొంత మేర పెరిగినట్టు సంబంధిత అధికారులు చెప్పారు. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ఇంటింటికీ తిరుగుతూ..

బడిబాటలో భాగంగా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ పాఠశాల పరిధిలోని బస్తీలు, కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ మధ్యలో చదువు ఆపేసిన వారిని, బాలకార్మికులను, బడీడు పిల్లలను, అంగన్‌వాడీలు, ప్రయివేట్ పాఠశాలల్లో చదివే వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేశారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి. హైదరాబాద్ నగరంలో మొత్తం 691 ప్రభుత్వ పాఠశాలలుండగా.. వీటిల్లో 1.05లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. బడిబాటలో తరగతుల వారీగా నూతన అడ్మిషన్ల సంఖ్య చూస్తే.. ప్రీ ప్రైమరీ ఏడు మంది, 1వ తరగతిలో అంగన్వాడీ నుంచి 490 మంది, ప్రయివేట్ స్కూళ్ల నుంచి 520, నేరుగా ప్రవేశాలు 1050 మంది.. మొత్తం 1వ తరగతిలో 2,060 మంది అడ్మిషన్లు పొందారు. ఆయా ప్రయివేట్ పాఠశాలల నుంచి 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 1237 మంది ప్రవేశాలు పొందగా.. ఒకటి నుంచి కలిపితే ప్రయివేట్ పాఠశాలల నుంచి 1757 మంది చేరారు. ఇలా మొత్తం 3304మంది విద్యార్థులను స్కూళ్లలో చేర్పించారు. ప్రవేశాల ప్రక్రియ వచ్చే నెల వరకు కొనసాగనుందని, ఇంకా విద్యార్థుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

'నీట్' అవకతవకలపై ఎన్టీఏ దాపరికం

- సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించే ఎన్టీఏ సంస్థ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, ఫలితాల్లో గందరగోళంపై పూర్తి దాపరికంగా వ్యవహరిస్తోందని సీపీఐ(ఎం) హైదరాబాద్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సీపీఐ (ఎం) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష ఫలితాలు ప్రకటించాల్సిన తేదీ కంటే పది రోజుల ముందుగా పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడే రోజే ఆకస్మికంగా ప్రకటించడం ద్వారా తమ తప్పిదాల్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. నెట్ ఎగ్జామ్ పేపర్ లీక్ అయినందున తక్షణమే ఈ పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, నీట్ పరీక్ష పై కూడా విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 14వ తేదీ వెల్లడి కావాల్సిన ఫలితాలను ఆగమేఘాల మీద ఎన్నికల ఫలితాల రోజు విడుదల చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి, ఎం. మహేందర్, ఎం.దశరథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు, నాయకులు ఏ.పద్మ, విమల, వెంకటేష్, కిరణ్, మల్లేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అదనంగా లేబర్‌ను పెంచి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కాంట్రాక్టర్ ఏజెన్సీలు పనులు చూడాలని.. అసిస్టెంట్ ఇంజనీర్లు పనులను పర్యవేక్షించాలని సూచించారు. పూర్తయిన పనుల బిల్లులు సమర్పించాలన్నారు. పనులు పూర్తయిన ఫోటో, వర్క్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. పాడైన బోర్డు స్థానంలో కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని, పాఠశాల భద్రతను దృష్టిలో పెట్టుకొని పనులను చేయాలన్నారు. పాఠశాలలో చెత్త, స్క్రాప్ తొలగించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఈలు పనులను పరిశీలించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారిణి ఆర్.రోహిణి, ప్రత్యేక అధికారులు, ఈఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం..

- మారేడుపల్లి తహసీల్దార్, గిర్దవర్, రికార్డు అసిస్టెంట్‌లు సస్పెండ్
- ఉద్యోగులు జవాబుదారితనంలో పనిచేయాలి.. లేకుంటే చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉద్యోగులు జవాబుదారితనంతో, బాధ్యతయుతంగా పని చేయాలని, విధులు పట్ల నిర్లక్ష్యం చేసే ఉద్యోగులకు చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం మారేడుపల్లి తాహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని అన్ని రకాల రిజిస్టర్లలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ఎవరు ఎక్కడికి వెళ్లారు అని తెలుసుకున్నారు. ఇన్వార్డ్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రతి దరఖాస్తును ఇన్వార్డ్ చేసి.. దరఖాస్తుపై డేట్ స్టాంప్ వేసి సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని ఆదేశించారు. సంబంధిత సెక్షన్లు బాధ్యతగా, జవాబుదారితనంగా పనిచేసి దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. తాహసిల్దార్ కార్యాలయ స్థాయి, ప్రజావాణి, ప్రజా దర్బార్, లోకయుక్త, హ్యూమన్ రైట్ కమిషన్, కోర్టు కేసుల రిజిస్టర్ల నిర్వహణతో పాటు నివేదికలను నిర్దేశించిన లక్ష్యంలోగా డిస్పోస్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విధులు, రికార్డులు సక్రమంగా నిర్వహించని ఉద్యోగులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు సక్రమంగా నిర్వహించని కారణంగా మారేడుపల్లి తహసీల్దార్ పద్మ సుందరి, గిర్దవర్(ఎస్ఏ) పి. ప్రసన్నలక్ష్మి, రికార్డు అసిస్టెంట్ ఎస్. రవిలను కలెక్టర్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. కలెక్టర్ వెంట సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలు జరపాలి

- భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆషాఢ బోనాల ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్ష




నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆషాఢమాసంలో నెలరోజులపాటు జరుపుకునే బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఆషాఢ మాసం బోనాలు ఉత్సవాలపై హైదరాబాద్ జిల్లా స్థాయి అధికారుల సమన్వయ సమావేశంలో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి జరుపుకుంటున్న బోనాల ఉత్సవాలను గతంలో కంటే ఘనంగా జరిగేలా చూడాలన్నారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా పరిధిలో 2400 దేవాలయాలు ఉన్నందున ఉత్సవాలు ఘనంగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేవాలయాలకు ఇచ్చే చెక్కుల పంపిణీ త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈసారి దేవాలయాలకు ఇచ్చే డబ్బులు పెంచే విధంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. నగరంలోని 28 ముఖ్యమైన దేవాలయాలకు ప్రజా ప్రతినిధులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ప్రధానమైన దేవాలయాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. వాహనాలకు ఏదైనా ఇబ్బంది వచ్చి ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ఉన్న అన్ని దేవాలయ ఉత్సవ కమిటీలతో రెవెన్యూ, పోలీస్, ఇతర విభాగాల అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. బోనాల ఉత్సవాలను పూర్తయ్యే వరకు ఎవరు కూడా నిర్లక్ష్యంగా ఉండకూడదని మంత్రి హెచ్చరించారు. సమన్వయంతో పనిచేసి బోనాలు పండగను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ ఇంచార్జి కమిషనర్ ఆమ్రపాలి, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్వో వెంకటాచారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లిలో ఎమర్జెన్సీ పంపింగ్ ప్రారంభం

- జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌కు నీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని తరలిస్తున్నామని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముర్మూర్ వద్ద ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ పంపింగ్ పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పంపింగ్ ప్రారంభించామని తెలిపారు. మొత్తం 20 పంపులను ఏర్పాటు చేశామన్నారు. వాటిల్లో ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని, నీటి లభ్యతను బట్టి మిగిలిన పంపులను కూడా దశల వారీగా ప్రారంభిస్తామని తెలిపారు. గోదావరి పథకం ద్వారా నగరానికి 168 ఎంజీడీల నీరు తరలించనున్నట్లు వివరించారు. ఈ సారీ వర్షపాతం తక్కువ నమోదు కావడంతో ఎగువనున్న కడెం ప్రాజెక్టు నుంచి ఎలాంటి వరద లేదని, దాంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా తగ్గుతుందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే హైదరాబాద్ నగరానికి గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ద్వారా అందించే నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని తరలిస్తున్నామని తెలిపారు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం దశరథ్ రెడ్డి, జీఎం బ్రిజేష్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT VISAKHAPATNAM
CC No.16 / 2024

BETWEEN:
Sri Moturu Surya Babu ... Complainant
AND:
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao and 2 others ... Opposite parties

NOTICE

To,
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao, having its registered office at D.No: 6-3-688/10/4, Durga Nagar Colony, Panjagutta, Hyderabad-500082

Sri Moturu Surya Babu filed a complaint against you and 2 others and it was posted to 05-07-2024 for your appearance. Therefore you are here by directed by the HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT VISAKHAPATNAM to appear before the said commission on 05-07-2024 at 10.30AM failing which matter will be heard in your absence.

By the commission Order
MISS PRAGNYA KORRA
Advocate
30-7-17, Visakhapatnam, Andhra Pradesh-17
Cell : 9848722288

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT VISAKHAPATNAM
CC No. 22 / 2024

BETWEEN:
M. Venkata Ratnam ... Complainant
AND:
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao and 2 others ... Opposite Parties

NOTICE

To,
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao, having its registered office at D.No: 6-3-688/10/4, Durga Nagar Colony, Panjagutta, Hyderabad-500082

Sri Moturu Surya Babu filed a complaint against you and 2 others and it was posted to 05-07-2024 for your appearance. Therefore you are here by directed by the HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT VISAKHAPATNAM to appear before the said commission on 05-07-2024 at 10.30AM failing which matter will be heard in your absence.

By the commission Order
MISS PRAGNYA KORRA
Advocate
30-7-17, Visakhapatnam, Andhra Pradesh-17
Cell : 9848722288

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT : VISAKHAPATNAM
CC No. 20 / 2024

BETWEEN:
M. Venkata Ratnam ... Complainant
AND:
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao and 2 others ... Opposite Parties

NOTICE

To,
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao, having its registered office at D.No: 6-3-688/10/4, Durga Nagar Colony, Panjagutta, Hyderabad-500082

Sri Moturu Surya Babu filed a complaint against you and 2 others and it was posted to 05-07-2024 for your appearance. Therefore you are here by directed by the HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT VISAKHAPATNAM to appear before the said commission on 05-07-2024 at 10.30AM failing which matter will be heard in your absence.

By the commission Order
MISS PRAGNYA KORR
Advocate
30-7-17, Visakhapatnam, Andhra Pradesh-17
Cell : 9848722288

IN THE COURT OF THE HON'LBE JUNIOR CIVIL JUDGE RANGA REDDY DIST AT: CHEVELLA
O.S.No 220 of 2023

Between:
Smt.PIE SHETTY SHOBHA ...Plaintiff
AND
M.MAHESH & Others ...Defendants

SUMMONS

To,
M.SATYANARAYANA S/o M.Ramulu (Pedda) R/o.Near Mohini Function hall, Karwan, Hyderabad-500 006. ...Defendant No.14

The above plaintiff has filed a suit for perpetual injunction against the Defendants No.1 to14. The above case is posted on 24-06-2024 for your appearance. Hence are hereby required to appear in person or through your pleader on the above said date by 10:30 AM before the said Hon'ble Court, failing which the above matter will be heard and deciding accordingly as per law.

(By orders of the Court)
GANGADHAR PATIL ANITHA PATIL NIKITHA PATIL
ADVOCATES
#FlatNo.305, 3rd Floor Salwa Complex Core Hospital lane. Upper ally, Hyderabad-048
Cell 9948092971,9391132971

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT VISAKHAPATNAM
CC No. 18 / 2024

BETWEEN:
Sri Moturu Surya Babu ... Complainant
AND:
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao and 2 others ... Opposite Parties

NOTICE

To,
M/s Green mangos Real Estates India Pvt Ltd represented by Moganti Bhanojirao, having its registered office at D.No: 6-3-688/10/4, Durga Nagar Colony, Panjagutta, Hyderabad-500082

Sri Moturu Surya Babu filed a complaint against you and 2 others and it was posted to 05-07-2024 for your appearance. Therefore you are here by directed by the HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II AT VISAKHAPATNAM to appear before the said commission on 05-07-2024 at 10.30AM failing which matter will be heard in your absence.

By the commission Order
MISS PRAGNYA KORRA
Advocate
30-7-17, Visakhapatnam, Andhra Pradesh-17
Cell : 9848722288

గౌరవ నీయులైనా సీనియర్ సివిల్ జడ్జి చేవెళ్ల రంగా రెడ్డి జిల్లా
I.A.No. 225 OF 2024
IN
O.S. NO. 125 OF 2011

మధ్యన
నికిత మరియు ఇతరులు ....వాదులు
మరియు
పట్నం మాణిక్ రెడ్డి మరియు ఇతరులు .... ప్రతివాదులు

1. వెంకటేశ్వర్ వర్మ తండ్రి బుద్ధవరం రాజు వయస్సు 60 సం॥లు, వృత్తి వ్యాపారం,నివాసము H.No.8-3-168/2/57 to 60, flot no.501, 102. తరంగ రాజు టవర్, రాజీవ్ నగర్ హైదరాబాద్.
2. కే చంద్రశేకర్ రెడ్డి తండ్రినర్సింహా రెడ్డి వయస్సు 58 సం॥లు, వృత్తి : వ్యాపారం, నివాసము H.No.3-4-361. ఫ్లోట్ నెం. 102. వెంకట పద్మావతి రేసిడెన్సీ, బర్కత్పూర, హైదరాబాద్.
3. పల్లె మల్లేశ్ తండ్రి శంకరయ్య, వయస్సు 28 సం॥లు, వృత్తి వ్యాపారం. నివాసము H.No.8-18, కంది విలేజ్ మరియు మండల్, సంగ రెడ్డి.

పైన తెలిపిన వాదులు గౌరవ నియ సీనియర్ సివిల్ జడ్జి చేవెళ్ల కోర్టులో ప్రతివాదుల పైన Suit For Partition And separate Possession దావా సర్వే నేబర్ 149, విస్తీర్ణం ఏకరములు 1-29 గుంటలు, సర్వే నేబర్ 161, విస్తీర్ణం ఏకరములు 0-05 గుంటలు, సర్వే నేబర్ 162, విస్తీర్ణం ఏకరములు 0-06 గుంటలు, సర్వే నేబర్ 200, విస్తీర్ణం ఏకరములు 2-06 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఏకరములు 4-07 గుంటలు, సింగపురం గ్రామం, శంకర్పల్లి మండలము రంగా రెడ్డి గల భూమి పై దావా వేసియున్నారు. గౌరవ నీయ కోర్టు ఆర్డర్ ప్రకారంIA.NO.225 OF 2023 తమరి హాజరుకై దావను 21-06-2024 నాటికి మూర్తియున్నరు. కావున తమరు 21-06-2024 నాడు ఉదయం 10:30 గంటలకు గౌరవనీయ కోర్టుయందు స్వయముగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కాగలరు లేనిచో కోర్టువారు ఏకపక్ష నిర్ణయము గైకొందురు.

"కోర్టు ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది".

శ్రీ పి. సంపూర్ణ ఆనంద్ అడ్వకేట్,
H.No.4-2-879/10/1,
నియర్ గౌతమీ జూనియర్ కాలేజీ,
వికారాబాద్ మున్సిపాలిటీ టౌన్.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE , SANGAREDDY DISTRICT, AT: SANGAREDDY.
O.S.NO.412 OF 2024.

Between:
Gajjarapu Veeraraju And two others ...Plaintiffs
And
The Tahasildar, Mandal Revenue Office, Patancheru and two others. ...Defendants.

To:
All Concerned ...Defendant No.3.

Whereas the above Suit filed for a declaration that the Plaintiffs are the Legal Heirs of the deceased namely-Late Gajjarapu Surya Rao in respect of Suit Schedule Property i.e. all that open plot No. 176A of Sri Ram Nagar, Admeasuring 300 Sq.Yards (280.84Sq. Mrts) farming part of Survey Numbers 252 AA and 252 EE Situated at Chitkul Village, then Sangareddy Taluk of Medak District (Now in Sangareddy District) and bounded by North: Plot No.175; South : Plot No.177; East: 25ft wide Road; and West: Plot No.181 covered under Sale Deed No.2833 of 1986-11 th April 1986.

Therefore any person or persons having objections in the subject matter are hereby advised to appear on the said date i.e., **10 th July 2024 (Wednesday) at 10.30 AM** before the said Hon'ble Court and in the event of failure of your appearance on the said day, the matter will be dealt with and decided in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)
S.BALACHANDER & P.RAVI, Advocates,
Plot No.63,Road No. 1-C, Krishna Nagar Colony, N.F.C. Road, Moula-Ali,HYDERABAD - 500 040.
Cell - 9866165456

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE R.R. DISTRICT AT: L.B. NAGAR
E.P.No.25 OF 2010
IN
O.S.No.162 OF 1997

Between:
G.Krishna ...Decree Holder/Plaintiff No.1
AND
1.Varikuti Madanagopal Swamy and 4 others ...Judgment Debtors/Defendants
2.K.Chennakesava Rao
3.K.Saratchandra ...Respondents/DHR's 2 and 3/Plaintiffs 2 and 3

NOTICE

To,
1.Varikuti Madanagopal Swamy S/o.Late V.V.L.Narasimha Rao, age Major,
2.Varikuti Srinivasa Venkatasai S/o.Late V.V.L.Narasimha Rao, age Major,
3.Mr.V.Swarajya Lakshmi W/o. Late V.Sudarshanam, age Major,
4.Varikuti Sathya Murthy S/o.Late V.Sudharshanam, age Major,
5.Mr.V.Narayan Rao S/o.Late Rama Rao, age 64yrs, All are R/o. E-11, IDA, Patancheruvu, Sanga reddy District.
6.Mr.K.Chennakesava Rao S/o. Late K.P.Naidu, aged about 45 yrs, R/o.Flat No.601, Sai Kesava Towers, Near NAC, Second Gate, Kandapoor, R.R. District.
7.K.Saratchandra S/o.Nagabhushanam, aged 37yrs, R/o.Flat No. 106, Sai Surabhi Awas Apts., Madhuranagar, Vengal Rao Nagar, Hyderabad

Please take notice that decree holder/plaintiff No.1 filed the above E.P. in pursuance of the decree and judgment passed in O.S. No.162 of 1997 dated 09-09-1998 against the JDRs No.1 to 5 and respondents/ plaintiffs No.2 & 3 for getting the sale deed registered to the extent of 1/3rd share in E.P.schedule property and the said E.P.stands posted to 25-06-2024 for appearance and counter if any. Make it convenient to be present before the above Hon'ble Court **on 25-06-2024 at 10:30 AM** either in person or through your counsel along with relevant documents if any, failing which the matter will be heard in your absence and will be decided on merits.

SCHEDULE OF PROPERTY

All that piece of Agricultural land admeasuring Ac.5-00 Gts., in Sy. No.195/Part and Ac.7-00 Gt., in Sy. No.200/Part of Kondapur Village, Serilingampally Mandal, R.R. District and bounded by:
NORTH :: Neighbour Land
SOUTH: Sy. No.201, Part of Sy. No. 195 and 30 feet Wide Road
EAST :: Part of Sy. No.200
WEST :: Neighbours Land

//By order of the Court//
MANNE SANTHOSH
Advocate
Malikarjuna Nagar, Uppal, M.M. District, Hyderabad
Cell No.6281584536, 9959991048

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No.1054 OF 2024

BETWEEN:
1)Smt.Kataram Narsamma, W/o. Late Sri. Kataram Krishna, aged about 73yrs, Occ: Household, R/o.H.No.2-3-531/16/16A, Plot No.17, D V Colony, Opposite St. Mark School, Secunderabad, Hyderabad, T.S-500003
2)Mrs.Kataram Vanishree,W/o.Late Sri Kaaram Raju@ K.Raju Daughter-in-Law of late Sri. Kataram Krishna aged about 44yrs Occupatin :Household,R/o.H.No.2-3-531/16/16A, Plot No.17, D V Colony, Opposite St.Mark School, Secunderabad, Hyd, T.S-500003
3)Kum.Kataram Priyank Raju, D/o. Late Sri Kaaram Raju@ K.Raju GrandDaughter of late Sri.Kataram Krishna aged about 14yrs, Occupatin :Student,R/o.H.No.2-3-531/16/16A, Plot No.17, D V Colony Opposite St. Mark School, Secunderabad, Hyd, T.S-500003 Plaintiff No.3 being Minor Represented by her Natural Guardian Mother Mrs.Kataram Vanishree, (Plaintiff No.2 herein)
4)Mrs.Kothalapuram Jayalaxmi, W/o Kothalapuram Durga Prasad D/o.Late Sri Kataram Krishna, aged about 43yrs, R/o.H.NO.8-3-110/D, Keshavanagar Colony, Srinagar Colony, Panjagutta Colony, Hyderabad, T.S.
5)Mrs.Raparthy Himabindu, W/o. Mr.Raparthy Bala NarsimhaMurthy D/o.Late Sri.Kataram Krishna, aged about 40yrs, Occupation: Household, R/o.H.No.7-1-80, Flat No-301, Anand Nilayam, Ameerpet, Hyd, T.S.-500016., ...Plaintiffs
AND
1.The Tahsildar, Amberpet Mandal, Hyderabad
2.All Concerned ...DEFENDANTS

To,
ALL CONCERNED
Whereas the above named Plaintiffs filed the above suit, praying the Hon'ble Court to declare them as the only legal heirs of Late Sri. Kataram Krishna (expired on 26-03-2023), and to pass decree in their favor. That the above suit is posted **to 26.06.2024** in the captioned court of law for all concerned individuals' appearance **at 10:30 A.M.** for objections/claims, if any. If no objections are received on the said date, the matter will be decided on merits and according to law.

//BY ORDER OF THE COURT//
M/s.Uzair Ahmed Khan,
Advocate
#1602, Babukhan Estates, Basheer Bagh, Hyderabad.
Ph No. – 8500246842

From No.2
Summons for settlement of issues
(Or 5 R1.5)
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT:NARAYANPET
O.S.No. 55 OF 2015

BETWEEN :-
M.Narasimha Reddy died by L.R. ...Plaintiff
AND
G.Venkatramireddy and others ...Defendant

To.
d.11.Nenavath Harika D/o Nenavath Balram age 18 years occup Student R/o H.No.2-3-703/1 Maruthinagar Amberpet Hyderabad 500013
D.12.Smt.Jyothi Rani Savala W/o Venkateshan Anamal age 35 years occup:House wife R/o H.No. c-103 Keshav Dalla Apartment Hyderabad - 500004

Whereas plaintiff/s have instituted suit against you for declaration Hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall accompanied by same person able to answer all such question on 03.07.2024 at 10-30 clock in the noon to answer the claim and further you are here by directed to file on that day a written statement of defense to produce on the said day all document in you possession power upon which your base your defense of claim for set off counter claim and where you rely on any the on document weather in you possession or power or not evidence in support of your defense claim for set of counter claim you shall enter such document in list to be annexed to the written to the statement **TAKEN** Notice that in default of you appearance on day before mentioned the suit will be heard and determined in your absence. Given under my hand the seal of the Court this day 2024 JUDGE

Note:You Should appear and file the written statement and documents within 30 days from the date of receipt of this summon in order to avoid passing the order if any against you in ex-parte.

Through
Sri.Mallikarjun
Advocate
Narayanpet
Dist Narayanpet.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | జూన్ 21, 2024 | www.navatelangana.com

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నాంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్ఎన్ ఎస్. మరనత అన్నారు. గురువారం నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బజార్ ఘాట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాంత రాజ్, కృష్ణ సందీప్, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'మలబార్ ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ షో'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హిమాయత్ నగర్ మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూమ్ లో 'ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యువలరీ' షోను ప్రముఖ మోడల్స్ నీలిమ, స్రీలు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం పీఆర్ఓ రాంబాబు మాట్లాడుతూ ఈ జ్యువలరీ షోలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతిరత్నభరణాలను ప్రదర్శిస్తుందని, ఈ ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యతతో అంతులేని హుందాతనంతో కూడినవని, నగిషీ చెక్కిన ప్రతి ఆభరణం తయారు చేసిన వారి అనుభవం, కళాత్మకతకు ఈ జ్యువలరీ షో నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ షో నేటి నుంచి ఈనెల 23వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని నగరవాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆర్టిజన్ కార్మికులను అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలి

- టీజీయుఈఈయు-సీఐటీయు జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్
- బేగం బజార్ డివిజన్ నూతన కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-ధూల్‌పేట్

రాష్ట్రంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులందరినీ అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయుఈఈయు-సీఐటీయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి గోవర్ధన్ అన్నారు. టీజీయుఈఈయు - సీఐటీయు బేగంబజార్ డివిజన్ లో మంగళ్ హాట్ కార్యాలయం టీఎన్జీ వెట్స్ ఫంక్షన్ హాల్ లో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ బాడీలో యూనియన్ కార్మికుల సమస్యలు, కార్యవర్గం పై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో డివిజన్ అధ్యక్షులు కె. మహేందర్ కుమార్, డివిజన్ కార్యదర్శి ఎం.వి. క్రిష్ణ రెడ్డి, కోశాధికారితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్రంలో సుమారు 23, 667 మంది ఆర్టిజన్ కార్మికులున్నారన్నారు. వారి అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలన్నారు. 5ఏండ్లు పూర్తి చేసుకున్న కార్మికులందరికీ వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సీఐటీ యు సౌత్ జోన్ కార్యదర్శి శ్రావణ్ కుమార్, యం. మున్నిలాల్ నాయక్, ఇ రాజయ్య, బి.కనకయ్య, ఎ.లక్ష్మి నారాయణ, పి.శ్రీనివాస్, యం.రాము, డివిజన్‌లో ముఖ్య నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రప్రభుత్వ' లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్ వీ.మహేందర్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్సూరెన్స్ సద్విని యోగం చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్ వీ.మహేందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప, కూలీ లతో పాటు అందరు అర్హులేనన్నారు. తెల్ల రేషన్ కార్డు తప్పని సరిగా ఉండాలన్నారు. ఏడాదికి రూ 22లు మాత్ర మేనని, 5ఏండ్లకు ఒకేసారి రూ.110లు మాత్రమే చెల్లిం చాలన్నారు. వీరికి 18 నుండి 55 ఏండ్ల ఉన్న స్త్రీ, పురుషులు అర్హులనీ, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరులైన ఇందులో చేరవచ్చునని పేర్కొన్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జిరాక్స్ లు జత చేయాలన్నారు.

"ప్రయోజనాలు"..

పాలసీదారు సహజ మరణం పొందితే రూ.లక్ష 30 వేలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.6లక్షల ఇన్సూ రెన్స్ సౌకర్యం కల్పిస్తుంది. ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒకొక్కరికి వివాహ నజరానాగా రూ.30వేలు, ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు ఒక్కో ప్రసవానికి రూ.30వేలు అందిస్తుంది. ఒక ఏడాది పాలసీ పొందిన తరువాత లబ్ధిదారునికి ఏదైన ప్రమాదవ శాత్తూ ప్రమాదం జరిగినా 50 శాతం వికలాంగులుగా ఉంటే రూ.2.50 లక్షలు, అదే 100శాతం ఉంటే రూ.5 లక్షల పరిహారం ఉంటుందన్నారు. ఈ అవకాశా న్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ లేబర్ ఇన్సూరెన్స్ ఒకసారి రూ. 110లు చెల్లిస్తే 5 సంవత్సరాలు వరకు చెల్లించనక్కర్లేదు. జిల్లాల వారీగా ఉన్నవారు ఎంపీడీఓ, ఎంఆర్ఓ, జిల్లా కార్యాలయాల్లో సంప్రదించవచ్చున్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి వున్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఏ పని చేసేవారైన ఈ కార్డును పొందవచ్చని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న పార్టీ సీనియర్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.మహేష్ యాదవ్ టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం కాచిగూడ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కష్టకాలంలో కూడా పార్టీనే నమ్ముకుని పార్టీ కోసమే పనిచేసిన నేతలకు గుర్తింపు కల్పించాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారు లకు అందే విధంగా పార్టీ కార్యకర్తలతో కలిసి సీనియర్ నేతలు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పదవులను సీనియర్లకు ఇస్తే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యే విధంగా చూస్తారని తెలిపారు. పార్టీ సీనియర్లకు గుర్తింపు కల్పించే విధంగా పార్టీ అధి ష్టానం, సీఎం, మంత్రులు అన్ని విధాలుగా ఆలోచించాలని కోరారు.

యోగతో మానసిక, శారీరక ఉల్లాసం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



యోగతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుం దని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జీహెచ్ఎంసీ మైదానంలో ఇన్స్టిట్యూట్ ఫర్ కల్చరల్ ట్రైనింగ్ ఫౌండేషన్, అంబర్‌పేట మండల గుర్తింపు పొందిన పాఠశాలల అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో విద్యార్థులచే యోగ ఆసనాలు చేయించారు. ఇందులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ బి.పద్మ వెంకటరెడ్డిలు పాల్గొని విద్యార్థులతో పాటు యోగ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ భారతదేశపు ప్రాచీన కళ అని, ఎన్నో వందల, వేల సంత్సరాలుగా వస్తుందని చెప్పారు. యోగ మాస్టర్లు, కార్యని ర్వాహకులను, ఇందులో పాల్గొన్న వారిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ మధుసూదన్, రాజశేఖర్ రెడ్డి, మధుసూధన్, శ్రీకాంత్‌రెడ్డి, కెంచె రవికుమార్, నిరంజన్, భాస్కర్ రెడ్డి, శ్రావణ్, రామ్మూర్తి, డాక్టర్ సత్యరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నులి పురుగుల సంక్రమణను పూర్తిగా నిర్మూలించాలి







నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మహారాజ్ గంజ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్త పారమౌంట్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూలి పురుగుల నివారణ మాత్రలను పానీ పూర క్లస్టర్ ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మల్లీశ్వరి, గోషా మహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్ సింగ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్‌పిహెచ్ఓ డాక్టర్ మల్లీశ్వరి మాట్లాడుతూ.. ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులి పురుగు నివారణ మాత్రలు వేసి పురుగులను పూర్తిగా నిర్మూలించడానికి ఆల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయ న్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా పానీపూర క్లస్టర్ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రాలను ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేశారు. ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు ప్రతి పిల్లలకు మాత్రలను తల్లిదండ్రులు వారి పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్ కల్పన, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, నవీన్ అగర్వాల్, జైపాల్ సింగ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న బేగంబజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద్, పి హెచ్ ఎన్ నాగేశ్వరమ్మ తదితరులు

కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని

కింగ్ కోఠి క్లస్టర్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ డీప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మజ, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, పి హెచ్ఎన్ రామలక్ష్మి, ఆర్‌బిఎస్‌కే డాక్టర్ రమేష్, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ నగర్‌లో ..

నేతాజీ నగర్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న గన్ ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, ఆగాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం జ్యోత్స్న, ఆశ వర్కర్ తదితరులు

నవతెలంగాణ-ధూల్‌పేట్

నూలి పురుగుల మాత్రలు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగిస్తాయని పురానాపూల్‌లో గల ఎస్వీ నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అఫ్జల్ గంజ్ ప్రధానోపాధ్యాయు రాలు పద్మజా కుమారి అన్నారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో జాతీయ నూలి పురుగుల దినోత్సవ సందర్భంగా నూలి పురుగులను విద్యార్థులకు వేసిన తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొనీ మాట్లాడుతూ.. రోజురోజుకు కొత్త కొత్త వైరస్ లు ప్రాణాంతకమైన వ్యాధులకు దారి తీస్తున్నాయనీ ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహనను పెంపొందించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, సీనియర్ టీచర్స్ జ్యోతి, ప్రద్యుమ్న రెడ్డి, బల్వంత్ రెడ్డి, కౌసర్ ఫాతిమా, శ్రీనివాస్, పురానాపూల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా వర్కర్లు రజని, రజనీ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల సంక్రమణను పూర్తిగా నిర్మూలించాలి

నవతెలంగాణ-ముషీరాబాద్

నులి పురుగుల సంక్రమణను పూర్తిగా నిర్మూలించాలి అని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు.గాంధీనగర్ డివిజన్ లోని అభ్యు దయ హై స్కూల్ , జవహర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులి పురుగుల నిర్మూలన యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన నిర్మూలించేందుకు అల్బెండజోల్ మాత్రలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, వివిఎస్‌టి రాజు, ఎం.ఉమేష్, సత్తి రెడ్డి, నర్సింహ, గణేష్, ప్రశాంత్ , ఏఎన్ఎం అనిత, కృపా సిస్టర్,ఆశా వర్కర్లు దుర్గా,స్వప్నా పాల్గొన్నారు.

గ్రూప్ పోస్టులు, టీచర్ పోస్టులను పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య
- నిరుద్యోగులతో ధర్నా చౌక్‌లో భారీ ప్రదర్శన



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచి, టీచర్ పోస్టులు 25వేలకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ జేసి చైర్మన్ నీలా వెంకటేష్, నాయకులు అశోక్, అన్వర్ అధ్యక్షతన నిరుద్యోగులతో కలిసి భారీ ప్రదర్శన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం 2 లక్షల ఉద్యోగాల భర్తీకై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. గ్రూప్-1 సర్వీస్ కింద 503 పోస్టులు ప్రకటించారు. కానీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ కోట పోస్టులు కరెక్టుగా లెక్కిస్తే 1600కు, గ్రూప్-2 సర్వీస్ కింద 783 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. వీటిని కూడా కరెక్టు గా లెక్కిస్తే 2200లకు, గ్రూప్ 3 పోస్టులు 1383 ప్రకటించారు. వాస్తవంగా 3వేలకు పైగా ఉన్నవి, గ్రూప్-4 సర్వీస్ కోటా కింద 8500 పోస్టులు ప్రకటించారు. ఇవి 25 వేలకు పైగా ఉంటాయి. టీచర్ పోస్టులు 11వేలు ప్రకటించారు. పీఆర్‌సీ రిపోర్ట్ ప్రకారం 25వేల టీచర్ పోస్టులు ఖాళీగాయున్నవని తెలిపారు. ముఖ్యమంత్రి ఒకే దఫా 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఆదేశాలు జారీ చేయడం గొప్ప విషయమని డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోటా క్రింద భర్తీ చేయాల్సిన గ్రూప్-1,2,3,,4 సర్వీస్ ఉద్యోగాలను పూర్తి స్థాయిలో లెక్కించి గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు పంపలేదని ఏదో నామమాత్రంగా లెక్కించి ప్రతిపాదనలు పంపారన్నారు. ఇప్పటికే అన్ని శాఖలలో అడ్‌హక్ ప్రమోషన్ల పేరుమీద భర్తీ చేశారు. కొందరు ఉన్నతాధికారులు డైరెక్టు రిక్రూట్ మెంట్ లెక్కించడంలో అన్యాయం చేస్తున్నారు. డైరెక్టు రిక్రూట్ మెంట్ కోటా పోస్టులను ప్రమోషన్ల క్రింద భర్తీ చేశారని అన్ని పోస్టులను క్షుణ్ణంగా లెక్కించి భర్తీ చేయాలని కోరారు. ఈ ధర్నాలో జిల్లాపల్లి అంజి, అనంతయ్య, పగిళ్ళ సతీశ్, మోదీ రాందేవ్, హర్షిత, శ్రీనివాస్, కోటేశ్వరి, అనిత, సుకేష్, మిత్రా, నందగోపాల్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు న్యాయం చేయాలి



- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలను కప్పిపుచ్చే ప్రయత్నం మానుకొని నీట్ అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యానగర్ బీసీ భవన్ లో విద్యార్థి సంఘం నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వేముల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష అవకతవకల కారణంగా విద్యార్థులు వైద్య వృత్తిపై విశ్వాసం కోల్పోతున్న 24 లక్షల మంది నీట్ అభ్యర్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలను కప్పిపుచ్చే ప్రయత్నం మానుకొని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నీట్ పరీక్షను వెంటనే రద్దుచేసి సుప్రీంకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నీట్ అవకతవకలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయకుండా నీట్ అభ్యర్థులకు న్యాయం చేసి వైద్య వృత్తిపై భరోసా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలలో వైద్య వృత్తికి భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దాని ప్రతిష్ఠను కాపాడాలని ప్రదానమంత్రి దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకూ ఎంతవరకైనా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గ్రూప్స్ అభ్యర్థులకు బీఆర్ఎస్ మద్దతు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రూప్స్ అభ్యర్థులు, నిరుద్యోగులు ఇందిరా పార్క్ దగ్గర నిర్వహించిన కార్యక్రమానికి బీఆర్ఎస్ నేత ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు నిరుద్యోగులు గుణపాఠం చెబుతారని తెలిపారు. గ్రూప్1కు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. గ్రూప్2, గ్రూప్ 3 పరీక్షల మధ్య 2 నెలల గ్యాప్ ఉండాలన్నారు. జూలై డీఎస్సీ, ఆగస్టు 7,8న గ్రూప్ 2 పరీక్ష ఉందని ఒత్తిడితో సంగీత అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఏడాదిలోగా 2 లక్షలు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. డీఎస్సీ 25 వేల పోస్టులతో నిర్వహించాలన్నారు. కానీ 11 వేల పోస్టులను మాత్రమే ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలపై హరీష్ రావు మాట్లాడితే కాంగ్రెస్ నేతలు నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని వాపోయారు. ప్రతిపక్షాలపై ఆరోపణలు, బెదిరింపులకు పాల్పడితే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. తప్పుడు హామీలు, అబద్ధపు ప్రచారంతో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను రోడ్లమీదకు ఈడ్చిందన్నారు. ఏడాది పూర్తి కాకముందే కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హెూదా కల్పించాలి

- ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు



నవతెలంగాణ-ముషీరాబాద్

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హెూదా కల్పించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా వద్దగల మెనోనైట్ బ్రదరన్ బేతేలు చర్చిలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలు కమిటీ చైర్మెన్ డాక్టర్ గిరిధి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఎస్‌సి కార్పోరేషన్ చైర్మెన్ నాగరిగారి ప్రీతం, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్‌సి హెూదా కల్పించాలని సమావేశంలో తీర్మానించారు. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రధాని మోడీ దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు. ఏఐసిఎఫ్ సంస్థ గడచిన 28 సంవత్సరాలుగా దళిత - క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకై పాటుపడుతుందని తెలిపారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురికి అవార్డులతో సన్మానించారు. పాస్టర్ జోయెల్ గుమ్మడి ఆధ్యాత్మిక సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు డేవిడ్ కడారి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిషప్ శామ్యూల్ జాన్, డా. యస్. అబ్రహం, కళ్యాణి చొప్పల, బిషప్ యం. యస్. దయానంద్, జయశ్రీ , పాస్టర్ ప్రవీణ్ కుమార్, గ్రేస్ నిర్మల, మంగేశ్వరి, సోలమన్, నిత్యసుజాత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు కామ్రేడ్ అబ్దుల్ సత్తార్‌కు మాతృ వియోగం



నవతెలంగాణ-ధూల్‌పేట్

సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు, అవాజ్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ అబ్దుల్ సత్తార్ తల్లి ఖాదర్ (75) అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం ఉస్మానియా ఆస్పత్రిలో మృతి చెందారు. ఆమె బ్రతికి ఉన్నంత కాలం తన కొడుకు సత్తార్‌ని కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఆమె మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పార్టీ సౌత్ జిల్లా కమిటీ నాయకులు అన్నారు. వారి స్వగ్రామమైన కడప జిల్లా సీతంపేటలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని ఆమెకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మారేడుపల్లి తహసీల్దార్, గిర్దవర్, రికార్డు అసిస్టెంట్‌లు సస్పెండ్

- కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-ఓయూ

ఉద్యోగులు జవాబుదారి తనంతో పని చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగులకు చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. గురువారం మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్లక్ష్యం వహిస్తూ సక్రమంగా విధులు నిర్వహించని కారణంగా మారేడుపల్లి తహసీల్దార్ పద్మ సుందరి, గిర్దవర్ పి.ప్రసన్న లక్ష్మి, రికార్డ్ అసిస్టెంట్ ఎస్.రవిలను విధుల నుండి సస్పెండ్ చేశారు. కార్యాలయంలోని అన్ని రకాల రిజిస్టర్లలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ఎవరు ఎక్కడికి వెళ్లారని వాకబు చేశారు. ఇన్వర్డ్ రిజిస్టర్‌ను పరిశీలించి ప్రతి దరఖాస్తును ఇన్వర్డ్ చేసి దరఖాస్తుపై డేట్ స్టాంప్ వేసి సంబంధిత సెక్షన్‌కు అందజేయాలని ఆదేశించారు. సంబంధిత సెక్షన్లు బాధ్యతగా, జవాబుదారితనంగా పనిచేసి దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. విధులు, రికార్డులు సక్రమంగా నిర్వహించని ఉద్యోగులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయ స్థాయి, ప్రజావాణి, ప్రజా దర్బార్, లోకయుక్త, హ్యూమన్ రైట్ కమీషన్, కోర్టు కేసుల రిజిస్టర్ల నిర్వహణతో పాటు నివేదికలను నిర్దేశించిన లక్ష్యం లోగా డిస్పోస్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీల్లో ఆయన వెంట సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్ పాల్గొన్నారు.

బోనాల పండుగకు సీఎంకు ఆహ్వానం



నవతెలంగాణ-ధూల్‌పేట్-చాంద్రాయణగుట్ట

అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డినీ కోరారు. రానున్న ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మెన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా సత్కరించి, ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలో ఈ సారి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కన్నుల పండుగ జరిగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్లు పొటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ గౌడ్, ఆలే భాస్కర్ రాజ్ లతోపాటు ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, దినేష్, హంస్ రాజ్, కైలాస్, వెంకటేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న ప్యాంట్రీ కార్ కోచ్‌లో మంటలు..

- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది

నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆగిఉన్న ప్యాంట్రీ కార్ కోచ్‌లో మంటలు చెలరేగాయి. కోచ్ నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. కోచ్ నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. తెలిసిన వివరాల ప్రకారం గురువారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్యాంట్రీ కార్ కోచ్ వాషింగ్ కోసం మెట్టుగూడ వద్ద ఉన్న క్లీనింగ్ పిట్ యార్డుకు వెళ్లాయి. క్లీనింగ్ పూర్తయ్యాక 11 గంటల ప్రాంతంలో బోగీలను తిరిగి స్టేషన్ ప్లాట్ ఫ్లారం లోకి తరలించే క్రమంలో కోచ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు ఆ ప్రాంతమంతా కమ్ముకున్నాయి. ఒక్కసారిగా బోగీల నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు రైల్వే అధికారులకు, ఫైర్ స్టేషన్కు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన రైల్వే అధికారులు ఒక వైపు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇస్తూనే మరో వైపు స్టేషన్‌లో మంటలు ఆర్పే యంత్రాలతో తగలబడుతున్న బోగీలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అంటుకున్న బోగీలోని మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా రైల్వే సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్న సమయంలోనే ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్లు మంటలు అదుపులోకి తెచ్చాయి. రైలు బోగీలలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు బోగీలు దగ్ధం అయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్యాంట్రి కార్ కోచ్ కావడం వల్ల అందులో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా బోగీలలో అగ్ని ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఘటన స్థలాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ సందర్శించారు.

ఖైరతాబాద్ డీసీసీ జనరల్ సెక్రటరీ, మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్ లోధ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్ రెడ్డి నివాసంలో మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సిఎన్ రెడ్డి, ఇతరులతో కలిసి బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించారు.

నవతెలంగాణ-ధూల్ పేట్



ఇలా తినండి..

తులసిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి. తులసిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా శరీరాన్ని రక్షిస్తాయి. అసిడిటీ ఉన్నవారు ఉదయం ఖాళీ కడుపుతో తులసి ఆకులు నమిలితే తగ్గుతుంది. తులసి నీరు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.



తులసి ఆకులతో టీ తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఒత్తిడి తగ్గుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను నమలడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. బరువు తగ్గుతారు. జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. తులసి అనేక రుగ్మతలకు దివ్యౌషధంగా పనిచేస్తుంది. తులసి ఆకులు, పసుపు పొడి వేసి మరిగించిన నీటిని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

తులసిలో ఉండే యూజీనాల్ అనే సమ్మేళనం టైప్ 2 డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. తులసి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసిలో శరీరంలో మంటను తగ్గించే సమ్మేళనాలు ఉన్నాయి. ధమనుల వాపును తగ్గించడం ద్వారా, తులసి ఆరోగ్యకరమైన రక్త ప్రవాహాన్ని నిర్వహించడానికి, కొలెస్ట్రాల్ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. తులసి నీరు తాగడం వల్ల మలబద్ధకం, విరేచనాల సమస్యలు తగ్గుతాయి. ఇందులో ఉండే ఔషధ గుణాలు వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే జ్వరం త్వరగా తగ్గిస్తాయి. ■

అరుంధతీ రాయ్... ప్రసిద్ధ రచయిత్రి, ఉద్యమకారిణి అయిన ఈమె బుకర్ ప్రైజ్ పొందిన మొట్టమొదటి భారతీయురాలిగా చరిత్రకెక్కారు. నర్మదా బచావ్ ఉద్యోమంలో కీలకపాత్ర పోషించారు. మతోన్మాదులను తన రచనలతో చీల్చి చండాడుతున్నారు. అలాంటి వ్యక్తిని ఉపా చట్టం కింద అరెస్టు చేయాలంటూ ఆర్డర్లు జారీ చేశారు. ఇక్కడ విచిత్రం ఏమిటంటే 13 ఏండ్ల కిందట ఆమెపై పెట్టిన ఓ కేసును ఆధారం చేసుకొని ఇప్పుడు అరెస్టు చేయడం. ఇంతకీ ఆమెపై పెట్టిన ఆ కేసేంటి? ఇన్నేండ్ల తర్వాత ఆమెపై ఉపా చట్టం ఎందుకు ప్రయోగించారో ఈ రోజు మానవిలో తెలుసుకుందాం...





ప్రశ్నించడమే ఆమె నేరమా..?

అరుంధతి రాయ్ మేఘాలయలోని షిల్లాంగ్లో జన్మించారు. కేరళకు చెందిన యలయాళీ జాకోబైట్ సిరియస్ క్రైస్తవ మహిళా హక్కుల కార్యకర్త అయిన మేరీ రాయ్ ఈమె తల్లి. కోల్‌కతాకు చెందిన బెంగాలీ బ్రహ్మ సమాజి, టీ తోటల నిర్వాహకుడు రాజీబ్ ఈమె తండ్రి. తనను అందరూ బ్రహ్మణురాలు అంటే ఆమె తీవ్రంగా ఖండించేవారు. ఆమెకు రెండేండ్ల వయసు ఉన్నప్పుడు ఆమె తల్లిదండ్రులు విడిపోయారు. తర్వాత ఆమె తన సోదరుడితో కలిసి కేరళ వచ్చేశారు. కొంత కాలం వారి కుటుంబం మేరీ తల్లిదండ్రుల గడిపారు. కేరళ వచ్చిన తర్వాత మేరీ సొంతంగా పాఠశాల ప్రారంభించారు.

టెలివిజన్ జీవితం...

కొట్టాయంలోని కార్పస్ క్రిస్టీలో తన పాఠశాల విద్యను అభ్యసించారు. ఆ తర్వాత తమిళనాడులోని నీలగిరిలోని లారెన్స్ స్కూల్, లవ్‌డేల్‌లో చదివారు. ఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో ఆరికటెక్చర్ అభ్యసించారు. అక్కడ ఆర్కిటెక్ట్ గెరార్డ్‌ను డా కున్హాను కలిశారు. వారు 1978లో వివాహం చేసుకున్నారు. అయితే 1982లో వీరు విడిపోయారు. ఢిల్లీ వచ్చిన అరుంధతికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్‌లో స్థానం లభించింది. అక్కడే 1984లో ఆమెకు సినీ నిర్మాత ప్రదీప్ కిషన్‌తో పరిచయం ఏర్పడింది. అతనికి అవార్డు తెచ్చిపెట్టిన మస్సే సాహిబ్‌లో మేకల కాపరి పాత్ర కోసం ఆమెను అడిగారు. అదే ఏడాది వారిద్దరూ పెండ్లి చేసుకున్నారు. ఇద్దరూ కలిసి స్వాతంత్ర్య ఉద్యమం గురించి టెలివిజన్‌లో ధారావాహిక తీసుకొచ్చారు. అలాగే ఎలక్ట్రిక్ మూన్ అనే రెండు చిత్రాలకు పని చేశారు.



అనుభవాల ఆధారంగా...

1988లో ఇన్ విచ్ అన్నీ గివ్స్ ఇట్ దోస్ వోన్స్ చిత్రానికి ఆమె ఉత్తమ స్క్రీన్ ప్లే జాతీయ చలన చిత్ర అవార్డును అందుకున్నారు. ఆర్కిటెక్చర్ విద్యార్థిగా తన అనుభవాల ఆధారంగా రూపొందించిన చిత్రమిది. 1994లో పూలన్‌దేవి జీవితం ఆధారంగా తీసిన శేఖర్ కపూర్ చిత్రం బాండిట్ క్వీన్‌ను విమర్శించడంతో ఆమె అందరి దృష్టిని ఆకర్షించింది. అలాగే ది గ్రేట్ ఇండియన్ రేప్ ట్రిక్ అనే తన చలన చిత్ర సమీక్షలో ఆమె మహిళపై తన అనుమతి లేకుండా అనుభవించడం అనే హక్కును ప్రశ్నించారు. ఈ రెండు చిత్రాలు మహిళల జీవితాలను కించపరిచే విధంగా ఉన్నాయని వీటిని తప్పుగా చిత్రీకరించారని కపూర్‌ను ఆమె విమర్శించారు. ఇలాంటి చిత్ర పరిశ్రమపై విసుగుచెంది ఏరోబిక్స్ తరగతులు ప్రారంభించారు.

రచయిత్రిగా...

1992లో ఆమె తన మొదటి నవల రాయడం ప్రారంభించారు. దీన్ని 1996లో పూర్తి చేశారు. ఈ పుస్తకం సెమీ ఆత్మకథ. తన చిన్ననాటి అనుభవాల ఆధారంగా రాసింది. ఆమె ప్రచురించిన 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' అనే నవల ఆమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఇది 1997లో ఫిక్షన్ విభాగంలో బుకర్ ప్రైజ్ అందుకుంది. ది న్యూయార్క్ టైమ్స్ నోటబుల్ బుక్స్ ఆఫ్ ది ఇయర్‌లో ఒకటిగా గుర్తించబడింది. బెస్ట్ సెల్లర్స్ జాబితాలో నాల్గవ స్థానానికి చేరుకుంది. 18 దేశాల్లో ఈ పుస్తకం అమ్ముడు పోయింది. ఈ పుస్తకం విజయవంతం అయిన తర్వాత ఆమె టెలివిజన్‌కు 'ది బన్యన్ ట్రీ' అనే ధారావాహికతోపాటు 'ఎ ఫిల్మ్ విత్ అరుంధతీ రాయ్' అనే డాక్యుమెంటరీ రాశారు. 2007లో తన రెండవ నవల 'ది మినిస్ట్రీ ఆఫ్ అట్మోస్ట్ హ్యాపీనెస్' మొదలుపెట్టారు. 2016లో దీన్ని పెంగ్విన్ ఇండియా, హమీష్ హామిల్టన్ యూకే వారు ఈ పుస్తకాన్ని ప్రచురిస్తామన్నారు. ఈ నవల 2017లో మ్యాన్ బుకర్ ప్రైజ్‌కు ఎంపిక చేయబడింది. 2018లో ఫిక్షన్ కోసం నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డుకు ఫైనలిస్ట్‌గా ఎంపికయింది.

> మతోన్మాద విధాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా తనకు ఇచ్చిన పురస్కారాన్ని సైతం వెనక్కు ఇచ్చేసిన ధైర్యశాలి ఆమె. అందుకే ఆమెపై కేంద్రం కక్ష సాధింపుకు పాల్పడింది.

ఆజాదీ

ఆమె రచించిన ఆజాదీ పుస్తకం ఫ్రెంచ్ అనువాదానికి 45వ యూరోపియన్ ఎస్సే ప్రైజ్‌లో జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. యావత్ ప్రపంచం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను అరుంధతి తన కలం ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. ప్రపంచాన్ని భయకంపితుల్ని చేస్తున్న ఉగ్రవాదం, ఫాసిజం గురించి అది చేసే దాష్టీకాలను, మారణ హోమాన్ని ఈ పుస్తకంలో కండ్లకు కట్టినట్లు రాశారు. ఎందరో జీవితాలను ప్రభావితం చేసేలా ఇందులోని వ్యాసాలు ఉన్నాయి. అజాది అనే పేరు కూడా సరిగ్గా సరి పోయిందంటూ బహుమతి అందించిన ఫౌండేషన్ కితాబు ఇచ్చింది. ఎలాంటి కల్పితాలు లేకుండా వాస్తవాల ప్రాతిపదికన ప్రతింబించేలా ఉన్నాయని కూడా ప్రశంసించింది. అలాగే సమకాలీన రాజకీయాలు, సంస్కృతికి సంబంధించిన అనేక వ్యాసాలు కూడా ఆమె రాశారు. 2014లో పెంగ్విన్ ఇండియా ఐదు వాల్యూమ్స్‌గా తీసుకొచ్చారు. 2019లో హేమార్కెట్ బుక్స్ ప్రచురించిన మై సెడిషియస్ హార్ట్ అనే ఒకే సంపుటిలో నాన్ ఫిక్షన్ పుస్తకం తీసుకొచ్చారు.





అందుకే ఉపా చట్టం

నర్మదా డ్యామ్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా మేధా పాట్కర్‌తో కలిసి ప్రచారం చేశారు. తనకు ప్రైజ్‌గా వచ్చిన డబ్బును ఈ ఆందోళనకు విరాళంగా ఇచ్చారు. సామ్రాజ్యవాదం, పారిశ్రామికీకరణ, ఆర్థిక వృద్ధి పట్ల భారతదేశ విధాలను వ్యతిరేకిస్తూ ఆమె అనేక రచనలు చేశారు. అలాగే కాశ్మీరీ సమస్యపై కూడా 13 ఏండ్ల కిందట స్పందించారు. దాంతో ఆమెపై కేసు పెట్టి జైలుకు పంపారు. ఇప్పుడు ఉపా చట్టం ప్రయోగించారు. కార్పొరేట్లకు, వ్యాపారవేత్తలకు తప్ప సామాన్యులకు న్యాయం చేయని మోడీ ఎన్నికను ఆమె మొదటి నుండి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మతోన్మాద విధాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూనే ఉంటారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా తనకు ఇచ్చిన పురస్కారాన్ని సైతం వెనక్కు ఇచ్చేసిన ధైర్యశాలి ఆమె. అందుకే ఆమెపై కేంద్రం కక్ష సాధింపుకు పాల్పడుతున్నది. విచిత్రం ఏమిటంటే ఆమెపై వచ్చిన ఫిర్యాదు దాదాపు 13 ఏండ్ల కిందటిది. ఇప్పటికే బ్యాంకులకు కన్నాలు వేసి, కోట్లు కొల్లగొట్టిన బడా బాబులు, ఆర్థిక నేరస్థులకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రజల పక్షాన తన గొంతును వినిపిస్తూ, కలం ఝులిపిస్తున్న అరుంధతీ రాయ్‌ను మాత్రం అడ్డు కోవడం ఎంత వరకు సబబు అనేది బుద్ధి జీవులందరూ ఆలోచించాల్సిన విషయం. ■

అలా కుదరదు

పాట్నా : విద్య ఉద్యోగ రంగాల్లో బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ బీహార్ ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలను పాట్నా హైకోర్టు గురువారం రద్దు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా కులగణన చేపట్టిన నితీశ్ కుమార్ ప్రభుత్వం .. నివేదిక ఆధారంగా 50 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది.

రిజర్వేషన్ల సవరణ బిల్లు ప్రకారం.. ఇబిసిలకు 18 శాతం నుంచి 25 శాతం, బీసీలకు 12శాతం నుంచి 18 శాతం, ఎస్సీకి 16 శాతం నుంచి 20 శాతం, ఎస్టీ 1 శాతం నుంచి 2 శాతానికి పెంచింది. బీసీ మహిళలకు అప్పటివరకు ఉన్న 3 శాతం రిజర్వేషన్‌ను రద్దు చేశారు. ఇక, ఆర్థికంగా వెనకబడినవారిని ఉద్దేశించిన 10శాతం రిజర్వేషన్లు కలిపితే మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి.

ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ గౌరవ్ కుమార్, ఇతరులు పాట్నా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై సుదీర్ఘ విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి కె.వి. చంద్రన్‌తో కూడిన డివిజన్ బెంచ్ మార్చి 11, 2024న తీర్పును రిజర్వ్ చేసింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు 65 శాతం రిజర్వేషన్‌ను పెంచడంతో ప్రభుత్వ సర్వీసులో జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 35 శాతం పోస్టులు మాత్రమే ఇవ్వగలిగారని న్యాయవాది దినుకుమార్ కోర్టుకు తెలిపారు. జనరల్ కేటగిరీలో ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా బలహీన వర్గాలు)కి ఇచ్చిన 10 శాతం రిజర్వేషన్‌ను రద్దు చేయడం రాజ్యాంగంలోని సెక్షన్ 14, సెక్షన్ 15(6),(బి)కి విరుద్ధమని వాదించారు. కులగణన సర్వే అనంతరం దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. ఇందిరా సాహ్ని కేసులో రిజర్వేషన్ల పరిమితిపై సుప్రీంకోర్టు 50 శాతం పరిమితి విధించిందని తెలిపారు. ఈ కేసు ప్రస్తుతం విచారణలో ఉంది.

సింగరేణి విచ్ఛిన్నానికి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

అప్పగించాలని కోరారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన సన్నిహితుల కోసం.. 2021 కోల్‌బ్లాక్‌ల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనకుండా చేశారని విమర్శించారు. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని బొగ్గు బ్లాక్‌లనూ ఆ సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో గురువారం విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు. సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాక్‌లను ఆ సంస్థకే కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని శుక్రవారం కలిసి విన్నవిస్తామన్నారు. తెలంగాణలో అతిముఖ్యమైన ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణి భవిష్యత్‌లోనూ కొనసాగాలంటే కొత్త గనుల ఏర్పాటు తప్పనిసరి అన్నారు. ఈ గనులను వేలంపాట ద్వారా కాకుండా నేరుగా సంస్థకు కేటాయించాలని కోరారు. ఈ విషయంలో అఖిలపక్ష నేతలు ప్రధానమంత్రిని కలిసేందుకు కిషన్‌రెడ్డి ఏర్పాటు చేయాలన్నారు. తమ ప్రాంత గనులను తమకు ఇవ్వాలని అడిగేందుకు ఎలాంటి భేషజాలూ లేవన్నారు.

ఆ రెండు గనులను సింగరేణికి అప్పగించాలి

ఇటీవల వేలంలో పెట్టిన సత్తుపల్లి, కోయగూడెం ఓపెన్‌కాస్టు గనులను సింగరేణికి అప్పగించాలని భట్టి డిమాండ్ చేశారు. 2015లో మైన్స్ అండ్ మినరల్ యాక్ట్ చేసినప్పుడు మద్దతు ఇచ్చిన బీఆర్ఎస్.. ఇప్పుడు దానికి భిన్నంగా వేలం పాటలు నిర్వహించొద్దనడం 'దొంగే దొంగ' అని అరిచినట్టుగా ఉందన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఎంఎండీఆర్ యాక్ట్ ప్రకారం వేలం నిలుపుదలకు ప్రయత్నిస్తామన్నారు. 42వేల మంది ప్రత్యక్షంగా, 22వేల మంది పరోక్షంగా..మరో 50వేల మంది సంస్థ ఆధారంగా ఉపాధి పొందుతున్నారని వివరించారు. అటువంటి సింగరేణి సంస్థను కాపాడాలని యూనియన్లు లేఖ ఇచ్చాయని తెలిపారు. కిషన్‌రెడ్డి, మోడీ రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిర్ణీత గడువులో కోయగూడెం, సత్తుపల్లి ఓసీల వేలం పూర్తి చేయలేదు కాబట్టి నాటి 5శాతానికి ఇంకో 0.5 శాతం ఇస్తాం.. వాటిని సింగరేణికే ఇవ్వాలని అడుగుతామన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి విధ్వంసం

బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి విధ్వంసం జరిగిందని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. 2015లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మైన్స్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ యాక్ట్‌కు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు తమకు సన్నిహితమైన అరబిందో, ఆరో, అవంతిక, ప్రతీమ వంటి సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు కేసీఆర్ ప్రయత్నించారని ఆరోపించారు. వేలంలో పాల్గొనేందుకు కేసీఆర్ అనుమతివ్వకపోవడం వల్లే సత్తుపల్లి, కోయగూడెం ఓసీలు సింగరేణికి దక్కలేదని ఆరోపించారు. ఈ కంపెనీల ద్వారా బీజేపీకి ఎన్నికల బాండ్స్ రూపంలో లబ్ది చేకూరిందన్నారు. సింగరేణి సంస్థ, ఆస్తులు, కొత్తగనులను కాపాడుకోవడం కోసం తాము పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ బొగ్గు గనుల శాఖమంత్రిని కలిశామని, ప్రస్తుత మంత్రిని కూడా కలుస్తామని చెప్పారు. అవసరమైతే ప్రధానినీ కలిసేందుకు సిద్ధమన్నారు.

సింగరేణి సంసిద్ధంగా లేకుంటేనే వేలం వేయాలి: మంత్రి తుమ్మల

సింగరేణి సంసిద్ధత వ్యక్తం చేయకపోతేనే బొగ్గు గనులను వేలం వేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 2016లో ఒడిషా ప్రభుత్వ నైన్‌పి కంపెనీకి అప్పగించినట్టుగానే సింగరేణికి గనులను అప్పగించాలన్నారు. సింగరేణిని విచ్ఛిన్నం చేయాలనే బీజేపీ, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయన్నారు.

ఉద్యోగులను తగ్గించిన కేసీఆర్ : కూనంనేని

తెలంగాణ రాక ముందు లక్ష మందికి పైగా సంస్థలో ఉద్యోగులు ఉంటే.. రాష్ట్రం వచ్చాక 42వేలకు కేసీఆర్ తగ్గించారని కొత్తగూడెం ఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఆనాడు మైనింగ్ బిల్లును సమర్థించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. సింగరేణి పరిరక్షణకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ భ్రష్టు పట్టింది

న్యూఢిల్లీ: దేశంలో విద్యావ్యవస్థను బీజేపీ, ఆర్ఎస్ఎస్ భ్రష్టు పట్టించాయని రాహుల్ గాంధీ మోడీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. విద్యాసంస్థలను ఆ రెండూ హైజాక్ చేశాయని అన్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గాంధీ పలు అంశాలను ప్రస్తావించారు. "భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా... దేశంలో నాన్‌స్టాప్ పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని చాలా మంది విద్యార్థులు ఫిర్యాదు చేశారు. మీ అందరికీ తెలిసినట్టుగా నీట్, యూజీసీ నెట్..2024 లీక్ అయ్యాయి. అందులో ఒకదాన్ని మాత్రమే కేంద్రం రద్దు చేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని మోడీ జీ ఆపారని చెబుతున్నారు. అది నిజమా కాదా అన్నది అలా ఉంచితే... దేశంలో పేపర్ లీకేజీలను మాత్రం మోడీ ఆపలేకపోతున్నారు" అని రాహుల్ ఘాటుగా విమర్శించారు. పదేండ్ల మోడీ పాలనలో ఉపాధి కరువైంది. ఉద్యోగాల్లేవు. పోటీ పరీక్షలు ఇలా లీకులతో రద్దవుతుంటే.. ఓడిపోయేది విద్యార్థులేనని ఆందోళన వ్యక్తం చేశారు. నెలలు, ఏండ్లపాటు ప్రిపేరై పరీక్ష రాస్తే.. భావితరాల భవిష్యత్తుతో ఈ ప్రభుత్వం ఆడుకుంటోందని అన్నారు. "మధ్యప్రదేశ్‌లో వ్యాపం స్కాం జరిగింది. ఇపుడు దేశమంతా లీకులు విస్తరించాయి. విద్యాసంస్థల హైజాకింగ్ జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ చేతుల్లో విద్యావ్యవస్థ బందీ అయ్యింది. విద్య కాషాయికరణను మోడీ జీ మరింత సులభతరం చేశారు. అవకతవకలపై విచారణ కొనసాగుతోంది. ఇపుడు ఒక పరీక్షను రద్దు చేశారు. మరొకటి రద్దు చేస్తారో లేదో తెలియదు" అని రాహుల్ గాంధీ అన్నారు. లీకులు, రద్దుకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతారా..? అని అడిగిన ప్రశ్నకు, "అవును, మేం దీన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తాం " అని గాంధీ చెప్పారు.

కేజ్రీవాల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ కోర్టు రూ. లక్ష పూచీకత్తులో బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన నేడు విడుదల కానున్నారు. మరోపక్క 48 గంటల పాటు బెయిల్ ఆర్డరును నిలిపివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తోసిపుచ్చింది. బెయిల్ పిటిషన్‌కు సంబంధించి గురువారం ఉదయానికి తీర్పు రిజర్వ్ చేసిన రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు.. అదేరోజు సాయంత్రం బెయిల్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ బెయిల్ బాండ్‌పై సంతకం చేసేందుకు వీలుగా 48 గంటలపాటు స్టే విధించాలని ఈడీ న్యాయస్థానాన్ని కోరింది. తద్వారా ఈ తీర్పును పై కోర్టులో సవాలు చేసేందుకు వీలు కలుగుతుందని విజ్ఞప్తి చేసింది. కానీ వీరి వాదనను కోర్టు నిరాకరించింది. ఈ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

సత్యమేవ జయతే.. అతిషీ

కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరుపై ఆప్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ క్యాంప్‌లో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీ సత్యమే గెలిచిందన్నారు. సత్యానికి కొన్నిసార్లు ఇబ్బందులు రావొచ్చేమో గానీ.. ఓటమి మాత్రం ఉండదని తెలిపారు.

24 గంటల్లో 17 మంది మృతి

న్యూఢిల్లీ : ఢిల్లీలో అధిక ఉష్ణోగ్రతలు ప్రజల్ని బెంబేలేత్తిస్తున్నాయి. వడగాల్పులకు గత 24 గంటల్లో 17 మంది మృతి చెందినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. అలాగే వడదెబ్బ తగిలి ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోందని చెప్పారు. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో వడదెబ్బ సంబంధిత సమస్యలతో 33 మంది చేరినట్లు అధికారులు తెలిపారు. వీరిలో గత 24 గంటల్లో 13 మంది మరణించినట్లు తెలిపారు. అలాగే రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో 22 మంది చేరారు. వీరిలో గత 24 గంటల్లో నలుగురు మరణించారు. మిగిలిన ఆసుపత్రుల్లో కూడా వడదెబ్బ బాధితులు గణనీయంగా చేరుతున్నారని అధికారులు తెలిపారు. ఢిల్లీతో పాటు ఉత్తర భారతంలో అనేక ప్రాంతాల్లో గత కొన్ని రోజుల నుంచి వేడి గాలులు వీస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఢిల్లీలో గురువారం ఉదయం వర్షం కురియడంతో కాస్త ఉపశమనం లభించింది.

ఎన్టీఏను రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ నివాసం ఎదుట ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సర్వకళాశాల ఎదుట నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై పోలీసులు దారుణంగా దాడి చేశారు. యూపీతో పాటు బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లోనూ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

మంత్రివర్గంలో మా సమస్యలు చర్చించండి

- రవాణామంత్రికి టీఎస్ఆర్టీసీ ఈయూ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ విలీనం, కార్మికుల సమస్యల పరిష్కారాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకొని, అమలు చేయాలని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. శనివారం ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈయూ రాష్ట్ర కమిటీ తరఫున ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న గురువారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీలో యూనియన్ల కార్యకలాపాలను పునరుద్ధరించాలనీ, ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పూర్తిచేయాలని, కార్మికులకు రావల్సిన పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలు అందచేయాలని కోరారు.

చెంచు మహిళపై పాశవిక దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఇష్టానుసారంగా కొట్టారు. స్పృహ తప్పి పడిపోయినా కనికరం లేని నీచులు తమ ఇంట్లోనే ఎలాంటి వైద్యం లేకుండా పది రోజులు బంధించారు. బయటికి చెబితే.. కాల్చేస్తామని బెదిరించారు. ఈ అమానుష ఘటన నల్లమల అటవీ ప్రాంతంలో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. మొలచింతలపల్లి చెంచు పెంటకు చెందిన కాట్రావత్ ఈశ్వరమ్మపై బండి వెంకటేశ్వర్లు, అతని భార్య శివమ్మ, తమ్ముడు శివ కలిసి దాడి చేసి బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి చెంచు పెంటకు చెందిన కాట్రావత్ ఈశ్వరమ్మ- భర్త ఈదన్న. వారికి ముగ్గురు సంతానం. పది రోజుల కిందట భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో భార్య ఈశ్వరమ్మ పుట్టినిల్లైన సుక్కాపూర్‌కు పోయి తలదాచుకుంది. అయితే, ఆమె భర్త ఈదన్న భార్య గురించి గ్రామంలో తెలిసిన వారిని అడిగాడు. జాడ తెలియకపోవడంతో ఈ విషయాన్ని తమ పొలాన్ని కౌలుకు చేస్తున్న బండి వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి చెప్పాడు. దాంతో వెంకటేశ్వర్లు, అతని భార్య శివమ్మ, తమ్ముడు శివ కలిసి ఈశ్వరమ్మ ఎక్కడుందో తెలుసుకున్నారు. సుక్కాపూర్ వెళ్లి ఆమెను తీసుకొచ్చారు. మార్గ మధ్యలోనే కొట్టి చిత్రహింసలు పెట్టారు. తర్వాత వెంకటేశ్వర్లు ఇంట్లో బంధించారు. కాళ్లు, చేతులు కట్టేసి పచ్చి మిర్చి కారాన్ని కండ్లల్లో, మర్మాంగాలపై పెట్టారు. బట్టలు ఊడదీసి ప్రయివేటు భాగాలపై డీజిల్ పోశారు. కట్టెకు బట్ట చుట్టి నిప్పంటించి తొడలు, మర్మాంగాలపై కాల్చారు. ఎంత రోధించినా వారు పట్టించుకోలేదు.

ఈశ్వరమ్మ భర్త అడ్డు వస్తే.. అతనిపై కర్రతో దాడి చేసి అక్కడి నుంచి తరిమివేశారు. తొడలు, వీపు వాచిపోయాయి. దాడి విషయం బయటికి పొక్కకుండా పది రోజులు ఇంట్లోనే నిర్బంధించారు. కనీసం చికిత్స కూడా చేయించలేదు. భర్త ఊళ్లో వారిని ఆరా తీసే క్రమంలో ఈ విషయం బయటపడింది. బుధవారం ప్రజా సంఘాలకు తెలిసి ఆందోళనకు పూనుకోగా, బాధితురాలిని కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అయితే, సదరు నిందితులు చెంచు దంపతుల భూమిని కౌలుకు చేసుకుంటూ వారిని తమ వద్ద పనికి పెట్టుకున్నారని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు బుధవారం సాయంత్రం గ్రామానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఆర్.శ్రీనివాసులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

చెంచు మహిళపై దాడి అమానుషం. మహిళను వివస్త్రను చేసి డీజిల్ పోసి కాల్చడం అమానవీయం. ఈ దాడి సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. పోలీసులు వెంటనే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

విచారణ చేస్తున్నాం.. దోషులను శిక్షిస్తాం : బుర్రి శ్రీనివాసులు- డీఎస్పీ, కొల్లాపూర్

మొలచింతలపల్లి గ్రామంలో జరిగిన అమానవీయ ఘటన పట్ల చింతిస్తున్నాం. ఇందుకు కారకులైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలం. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి రెండ్రోజుల్లోనే వారిని పట్టుకుంటాం. బాధితురాలికి ఆస్పత్రిలో చికిత్స నడుస్తోంది. ఈ కేసు విషయంలో ఎవరికి ఎటువంటి అనుమానమూ అవసరం లేదు.

దోషులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చెంచు గిరిజన మహిళను చిత్రహింసలు పెట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం ధర్మానాయక్ ఆర్.శ్రీరామ్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజక వర్గం మూలచింతలపల్లి చెంచుగూడెంలో చెంచు ఈశ్వరమ్మపై బండి వెంకటేశం, శివ, సలేశ్వరం అత్యంత పాశవికంగా దాడి చేశారని వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడటమే కాక, అతి దారుణంగా వ్యవహరించారనీ, డీజిల్ పోసి హత్య యత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. పది రోజులపాటు నిర్బంధించి విపరీతంగా చిత్రహింసలు పెట్టారని తెలిపారు. ఆమె పొలాన్ని కౌలుకు తీసుకుని తమతోటే వెట్టి చాకిరి చేయించుకున్నారని పేర్కొన్నారు.తమకు బానిసగా ఉండలేదన్న కక్షతో ఈ దారుణానికి ఒడిగట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక అధికారులు స్పందించి ఆ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలనీ, మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

నవచిత్రం



హ్యాట్రిక్ సక్సెస్

దాదాపు 5 దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమకి, బసవ తారకం కేన్సర్ హాస్పిటల్ అధ్యక్షులుగా సేవలందిస్తూ, హిందూపురం నుంచి మూడసారి ఎం.ఎల్.ఏగా విజయం సాధించిన నందమూరి బాలకృష్ణని తెలుగు చలనచిత్ర నిర్మాత మండలి అధ్యక్షులు కె.ఎల్. దామోదర్ ప్రసాద్, కార్యదర్శి టి.ప్రసన్న కుమార్, ఈసీ మెంబర్ వి.వెంకటరమణ రెడ్డి (దిల్ రాజు), తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి అధ్యక్షులు, కార్యదర్శి కోశాధికారితోపాటు తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కె. అనుపమ్ రెడ్డి, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి తదితరులు పుష్పగుచ్చాలతో అభినందించారు.

ఏపీలో సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం..

ఇదిలా ఉంటే, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సమావేశం ఈనెల 26వ తేదీన విజయవాడలో జరుగనుంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి చెందే దిశగా ఈ సమావేశం కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెచ్ఆర్‌డి, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతున్నట్టు వాణిజ్య మండలి కార్యవర్గం తెలిపింది.

కల్కి అద్భుతం : అమితాబ్ బచ్చన్



ప్రభాస్ నటించిన తాజా చిత్రం 'కల్కి 2898 ఎడి', నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనె, దిశా పటానీ నటించారు. వైజయంతీ మూవీస్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ముంబయిలో గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో హీరో రానా దగ్గుబాటి ఇంటరాక్షన్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది.

అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో పార్ట్ అవ్వడం గ్రేట్ హానర్. ఇది ఓ కొత్త ప్రపంచం. ఇలాంటి సినిమా గతంలో ఎప్పుడూ చేయలేదు. నాగి ఈ కథ చెప్పినపుడు చాలా ఆశ్చర్యపోయాను. ఇందులో ఉన్న విజువల్స్ మహా అద్భుతం' అని తెలిపారు. 'నాగ్ అశ్విన్ మా గురువు బాలచందర్‌లా ఆర్డీనరిగా కనిపించే ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్. తన ఐడియాని అద్భుతంగా ప్రజెంట్ చేసే నేర్పు నాగ్ అశ్విన్‌కి ఉంది. ఇందులో బ్యాడ్ మ్యాన్‌గా ప్లే చేస్తా' అని కమల్ హాసన్ చెప్పారు.

ప్రభాస్ మాట్లాడుతూ,'గ్రేటెస్ట్ లెజెండ్స్‌తో వర్క్ చేసే అవకాశం ఇచ్చిన దత్తు, నాగీకి థ్యాంక్స్. దీపికతో నటించడం బ్యూటీఫుల్ ఎక్స్‌పీరియన్స్' అని తెలిపారు. 'కల్కి.. కంప్లీట్ న్యూ వరల్డ్. డైరెక్టర్ నాగి క్రియేట్ చేసిన మ్యాజిక్ ఇది. యాక్టర్‌గా, ప్రొఫెషనల్‌గా ఇది అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్' అని దీపికా పదుకొనే చెప్పారు. నిర్మాత అశ్విని దత్ మాట్లాడుతూ,'అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక సమక్షంలో ఈ ఈవెంట్ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా గ్రేట్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.



మాస్ ఎంటర్‌టైనర్

బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ పై రవి శంకర్, నవీన్ యెర్నేని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ టిజి విశ్వ ప్రసాద్ సంయుక్తంగా ఓ స్ట్రెయిట్ హిందీ సినిమాని నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కబోయే ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో కోర్ టీమ్, ప్రత్యేక అతిథులతో గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది.

సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించనున్నారు. మాస్ ఫీస్ట్ లోడింగ్ అనేది ఈ మూవీకి క్యాప్షన్. ఈనెల 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి సంగీతం: థమన్ ఎస్, డీవోపీ: రిషి పంజాబీ, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, యాక్షన్ కొరియోగ్రాఫర్: అన్ల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్, డైలాగ్స్: సౌరభ్ గుప్తా.

భిన్న కథతో ది కానిస్టేబుల్



వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా, ఆర్యన్ సుభాన్ ఎస్‌కె దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ నిర్మిస్తున్న చిత్రం 'ది కానిస్టేబుల్'. ఈ చిత్రంతో మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయం కానున్నారు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యింది.

ఈ సందర్భంగా హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సినిమా షూటింగ్ అంతా చాలా హాయిగా సాగింది. కానిస్టేబుల్ పాత్రలో కొత్త కోణంలో, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను' అని చెప్పారు.

"కథ, కథనాలు అద్భుతంగా అమరిన చిత్రమిది. పోలీస్ పాత్రలో వరుణ్ సందేశ్ ఆకట్టుకుంటారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి' అని నిర్మాత బలగం జగదీష్ అన్నారు.

దర్శకుడు ఆర్యన్ సుభాన్ మాట్లాడుతూ, 'సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూడవచ్చు. త్వరలో పాటలను, మోషన్ పోస్టర్‌ను విడుదల చేస్తాం' అని తెలిపారు.

దువ్వాసి మోహన్, సూర్య, రవి వర్మ, మురళీధర్ గౌడ్, బలగం జగదీష్, ప్రభావతి, కల్పలత, నిత్య శ్రీ, శ్రీ భవ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: హజరత్ షేక్ (వలి), సంగీతం :సుభాష్ ఆనంద్, ఎడిటింగ్: వర ప్రసాద్, మాటలు :శ్రీనివాస్ తేజ, పాటలు: రామారావు, శ్రీనివాస్ తేజ, సహనిర్మాత: బి నికిత జగదీష్, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : ఆర్యన్ సుభాన్ ఎస్‌కె.



సర్‌ప్రైజ్ చేసే యూనిక్ థ్రిల్లర్

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో రూపొందిన రేసీ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై అజ్మల్ ఖాన్, రేయా హరి ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ని హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, 'ఈ కథ విన్న వెంటనే చాలా బావుందనిపించింది. స్క్రిప్ట్ కోసం ప్యాషన్‌గా పని చేసిన నిర్మాతలని నేను ఇప్పటిదాక చూడలేదు. సినిమాకి కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు. ఈ సినిమాతో తెలుగులోకి వస్తున్నారు. ఖచ్చితంగా మంచి విజయం అందుకుంటారు. ఈ థ్రిల్లర్ ఖచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తుంది. కథ, స్క్రీన్ ప్లే, యాక్షన్, యాక్టింగ్ అన్నీ అద్భుతంగా ఉంటాయి. నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది' అని తెలిపారు. 'ఇదొక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇందులో ఒక యూనిక్ పాయింట్ ఉంది. అది మిమల్ని సర్‌ప్రైజ్ చేస్తుంది. టీజర్‌లో చూసిన ఎగ్జైట్‌మెంట్ సినిమాలోనూ ఉంటుంది' అని డైరెక్టర్ లోకేశ్ అజ్ల్స్ చెప్పారు.

నిర్మాత రేయా హరి మాట్లాడుతూ, 'ఇది తెలుగులో నా మొదటి సినిమా. నవీన్ చాలా అద్భుతమైన యాక్టర్. ఈ సినిమాలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

'ఇది మా మూడో సినిమా. తొలి రెండు సినిమాలు బాక్సాఫీసు హిట్స్ అయ్యాయి. అవుట్ అండ్ అవుట్ యంగేజింగ్‌గా ఉంటూ అందరికీ నచ్చుతుంది' అని మరో నిర్మాత నిర్మాత అక్బర్ అన్నారు.

దేవ్‌గిల్ హీరోగా అహో విక్రమార్క

దేవ్ గిల్ నేతృత్వంలో దేవ్‌గిల్ ప్రొడక్షన్స్ నుంచి "అహో విక్రమార్క' అనే తొలి ప్రాజెక్ట్ రాబోతోంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు.

టీజర్ లాంచ్ ఈవెంట్‌లో దేవ్‌గిల్ మాట్లాడుతూ,'రాజమౌళి 'మగధీర'తో తెలుగు పరిశ్రమలో నాకు మంచి పేరు ఇచ్చారు. రమా నాకు తల్లిలా సపోర్ట్ ఇచ్చారు. వారి వల్లే ఈ రోజు హీరోగా చిత్రాన్ని తీశాను. నన్ను ఇంత వరకు విలన్‌గా చూశారు. కానీ ఈ సినిమాతో మీ అందరికీ సర్‌ప్రైజ్ ఇవ్వ బోతోన్నాను. త్రికోటికి చాలా పెద్ద విజన్ ఉంది. మా టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. త్వరలోనే పాటలు కూడా రిలీజ్ చేస్తాం' అని తెలిపారు.



చిత్రా శుక్లా, దేవ్‌గిల్

'మా కల నెరవేరబోతోంది. మా ప్రొడక్షన్ నుంచి వస్తున్న మొదటి చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. టెక్నికల్‌గా ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది' అని నిర్మాత, దేవ్‌గిల్ భార్య ఆర్తి చెప్పారు.

దర్శకుడు పేట త్రికోటి మాట్లాడుతూ, 'మగధీర నుంచి దేవ్‌గిల్‌తో పరిచయం ఏర్పడింది. హీరోగా ఓ సినిమా చేద్దామని ఆయన చెబుతూనే ఉండేవారు. పోలీస్ కథతో ఈ సినిమాని స్టార్ట్ చేశాం. తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి షూటింగ్ చేశాం. సినిమా తప్పకుండా అలరిస్తుంది' అని అన్నారు.

'ఈ సినిమాలో చాలా స్ట్రాంగ్ కంటెంట్ ఉంది. ఇలాంటి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందంగా ఉంది' అని హీరోయిన్ చిత్రా శుక్లా చెప్పారు.

మెప్పించే పద్మవ్యూహంలో చక్రధారి

వి.సి క్రియేషన్స్ బ్యానర్ పై సంజయ్‌రెడ్డి బంగారపు దర్శకత్వంలో కే.ఓ.రామరాజు నిర్మిస్తున్న చిత్రం 'పద్మ వ్యూహంలో చక్రధారి'. ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా, శశికా టిక్కూ, అషురెడ్డి హీరోయిన్స్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకని రాయచోటిలో ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలో మూవీ కాస్ట్ అండ్ క్రూతో పాటు జబర్దస్త్ నటీనటులు వినోదిని, పంచు ప్రసాద్, నాగిరెడ్డి, ఫణి, ఉప్పల్ బాలు, శాన్వి, సత్తి, రేలారే రేలా గోపాల్ పాల్గొన్నారు. వీరితో పాటు రాయచోటిలో ఉన్న ప్రముఖ డాక్టర్లు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

'రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది. అలాగే తెలుగు ఇండస్ట్రీలో రాయచోటి నుంచి ఇద్దరు హీరోలు ఉన్నారు. యూత్‌ఫుల్ సినిమాలతో అలరించే కిరణ్ అబ్బవరం, అలాగే ఈ సినిమా హీరో ప్రవీణ్‌రాజ్‌కుమార్ కూడా ఇదే ప్రాంతం వాడు అయినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రవీణ్ రాజ్‌కుమార్ సైతం కిరణ్ అబ్బవరం అంత గొప్ప



పేరు తెచ్చుకుంటాడని ఆశిస్తున్నాం' అని ఈ వేడుకకు విచ్చేసిన డాక్టర్లు అన్నారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'భిన్న కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేడు (శుక్రవారం) విడుదలయ్యే మా చిత్రాన్ని ప్రేక్షకులందరూ చూసి ఆదరించాలని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

ఆటలు

బుమ్రా, సూర్య షో

- చెలరేగిన సూర్య, విజృంభించిన బుమ్రా
- అఫ్గనిస్థాన్‌పై భారత్ ఘన విజయం
- ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్

భారత్ 181/8, అఫ్గనిస్థాన్ 134/10


ఐసీసీ టీ20 ప్రపంచకప్ సూపర్8 రేసును టీమ్ ఇండియా విజయంతో ఆరంభించింది. మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్ (53) అర్థ సెంచరీతో చెలరేగగా.. ధనాధన్ హిట్టర్లు రిషబ్ పంత్, హార్దిక్ పాండ్య మెరవటంతో తొలుత భారత్ 181 పరుగులు చేసింది. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా (3/7) నిప్పులు చెరగటంతో ఛేదనలో అఫ్గాన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. భారత్ 47 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

అఫ్గనిస్థాన్‌ను భారత్ చిత్తు చేసింది. సూపర్8 పోరులో సూపర్ షోతో ఓ విజయం ఖాతాలో వేసుకుంది. 182 పరుగుల ఛేదనలో అఫ్గనిస్థాన్ చేతులెత్తేసింది. జస్‌ప్రీత్ బుమ్రా (3/7) నిప్పులు చెరుగగా.. అర్ష్‌దీప్ సింగ్ (2/35), కుల్దీప్ యాదవ్ (2/32) మ్యాజిక్ చేశారు. 20 ఓవర్లలో అఫ్గాన్ 134 పరుగులకు కుప్పకూలింది. ఆ జట్టులో అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (26), నజీబుల్లా జద్రాన్ (19), గుల్బాదిన్ నయిబ్ (17) మినహా ఎవరూ చెప్పుకోదగిన ప్రదర్శన చేయలేదు. తొలుత, పొట్టి ఫార్మాట్ సూపర్‌స్టార్ సూర్యకుమార్ యాదవ్ (53, 28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీతో చెలరేగాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్ సహజశైలికి కాస్త భిన్నంగా ఆడినా అర్థ సెంచరీతో టీమ్ ఇండియాను ఆదుకున్నాడు. వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య (32, 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా రిషబ్ పంత్ (20, 11 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. సూర్యకుమార్ యాదవ్‌కు తోడు హార్దిక్, పంత్‌లు మెరవటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 181 పరుగులు చేసింది.



ఆ ఇద్దరు విఫలం : సూపర్8 మ్యాచ్‌లో టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు కాస్త కష్టంగా సాగిన పిచ్‌పై భారత ఓపెనర్లు, సీనియర్ క్రికెటర్లు రోహిత్ శర్మ (8), విరాట్ కోహ్లి (24) విఫలమయ్యారు. పవర్‌ప్లేలోనే కెప్టెన్ రోహిత్ శర్మ నిష్క్రమించగా.. జట్టుకు అతడి అవసరం ఎక్కువగా ఉన్న తరుణంలో విరాట్ కోహ్లి నిరాశపరిచాడు. అఫ్గాన్ పేసర్ ఫరూకీ మరోసారి బ్రేక్ అందించాడు. పవర్‌ప్లేలో వికెట్‌తో అఫ్గాన్‌కు పైచేయి అందించాడు. పవర్‌ప్లేలో ఓ వికెట్ కోల్పోయిన భారత్ 47 పరుగులు చేసింది. రిషబ్ పంత్ (20, 11 బంతుల్లో 4 ఫోర్లు) పవర్‌ప్లేలో భారత్ గౌరవప్రద స్కోరు అందుకుంది. విలక్షణ షాట్లతో మెరిసిన రిషబ్ పంత్ యుఎస్‌ఏ లెగ్ ఫామ్ కొనసాగించాడు. కానీ పవర్‌ప్లే అనంతరం రషీద్‌ఖాన్‌పై స్విచ్ షాట్ ఆడబోయి వికెట్ల ముందు దొరికిపోయాడు. విరాట్ కోహ్లి సైతం రషీద్ ఖాన్ ఓవర్లోనే వికెట్ పారేసుకున్నాడు. దీంతో 62/3తో భారత్ కష్టాల్లో పడింది.



ఆదుకున్న సూర్యకుమార్ : లేటుగా ఫామ్ అందుకున్న సూర్యకుమార్ (53) అఫ్గనిస్థాన్‌పై ఆపద్బాంధవుడి ఇన్నింగ్స్ నమోదు చేశాడు. ఓ ఎండ్‌లో సహచర బ్యాటర్లు తడబాటుకు గురవుతున్న వేళ సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో పరుగులు పిండుకున్నాడు. ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లు బాదిన సూర్యకుమార్ యాదవ్ 27 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. యువ బ్యాటర్ శివం దూబె (10) దూకుడు చూపించినా వికెట్ నిలుపుకోలేదు. ఓ ఎండ్‌లో సూర్యకుమార్ దంచికొట్టగా.. మరోఎండ్ నుంచి వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య (32) మెప్పించాడు. విలువైన ఇన్నింగ్స్‌తో జట్టుకు మంచి స్కోరు అందించటంలో ముఖ్య భూమిక పోషించాడు. ఆఖర్లో రవీంద్ర జడేజా (7) ఆశించిన ప్రదర్శన చేయలేదు. అక్షర్ పటేల్ (12, 6 బంతుల్లో 2 ఫోర్లు) ఆకట్టుకున్నాడు. అఫ్గాన్ బౌలర్లలో ఫజల్‌హాక్ ఫరూకీ, రషీద్ ఖాన్ మూడేసి వికెట్లతో విజృంభించారు.

భారత్, బంగ్లా పోరు..ఉప్పల్ స్టేడియంలో!

టీ20 మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న హైదరాబాద్
బీసీసీఐ స్వదేశీ సీజన్ షెడ్యూల్ విడుదల



నవతెలంగాణ-హైదరాబాద్

తెలుగు క్రికెట్ అభిమానులకు మరో తీపి కబురు. టెస్టు మ్యాచ్, ఐపీఎల్ వినోదం ఆస్వాదించిన క్రికెట్ ప్రియులు ఈ ఏడాది మరో ధనాధన్ ధమాకా అందుకోనున్నారు!. భారత్, బంగ్లాదేశ్ టీ20 మ్యాచ్‌కు హైదరాబాద్ ఉప్పల్ క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం 2024-25 స్వదేశీ సీజన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో భారత స్వదేశీ సీజన్ ఆరంభం కానుంది. భారత పర్యటనకు రానున్న బంగ్లాదేశ్ ఇక్కడ రెండు టెస్టులు, మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. భారత్, బంగ్లాదేశ్ టెస్టులకు చెన్నై, కాన్పూర్ వేదిక కానున్నాయి. సెప్టెంబర్ 19-23 వరకు చెన్నై టెస్టు, సెప్టెంబర్ 27-అక్టోబర్ 1 వరకు కాన్పూర్ టెస్టు జరుగనున్నాయి. టీ20 సిరీస్‌కు వరుసగా ధర్మశాల, న్యూఢిల్లీ, హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అక్టోబర్ 12న హైదరాబాద్‌లో భారత్, బంగ్లాదేశ్ చివరి టీ20 మ్యాచ్‌లో ఢీకొట్టనున్నాయి. ఇక అక్టోబర్‌లో భారత్‌కు రానున్న న్యూజిలాండ్ మూడు టెస్టుల సిరీస్‌లో ఆడనుంది. బెంగళూర్, పుణె, ముంబయి కివీస్‌తో మూడు టెస్టులకు వేదికలుగా నిలువనున్నాయి. 2025లో ఇంగ్లాండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఇక్కడ ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. చెన్నై, కోల్‌కత, రాజ్‌కోట్, పుణె, ముంబయిలు టీ20 సిరీస్‌లో ఐదు మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనుండగా.. మూడు వన్డేలకు వరుసగా నాగ్‌పూర్, కటక్, అహ్మదాబాద్‌లు వేదికగా నిలువనున్నాయి.

ర్యాంకింగ్స్‌పై భారత ఆర్చర్ల గురి

2024 పారిస్ ఒలింపిక్స్‌అర్హతపై దీమా



న్యూఢిల్లీ : ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 3 పోటీలలో భారత రికర్వ్ ఆర్చర్లు పతకాలు సాధించడంలో విఫలమైనా పారిస్ ఒలింపిక్ బెర్తులను దాదాపుగా ఖాయం చేసుకున్నారు. మహిళల విభాగంలో దీపికా కుమారి, భజన్, అంకితాతో కూడిన త్రయం.. సెమీస్‌లో 4-5తో ఫ్రాన్స్ చేతిలో ఓటమిపాలైంది. కాంస్య పోరులో జపాన్.. 6-0తో భారత్‌కు పరాభవం తప్పలేదు. ఇక ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్‌తో కూడిన పురుషుల జట్టు సైతం క్వార్టర్స్‌లో 1-5తో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. కాగా రికర్వ్ ఆర్చర్ల నిరాశపరిచినా ఈనెల 25న విడుదల కాబోయే ర్యాంకింగ్స్‌ను బట్టి పారిస్ బెర్తులు నిర్ధారణ అవుతాయి. కొత్త నిబంధనల ప్రకారం.. ఒలింపిక్ బెర్తులు ఖాయం కాని జట్లలో టాప్-2 టీమ్స్‌కు కోటా దక్కుతుంది. పురుషుల ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో స్థానంలో ఉండగా మహిళల విభాగంలో 8వ స్థానంలో ఉంది. మహిళల కేటగిరీలో టాప్-7లో ఉన్న సౌత్ కొరియా, చైనా, జర్మనీ, ఫ్రాన్స్, మెక్సికో, యూఎస్‌ఏ, చైనీస్ తైపీ 'పారిస్'కు అర్హత సాధించగా మిగిలిన రెండు కోటాలలో భారత్‌కు అవకాశం దక్కనుంది.

సాల్ట్ చితక్కొట్టాడు

- ఛేదనలో ఫిల్ సాల్ట్ అజేయ అర్ధ సెంచరీ
- విండీస్‌పై ఇంగ్లాండ్ ఘన విజయం
- వెస్టిండీస్ 180/4, ఇంగ్లాండ్ 181/2


డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ దుమ్మురేపింది. గ్రూప్ దశలో అనూహ్య పరిస్థితులు ఎదుర్కొన్న ఇంగ్లాండ్ సూపర్8లో సూపర్ షో చేసింది. ఆతిథ్య వెస్టిండీస్‌ను చిత్తు చేసి సెమీఫైనల్ బెర్త్ దిశగా ఓ అడుగు ముందుకేసింది. ఫిల్ సాల్ట్ (87 నాటౌట్) ఛేదనలో అజేయ అర్ధ సెంచరీతో చెలరేగాడు. సాల్ట్ మెరుపులతో ఇంగ్లాండ్ అలవోక విజయం సాధించింది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన కరీబియన్లకు సూపర్8లో తొలి ఓటమి ఎదురైంది.

నవతెలంగాణ-గ్రాస్ఐలెట్

సూపర్8లో డిఫెండింగ్ చాంపియన్ మొదలెట్టింది. ఆతిథ్య వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో మెరుపు విజయం సాధించింది. 181 పరుగుల లక్ష్యాన్ని మరో 15 బంతులు మిగిలి ఉండగానే ఛేదించిన ఇంగ్లాండ్..సూపర్8లో తొలి విజయం ఖాతాలో వేసుకుంది. ఇంగ్లాండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ (87 నాటౌట్, 47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగగా.. జానీ బెయిర్‌స్టో (48 నాటౌట్, 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 180 పరుగులు చేసింది. జాన్సన్ ఛార్లెస్ (38, 34 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (36, 32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), రోవ్‌మాన్ పావెల్ (36, 17 బంతుల్లో 5 సిక్స్‌లు) సమిష్టిగా రాణించారు. ఛేదనలో అజేయ అర్థ సెంచరీ సాధించిన ఫిల్ సాల్ట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.



సాల్ట్ ధనాధన్ : 181 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ అదరగొట్టింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (87 నాటౌట్) సూపర్ ఫామ్ కొనసాగించాడు. కెప్టెన్ జోశ్ బట్లర్ (25)తో కలిసి అర్ధ సెంచరీ భాగస్వామ్యం నమోదు చేసిన ఫిల్ సాల్ట్ అదే జోరు ఆఖరు వరకు చూపించాడు. జోశ్ బట్లర్ రెండు ఫోర్లతో మెరిసినా.. వికెట్ నిలుపుకోలేదు. పవర్‌ప్లే అనంతరం బట్లర్ అవుటయ్యాడు. మోయిన్ అలీ (13) సైతం అంచనాలను అందుకోలేదు. ఈ దశలో జానీ బెయిర్‌స్టో (48 నాటౌట్) ఫిల్ సాల్ట్‌తో జత కలిశాడు. బెయిర్‌స్టో, సాల్ట్ జోడీ కరీబియన్ బౌలర్లను ఆటాడుకున్నారు. సాల్ట్ 38 బంతుల్లోనే నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో అర్ధ సెంచరీ సాధించాడు. హాఫ్ సెంచరీ అనంతరం సాల్ట్ టాప్ గేర్‌లోకి వెళ్లాడు. మరో మూడు సిక్సర్లు, మూడు ఫోర్లతో ధనాధన్ మోత మోగించాడు. మరో ఎండ్‌లో ప్రమాదకర హిట్టర్ బెయిర్‌స్టో సైతం ఏమాత్రం తగ్గలేదు. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 బంతుల్లోనే అజేయంగా 48 పరుగులు సాధించాడు. ఫిల్ సాల్ట్, బెయిర్‌స్టో జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 97 పరుగులు జోడించారు. దీంతో 17.3 ఓవర్లలోనే ఇంగ్లాండ్ లాంఛనం ముగించింది. 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వెస్టిండీస్ బౌలర్లలో రోమారియో షెఫర్డ్, రోస్టన్ ఛేజ్‌లు చెరో వికెట్ పడగొట్టారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- ప్రజా పాలనలో వారి సాధికారతకు పెద్దపీట
- డీఆర్‌డీవో అధికారులకు మంత్రి సీతక్క దిశానిర్దేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనీ, ప్రజాపాలనలో వారి సాధికారతకు పెద్ద పీట వేస్తామనీ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో జిల్లా డీఆర్‌డీవో, అదనపు డీఆర్‌డీవోలతో మహిళా శక్తి రాష్ట్ర స్థాయి కార్యాచరణ ప్రణాళిక తయారీపై సీతక్క సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామనీ, మహిళా ఉన్నతితోనే తెలంగాణ ప్రగతి సాధ్య పడుతుందని చెప్పారు. డిమాండ్ ఉన్న వ్యాపారాల్లో మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలకు, ప్రజల అవసరాలు, వనరుల లభ్యతకు తగ్గట్టుగా బిజినెస్ మోడల్ ఉండాలని సూచించారు. స్థానికంగా లభ్యమయ్యే వస్తువుల ఆధారంగా వ్యాపారం చేస్తే అద్భుతాలు సాదించగలమన్నారు. ఆధార్ కేంద్రాలు, మీ సేవ సెంటర్లు, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు, క్యాంటీన్లు, స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసేలా మహిళా సంఘాలకు రుణ సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. కొత్తగా ప్రారంభించబోయే మహిళా శక్తి క్యాంటీన్లలో రుచి, శుభ్రత బాగా వుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా శక్తి క్యాంటీన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారుల వెంట, రద్దీ ప్రాంతాల్లో మహిళా క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కల్తీ వల్ల బయట తినాలంటేనే ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. పాలను కూడా కల్తీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కల్తీ వస్తువులపైన అధికారులు, మహిళా సంఘాలు యుద్ధం చేయాలని పిలుపు నిచ్చారు. క్వాలిటీపై మహిళా శక్తి క్యాంటిన్లు రాజీ పడొద్దన్నారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో పల్లె రుచులను, ఇప్ప పువ్వు లడ్డులు, నన్నారి వంటి సాంప్రదాయిక పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌లను సకాలంలో అందించినట్టుగానే, అదే స్ఫూర్తితో మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. అక్షర జ్ఞానం అంతగా లేని గ్రామీణ మహిళలనూ ఆర్థికవేత్తలుగా మార్చే దిశలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలన పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఏర్పాటైందని గుర్తు చేశారు. దాన్ని మరింత పటిష్ట పరిచి సేవలను విస్తరించాలన్నారు.

వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి మహిళలకు విముక్తి కల్పించేందుకే.. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వమే అందజేస్తోందని ఆమె తెలిపారు. వచ్చే ఐదేండ్లలో మహిళా సంఘాలకు లక్ష కోట్ల రుణాలు అందిస్తామన్నారు.వాటి కోసం మంచి బిజినెస్ మోడళ్లను అధికారులు గుర్తించాలని సూచించారు. డీఆర్‌డీవోలు జిల్లాలో పర్యటించి మహిళా సంఘాల అనుభవాలు తెలుసుకోవాలన్నారు. అందుకోసం వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. మహిళలు ఇతరుల మీద ఆధారపడకుండా ఆర్థికంగా సొంత కాళ్ళ మీద నిలబడేలా తోడ్పాటు అందించాలన్నారు. వారు అభివృద్ధి చెందిన తర్వాత ప్రభుత్వాలకే రుణాలు ఇచ్చే స్థాయికి ఎదుగుతారని తెలిపారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయుతనిచ్చేందుకు కలెక్టర్లతో త్వరలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వాహిస్తామన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు భూ కేటాయింపులు మొదలుకుని..ప్రభుత్వ రాయితీల వరకు కలెక్టర్లు సహకరించాలని కోరారు. మహిళ బాగుంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందనీ, కుటుంబం సంతోషంగా ఉంటేనే సమాజం, రాష్ట్రం, దేశం బాగుంటాయని తెలిపారు. అన్ని సమస్యలకు ఆర్థిక సమస్యలే మూల కారణమనీ, వాటిని పారద్రోలేందుకు అధికారులు సన్నద్ధం కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా శక్తికి అధికారులే బ్రాండ్ అంబాసిడర్లన్నారు. ఆగస్టు 15న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫామ్ ఇచ్చేలా అధికారులు కార్యచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులకైనా, అధికారులకైనా ప్రజా సేవకు మించిన తృప్తి లేదన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఐఆర్‌డీ సీఈవో కాత్యాయనీ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో
34కు పెరిగిన కల్తీ సారా మృతులు





చెన్నై : విషపూరితమైన కల్తీ సారా తాగి తమిళనాడులో మరణించిన వారి సంఖ్య 34కి చేరుకుంది. వందమందికి పైగా వివిధ ఆస్పత్రుల్లో చేరారని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గురువారం నిర్ధారించారు. బుధవారం ఆరుగురు మృతి చెందగా గురువారానికి ఆ సంఖ్య 34కి పెరిగింది. స్థానికంగా దొరికే సారాలో ప్రాణాంతకమైన మిథనాల్‌ను కలిపి సేవించారని ముఖ్యమంత్రి స్టాలిన్ వెల్లడించారు. ఈ కల్తీ సారా వ్యవహారానికి సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఇటువంటి నేరపూరితమైన చర్యలు సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. దేశంలో అక్రమ సారాబట్టీల్లో తయారయ్యే ఈ కల్తీసారా ఏటా వందలాదిమంది ప్రాణాలను తీస్తోంది. మరింత మత్తు ఎక్కేందుకు తరచుగా మిథనాల్‌తో కలుపుతుంటారు. దీనివల్ల కళ్ళు మసకబారడం, లివర్ దెబ్బతినడం, మరణాలు వంటివి చోటు చేసుకుంటాయన్నారు. ఈ సంఘటనపై గవర్నర్ ఆర్.ఎన్.రవి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఇంకా చాలామంది మృత్యువుతో పోరాడుతున్నారని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్టుల్లో
మహిళా ఉద్యోగుల సంఖ్యను పెంచాలి



న్యూఢిల్లీ : విమానయాన సంస్థలు, విమానాశ్రయాల్లో మహిళా ఉద్యోగులను పెంచాల్సిందిగా పౌరవిమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆదేశించింది. 2025 నాటికి వివిధ స్థాయిల్లో 25 శాతం మహిళలు ఉండేలా చూడాలని పేర్కొంది. లింగ సమానత్వ దిశగా చర్యలు తీసుకోవాలన్న అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ (ఐసిఎఒ) ఆలోచనకు అనుగుణంగా ఈ ఆదేశాలను జారీ చేసినట్లు డిజిసిఎ తెలిపింది. గతేడాది డిజిసిఎ నియమించిన నలుగురు సభ్యుల కమిటీ భారత్‌లోని విమానయాన రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడానికి పలు సూచనలను రూపొందించింది. పని ప్రదేశంలో లింగ సమానత్వంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి వాటాదారులు వారి విధానాలు, నిబంధనలను మెరుగుపరచడానికి చేపట్టాల్సి చర్యలను సర్క్యులర్ వివరించింది. లైంగిక వేధింపులను చేపట్టడం, భిన్న లక్ష్యాలను గుర్తించడం వాటిని సాధించడం కోసం హెచ్ విధానాల్లో మార్పులు వంటి చర్యలు ఉన్నాయి. మహిళా ఉద్యోగుల పని విధానాల్లో మార్పులు చేయడం, మహిళల రోల్ మోడల్స్, లేదా పురోగతి సాధించిన వారిని హైలెట్ చేయడం, లింగబేధం లేని పని సంస్కృతిని ప్రోత్సహించడం వంటి చర్యలు చేపట్టాల్సి వుందని తెలిపింది.

డిజిసిఎ డేటా ప్రకారం.. దేశంలో 15 మంది మహిళా పైలెట్లు ఉన్నారు. ఇది ప్రపంచవ్యాప్త సగటు 5 శాతం కన్నా మూడు రెట్లు అధికం. గతేడాది డిజిసిఎ 1,622 వాణిజ్య పైలెట్ లైసెన్స్‌లు జారీ చేయగా వాటిలో 294 మంది మహిళలు ఉన్నారు. గతేడాదితో పోలిస్తే 22 శాతం పెరిగినట్లు తెలిపింది. డిజిసిఎలో శ్రామిక శక్తిలో 11 శాతం మహిళలు ఉన్నట్లు డిజిసిఎ హెడ్ విక్రమ్ దేవ్ గతంలో పేర్కొన్నారు. కరోనా సమయంలో మహిళలు ప్రాతినిథ్యం పెరిగేలా మెరుగ్గా నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. అయితే ఇంకా ముందుకు వెళ్లడానికి చాలా సమయం ఉందని అన్నారు. పితృస్వామ్య సమాజంలో ఉన్న పురుషుల మనస్తత్వ కొంత అడ్డంకిగా మారుతోందని, ఈ సమస్యను పరిష్కరించడం సవాలుగా నిలిచిందని అన్నారు.

గతేడాది భారత్‌లో ఇండిగో సంస్థ అత్యధికంగా మహిళా పైలెట్లను నియమించడం ప్రారంభించింది. ప్రపంచంలోనే అత్యధిక మహిళా పైలెట్లు ఉన్న సంస్థ తమదేనని ప్రకటించింది. తమ శ్రామిక శక్తిలో 44 శాతం మహిళలు ఉన్నట్లు తెలిపింది.

అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌లోకి
భారత వ్యోమగామి

- రోదసీ రంగంలో భారత్, అమెరికా
- సహకార విస్తరణ నాసా చీఫ్ వెల్లడి

వాషింగ్టన్ : రోదసీ రంగంలో భారత్‌తో సహకారాన్ని అమెరికా రోదసీ సంస్థ విస్తరిస్తుందని నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ చెప్పారు. అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌కు భారత వ్యోమగామిని తీసుకువెళ్ళడానికి సంయుక్తంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమెరికా, భారత్ జాతీయ భద్రతా సలహాదారులు జేక్ సులివాన్, అజిత్ దోవల్ సోమవారం ఐసెట్ డైలాగ్ చర్చలు జరిపిన నేపథ్యంలో ఇరు దేశాలు కలిపి ఫ్యాక్ట్ షీట్‌ను విడుదల చేశాయి. ఆ తర్వాత నెల్సన్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. అమెరికాలో ఇస్రో వ్యోమగాములకు మరింత అధునాతనమైన శిక్షణ ప్రారంభించే దిశగా తాము కృషి చేస్తున్నట్లు అజిత్ దోవల్ చెప్పారు. గతేడాది భారత్‌లో నెల్సన్ పర్యటించారు. మానవాళి ప్రయోజనాల కోసం కీలకమైన, కొత్తగా ఆవిర్భవించే సాంకేతికతలపై అమెరికా, భారత్ చొరవను మరింత ముందుకు తీసుకెళ్ళడానికి నాసా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇరు పక్షాలు కలిసి రోదసీ రంగంలో పరస్పరం సహకారాన్ని విస్తరించుకుంటాయని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అయితే ఐఎస్ఎస్‌కు భారత వ్యోమగామిని తీసుకెళ్ళే మిషన్‌కు సంబంధించి ఇంకా వివరాలన్నీ ఖరారు చేయాల్సి వుందన్నారు. భవిష్యత్తులో మానవాళి జీవితం మరింత మెరుగుపరిచేందుకు ఈ ప్రయత్నాలన్నీ ఉపకరిస్తాయన్నారు.

నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చూర్ రాడార్‌ను ప్రారంభించేందుకు కూడా ఇరు దేశాల రోదసీ సంస్థలు సిద్ధమవుతున్నాయని దోవల్, సులివాన్ చెప్పారు. కృత్రిమ మేథస్సు, సెమీ కండక్టర్, కీలకమైన ఖనిజాలు, అడ్వాన్స్‌డ్ టెలికమ్యూనికేషన్, రక్షణ, రోదసీ రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు చొరవలను కూడా ఇరువురు నేతలు చేపట్టారు.



వెయ్యిని దాటిన
హజ్ మృతుల సంఖ్య

రియాద్ : హజ్ యాత్రలో మృతుల సంఖ్య వెయ్యికి చేరినట్లు మీడియా గురువారం తెలిపింది. మృతుల్లో సగానికి పైగా అధిక వేడి, ఉక్కపోత కారణంగానే మరణించినట్లు వెల్లడించింది. గురువారం మరణించిన వారిలో 58 మంది ఈజిప్టియన్లు ఉన్నట్లు తెలిపింది. ఈ దేశానికి చెందిన మొత్తం 658 మంది మరణించారని సౌదీ అరేబియా దౌత్యవేత్త పేర్కొన్నారు. 630 మంది నమోదు కాలేదని అన్నారు. మృతుల్లో 68 మంది భారతీయులు కూడా ఉన్నారు.

హజ్ యాత్రలో సుమారు 1,081 మంది మరణించినట్లు పది దేశాలు నివేదించాయి. ఈ గణాంకాలు అధికారిక ప్రకటనలు లేదా ఆయా దేశాల దౌత్యవేత్తలు సమాచారమిచ్చినట్లు దౌత్యవేత్త పేర్కొన్నారు.

మక్కా మసీదులో ఈ వారం ప్రారంభంలో అత్యధికంగా 51.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు జాతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రాంతంలో ప్రతీ దశాబ్దానికి ఉష్ణోగ్రతలు 0.4 డిగ్రీలు పెరుగుతున్నట్లు గతనెలలో ప్రచురితమైన సౌదీ అధ్యయనం పేర్కొంది.

ఆరు టన్నుల బంగారం కొనుగోలు ..

యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీస్ విక్రయం



ముంబయి : విదేశీ నిల్వల నిర్వహణను విస్తృత పరచడంలో భాగంగా అంతర్జాతీయ సెంట్రల్ బ్యాంకులకు అనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల 6 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. బదులుగా ఈ ఏప్రిల్‌లో 7 బిలయన్ డాలర్ల విలువైన యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీస్‌లను (యుఎస్‌టి) విక్రయించింది. భారత్ ముఖ్యంగా ఆర్‌బిఐకి చెందిన యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీల విలువ ఏప్రిల్‌లో 7.1 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఇది నెలాఖరు నాటికి యుఎస్ ట్రెజరీ సెక్యూరిటీస్ ఎక్స్పోజర్ విలువ (యుఎస్‌టిఎస్) 233.5 బిలియన్లకు చేరుకున్నట్లు యుఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ సమాచారం పేర్కొంది.

భారత్ ఏప్రిల్‌లో సుమారు ఒక బిలియన్ డాలర్ల విలువైన యుఎస్‌టిలను కొనుగోలు చేసింది, అదే సమయంలో బంగారం స్టాక్ సుమారు 794 టన్నుల వద్ద ఉంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగేకొద్దీ డాలర్ వ్యతిరేక ఆస్తులను, బంగారాన్ని కూడబెడుతున్న ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర సెంట్రల్ బ్యాంకులకు అనుగుణంగా ఆర్‌బిఐ కూడా వ్యూహ రచన చేసినట్లు తెలుస్తోంది.

విదేశీ సెంట్రల్ బ్యాంకులు యుఎస్‌టిలకు తమ ఎక్స్పోజర్‌ను 30 బిలియన్ డాలర్లకు తగ్గించినట్లు యుఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన నివేదిక తెలుపుతోంది.

మరోవైపు, సెంట్రల్ బ్యాంకులు జనవరి మార్చి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 290 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయగా, ఈ త్రైమాసికంలో చైనా, టర్కిష్ సెంట్రల్ బ్యాంకులు అత్యధిక కొనుగోళ్లకు కారణమయ్యాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ సూచీ తెలిపింది.

2017 డిసెంబర్ నుండి రిజర్వ్ బ్యాంక్ మార్కెట్ నుండి క్రమం తప్పకుండా బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. అయితే ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల మధ్య గత రెండు సంవత్సరాలుగా కొనుగోళ్లను తీవ్రతరం చేసింది. ఈ ఏడాది జనవరి నుండి కొనుగోళ్లను మరింత వేగవంతం చేసింది. సెంట్రల బ్యాంక్ మేలో మరో మూడు టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఈ ఏడాది ఇప్పటివరకు క్యాలెండర్ సంవత్సరంలో 28 టన్నులకు చేరినట్లు తాజా సమాచారం తెలుపుతోంది. ద్రవ్యోల్బణం, విదేశీ నిల్వల ఇబ్బందులకు వ్యతిరేకంగా రక్షణగా, ప్రధానంగా విదేశీ కరెన్సీ ఆస్తుల బేస్‌కు భిన్నంగా బంగారాన్ని రిజర్వ్ చేయడం సెంట్రల్ బ్యాంక్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. బంగారం నిల్వలను పెంచుతున్నామని, వాటి సమాచారం ఎప్పటికప్పుడు విడదలవుతుందని ఏప్రిల్ 5న పోస్ట్ పాలసీ మీడియా స మావేశంలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ పేర్కొన్నారు. నిల్వలను పెంచే విషయంలో అన్ని అంశాలను అంచనా వేసి, ఆపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

కేరళ మంత్రి ఓ.ఆర్. కేలు



తిరువనంతపురం : ఎస్‌సి,ఎస్‌టి ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కేరళ మంత్రి ఓ.ఆర్. కేలు తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి శాఖ మంత్రిగా కేలు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేలు మీడియాతో మాట్లాడుతూ తమ ప్రభుత్వ పదవీకాలం ఇంకా 12 నెలలు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి ప్రజల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు పూర్తి చేయడంతో పాటు ఎస్‌టి ఎస్‌సి విద్యార్థులకు సకాలంలో గ్రాంట్లు విడుదల చేస్తామని చెప్పారు. అలాగే వాయనాడ్‌లోని ప్రధాన సమస్యలతో పాటు మానవ-వన్యప్రాణుల వివాదాన్ని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. 54 ఏళ్ల కేలు వాయనాడ్ నియోజకవర్గంలోని ఒలెంచెరిలో జన్మించారు. 2000లో తిరునెల్లి గ్రామ పంచాయతీకి వార్డు సభ్యులుగా ఎన్నికైన తరువాత క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో మనంతవాడి నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2021లోనూ ఇదే నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు స్వీకరించి కేరళలో ఎస్‌టి నుంచి తొలి సిపిఎం మంత్రిగా నిలిచారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. అలాగే ఆదివాసీ క్షేమ సమితి అధ్యక్షులుగా ఉన్నారు. కేలుకు భార్య శాంత, మిథున, భావన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జాబ్ క్యాలెండర్ ఏమైంది...? : ఏనుగుల రాకేశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీనిచ్చిన జాబ్ క్యాలెండర్ ఏమైందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ నిరుద్యోగుల గురించి పట్టించుకోకపోవటం శోచనీయమని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్-2లో 783 పోస్టులు ఇచ్చిన రేవంత్ సర్కార్ అంతటితో చేతులు దులుపుకుందని విమర్శించారు. ఆయా పోస్టుల సంఖ్యను రెండు వేలకు, గ్రూప్-3 పోస్టుల సంఖ్యను మూడు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.



వారి జీతాలు పెరిగాయోచ్ !

- జార్ఖండ్‌లో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల పెంపు
- ఆమోదం తెలిపిన క్యాబినెట్

రాంచీ : జార్ఖండ్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలను భారీగా పెంచేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి జీతం 25శాతం, ఎమ్మెల్యేల జీతాలు 50శాతం, మంత్రుల జీతాలు 31శాతం మేర పెరగబోతున్నాయి. ఈ పెంపుతో ముఖ్యమంత్రికి మూల వేతనంగా నెలకు లక్ష రూపాయలు లభిస్తాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రతిపక్ష నేత, విప్‌లు, చీఫ్ విప్‌లు సహా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన శాసనసభ్యులందరికీ ఈ పెంపు వర్తిస్తుంది. ముఖ్యమంత్రి మూల వేతనం గతంలో రూ.80 వేలు ఉండేది. ఇప్పుడది లక్ష రూపాయలకు పెంచారు. ప్రోత్సాహకాలు, అలవెన్సులు దీనికి అదనం. ముఖ్యమంత్రి ఏరియా అలవెన్సును కూడా రూ.80 వేల నుండి లక్ష రూపాయలకు, రిఫ్రెష్‌మెంట్ అలవెన్సును రూ.60 వేల నుండి రూ.70 వేలకు పెంచారు.

మంత్రుల జీతాలు కూడా భారీగానే పెరిగాయి. వీటిని రూ.65 వేల నుండి రూ.85 వేలకు పెంచారు. ఎమ్మెల్యేల జీతాలు రూ.40 వేల నుండి రూ.60 వేలకు పెరిగాయి. ఏరియా, రిఫ్రెష్‌మెంట్ అలవెన్సులు దీనికి అదనం. స్పీకర్ మూల వేతనాన్ని రూ.78 వేల నుండి రూ.98 వేలకు, ప్రతిపక్ష నేత మూల వేతనాన్ని రూ.65 వేల నుండి 85 వేలకు పెంచారు. శాసనకర్తల వేతనాల సవరణ కోసం గత సంవత్సరం డిసెంబరులో ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. దాని సిఫార్సుల మేరకు ఇప్పుడు వేతనాలు పెంచారు.

అక్రమాలకు తావులేకుండా ఎరువుల సరఫరా

- ఈపీఓఎస్ ద్వారా అమ్మకాలు
- హైనాకాలంపై మంత్రి తుమ్మల సమీక్ష

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అక్రమాలకు తావులేకుండా ఎరువులను సరఫరా చేయాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈపీఓఎస్ ద్వారానే అమ్మకాలు జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు చేసినట్టైతే సదరు డీలర్లు, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వానాకాలం సీజన్‌లో ఎరువుల సరఫరా, సాగు విస్తీర్ణం తదితరాంశాలపై చర్చించారు.

విధిగా తనిఖీలు చేసి ఎప్పటికప్పుడు విక్రయాలను పరిశీలించాలని సూచించారు. ఆగస్టు నెలకు సరిపడిన ఎరువులను వీలైనంత త్వరతగా వచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాయాలని కోరారు.10.4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 2.4 లక్షల టన్నుల డీఏపీ, 10లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.60 లక్షల ఎమ్‌వోపీ కేంద్రం నుంచి కేటాయించాలని కోరారు.

భూముల నుంచి రైతుల్ని తొలగించొద్దు

- హైకోర్టు ఆదేశం



హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన అనంతగిరి రిజర్వాయర్ నిర్మాణం కోసం రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట అనంతగిరిలో భూసేకరణ తీరును హైకోర్టు తప్పుపట్టింది. కోర్టుకు వచ్చిన రైతులకు ఆరు వారాల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలంది. అప్పటి వరకు రైతులను భూముల నుంచి ఖాళీ చేయించరాదని తీర్పు చెప్పింది. సుమారు 25 మంది రైతులు ఐదేండ్ల క్రితం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద తీర్పు వెలువరించారు. అనంతగిరి రిజర్వాయర్ కోసం 300లకుపైగా ఎకరాల భూమి సేకరణకు 2017లో ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చింది. భూములు విలువ పెంచాక భూసేకరణ చేయాలని రైతుల గోడును పట్టించుకోలేదు. తీసుకునే పరిహారం చాలదనే అభ్యంతరాలను భూ సేకరణ అధారిటీకి పంపాలన్న అభ్యర్థనను కూడా పట్టించుకోలేదు..అని రైతుల వాదన. చట్ట ప్రకారం చేశామని ప్రభుత్వం కూడా వాదించింది. ప్రభుత్వ వాదనలకు ఆధారాలు చూపలేదని తేల్చిన హైకోర్టు పైవిధంగా తీర్పు వెలువరించింది.

భౌరంపేటలో భూ ఆక్రమణలపై విచారణ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దుండిగల్-గండిమైసమ్మ మండలం బౌరంపేటలోని సర్వే నెం.166లోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిని వజ్ర బిల్డర్లు, ప్రయివేట్ వ్యక్తులు కబ్జా చేశారంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన జి.రఘువీర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ విచారించి ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

లా ప్రవేశాల ఆలస్యంపై పిటిషన్

లా కోర్సుల్లో ప్రవేశాలు ఆలస్యానికి కారణాలు చెప్పాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖను హైకోర్టు ఆదేశించింది. ఓయూ లాసెట్ కన్వీనర్‌కు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలను కూడా ఆదేశించింది. ఈ విద్యా సంవత్సరంలో లా డిగ్రీ కోర్సులో ప్రవేశాలు ఆలస్యం అవ్వడంపై భాస్కర్‌రెడ్డి వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాథే బెంచ్ విచారించింది. విచారణ ఈనెల 27కు వాయిదా పడింది.

దీర్ఘకాలంగా
పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం

- టీజీఏఆర్ఐఈఏ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి, గురుకులం (ఎస్టీ సొసైటీ) అధికారులకు తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెనిషయల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్, టీజీపీఏ అధ్యక్షులు డాక్టర్ అజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 317 జీవోను అమలు చేస్తూ నూతన జోనల్ ప్రకారం క్యాడర్ కేటాయింపులు పూర్తి చేసి ఉత్తర్వులు ఇచ్చిన సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మికి కూడా ధన్యవాదాలు తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో జూడాల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీస్ ను అందజేసి మూడు రోజులు గడుస్తున్నా.ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో జూనియర్ డాక్టర్లు నిరసన బాట పట్టారు. గురువారం రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో నల్లబ్యాడ్జీలను ధరించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్దేశిత సమయంలో ఉపకార వేతనాల విడుదల, పెండింగ్ స్టయిఫండ్ విడుదల, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు గతంలో ఒప్పుకున్న మేరకు స్టయిఫండ్, ఆంధ్రప్రదేశ్ సీట్లలో తెలంగాణ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్, ప్రభుత్వాస్పత్రుల్లో భద్రత, పోస్ట్ గ్రాడ్యుయేట్లకు సరిపడేలా కొత్త హాస్టళ్ల నిర్మాణం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

బిజినెస్

టెల్కోల రెవెన్యూ 87 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : తమకు ఆదాయాలు సరిపోవడం లేదని.. ఛార్జీలు మరింత పెంచాల్సిన అవసరం ఉందని టెలికం కంపెనీలు చేస్తున్న ప్రకటనలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గత ఐదేళ్లలో ఆదాయాలు దాదాపు రెట్టింపు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం 2018-19 నాటి ఆదాయాలతో పోల్చితే.. 2023-24లో టెల్కోల రెవెన్యూ ఏకంగా 87 శాతం పెరిగి రూ.2.39 లక్షల కోట్లకు చేరిందని గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ సిఎల్ఎస్ఎ వెల్లడించింది. ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో సేవలను ప్రారంభం తర్వాత టెల్కోల ఆదాయాల్లో భారీ పెరుగుదల చోటు చేసుకుందని తెలిపింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో వొడాఫోన్ ఐడియా మార్కెట్ వాటా స్వల్పంగా తగ్గినప్పటికీ.. రెవెన్యూ మాత్రం యథాతథంగా 37,700 కోట్లుగా చోటు చేసుకుంది. ఎయిర్‌టెల్ రెవెన్యూ 12 శాతం పెరిగి రూ.88,700 కోట్లుగా, జియో ఆదాయం 10 శాతం పెరిగి రూ.99,200 కోట్లుగా నమోదయ్యింది.

సెల్ బే స్టోర్‌లో షావోమి 14సివి ఆవిష్కరణ



హైదరాబాద్ : మొబైల్ విక్రయ రిటైల్ చెయిన్ సెల్ బేలో షావోమి తన కొత్త షావోమి 14సివిని ఆవిష్కరించారు. గచ్చిబౌలిలోని సెల్ బే ఫౌండర్ సోమా నాగరాజుతో కలిసి సినీనటీ వర్షిణీ కలిసి ఈ 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేశారు. ఎల్లప్పుడూ తమ సంస్థ వినియోగదారులకు సరికొత్త ప్రొడక్ట్స్ అందిస్తుందని నాగరాజు పేర్కొన్నారు. దీని ధర రూ.39,999గా ఉందని.. ఫైనాన్స్ అప్షన్స్ కూడా ఉనాయన్నారు. ఈ కార్యక్రమంలో షావోమి ప్రతినిధులు కునాల్ అగర్వాల్, మల్లికార్జున రావు, సాజు రత్నం తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో ఎలక్ట్రానిక్స్ రంగం 400% వృద్ధి



విజయవాడ : గడిచిన పదేళ్లలో భారత్‌లో ఎలక్ట్రానిక్స్ రంగం 400 శాతం వృద్ధిని నమోదు చేసిందని సెల్‌కాన్ గ్రూపు సిఎండి వై గురు అన్నారు. ప్రస్తుతం రూ.1.2 లక్షల కోట్ల మొబైల్ ఫోన్ల ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. ఈ రంగంలో ఎగుమతులకు ఆంధ్రప్రదేశ్‌కు గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. ఎపి నూతన ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎపిని ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీకి పవర్‌హౌస్‌గా మార్చడానికి రాబోయే రోజుల్లో ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్నారు. రాష్ట్రాన్ని ఐటి హబ్‌గా మార్చడానికి, అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని నారా లోకేష్ పేర్కొన్నట్లు తెలిపారు.

సెల్లెకోర్ గాడ్జెట్స్ హాంగ్‌కాంగ్‌కు విస్తరణ

హైదరాబాద్ : సెల్లెకోర్ గాడ్జెట్స్ లిమిటెడ్ హాంగ్‌కాంగ్‌లో తమ పూర్తి యాజమాన్యంలోని కొత్త అనుబంధ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా విదేశీ కార్యకలాపాలను విస్తరించినట్లయ్యిందని తెలిపింది. ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ గూడ్స్ రంగంలోని ఈ సంస్థ సెల్లెకార్ గాడ్జెట్స్ హెచ్‌కె లిమిటెడ్ పేరుతో హాంకాంగ్‌లో తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థను ఏర్పాటు చేయడం గర్వంగా ఉందని ఆ సంస్థ పేర్కొంది. ఈ కొత్త అనుబంధ సంస్థ క్లిష్టమైన పరికరాల సేకరణకు, బలమైన రవాణ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మద్దతు ఇవ్వనుందని తెలిపింది.

బే విండోకు డిజైన్ ఎక్సలెన్స్ అవార్డు



హైదరాబాద్: తమ సంస్థకు ప్రతిష్టాత్మక డిజైన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 దక్కిందని బే విండో వెల్లడించింది. అసాధారణమైన డిజైన్, ఆవిష్కరణల పట్ల తమ అంకితభావానికి ఇది నిదర్శమని బే విండో డిజైన్ లీడ్ సిద్ధాంత్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ సంస్థ ఫర్నీచర్ ఉత్పతుల రంగంలో ఉంది.

పేటియంతో సామ్‌సంగ్ ఒప్పందం

గుర్‌గావ్ : సామ్‌సంగ్ వాలెట్‌పై విమాన, బస్సు, సినిమా, ఈవెంట్‌ల టిక్కెట్ బుకింగ్‌లను చేసుకోవడానికి వీలుగా పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. సామ్‌సంగ్ వాలెట్ ద్వారా నేరుగా సౌకర్యవంతమైన, ఇంటిగ్రేటెడ్ బుకింగ్ అనుభవాన్ని అందించడం ద్వారా వినియోగదారుల సౌకర్యాన్ని మెరుగుపరచడం ఈ భాగస్వామ్యం లక్ష్యమని పేర్కొంది. ఈ భాగస్వామ్యంతో గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ప్రయాణ, ఈవెంట్‌లకు సంబంధించిన బుకింగ్‌లను పేటియంతో సౌకర్యవంతమైన యాక్సెస్‌ను పొందవచ్చని తెలిపింది.

ఐఎస్ఎఎఫ్‌కు కాఫ్రి అవార్డు



హైదరాబాద్ : ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రో ఫారెస్ట్రీ (ఐఎస్ఎఎఫ్)కు సెంట్రల్ అగ్రోఫారెస్ట్రీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (కాఫ్రి) అవార్డు దక్కింది. అగ్రోఫారెస్ట్రీ (చెట్ల మధ్య వ్యయసాయం) అభివృద్ధికి చేసిన సేవలకు గాను ఈ ప్రశంస పొందింది. ఝాన్సీలో రెండు రోజుల పాటు కాఫ్రి నిర్వహించిన అగ్రోఫారెస్ట్రీపై జరిగిన కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును ఐకార్ డిడిజి గౌతంజీ ఐఎస్ఎఎఫ్ ప్రతినిధికి అందించారు.

వెయ్యి డప్పులు...లక్ష చెప్పులతో తరిమికొడతాం

• హరీశ్‌రావుకు సతీష్ మాదిగ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించామంటూ అవాకులు, చెవాకులు మాట్లాడుతున్న హరీశ్‌రావును వెయ్యి డప్పులు...లక్ష చెప్పులతో తరిమికొడతామని కాంగ్రెస్ సీనియర్ నేత సతీష్ మాదిగ హెచ్చరించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయాక తమ ఉనికిని కాపాడుకునేందుకు ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. లంబు (హరీశ్), జంబు (కేటీఆర్) అనే బావమరుదులు కాంగ్రెస్‌పై బురజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత జంబు కరుమరుగైపోయారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు లంబును రంగంలోకి దించారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో నేరెళ్ల దళితులపై దాడి చేసిందెవరనీ, ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేసిందెవరని హరీశ్‌రావును ప్రశ్నించారు. మిర్యాలగూడలో ప్రణయ్‌ని పట్టపగలు హత్య చేస్తే ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని సింగరేణి కాలనీలో చిన్నారిపై లైంగిక దాడి చేసిన ఘటన మర్చిపోయారా? అని ప్రశ్నించారు. అత్తాపూర్‌లో పట్టపగలు గొడ్డలితో నరకడం, ఎర్రగడ్డలో పరువు హత్య జరిగితే పట్టించుకున్నారా? మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు న్యాయవాది దంపతులను వామన్‌రావులను చంపలేదా? ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తన ఎన్నికల ప్రత్యర్థి తలారి సత్యాన్ని లారీతో గుద్ది చంపిన విషయాన్ని మార్చిపోయారా? అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో హీరోయిన్లను లోబర్చుకున్నారరని ఆరోపించారు. వరంగల్ నర్సింగ్ విద్యార్థి ప్రీతి ర్యాగింగ్‌కు బలైపోతే పట్టించుకున్నారా? మాజీ హోంమంత్రి మనవడు పబ్బులకు మైనర్ అమ్మాయిని తీసుకువెళ్లి పెద్దమ్మ గుడి సమీపంలో లైంగికదాడి చేస్తే పాలకులు పట్టించుకోలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు హిట్ అండ్ రన్ కేసులో చిన్నారిని చంపా లేదా? అప్పుడు శాంతిభద్రతలు గుర్తుకు రాలేదా? అని నిలదీశారు.

తెలుగు రాష్ట్రాల్లో 2 అసెంబ్లీ, 2 లోక్‌సభ సెగ్మెంట్లలో

ఈవీఎంల వెరిఫికేషన్లకు దరఖాస్తులు : ఈసీఐ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రెండు అసెంబ్లీ, రెండు లోక్‌సభ సెగ్మెంట్లలో ఈవీఎంల వెరిఫికేషన్లకు దరఖాస్తులు వచ్చాయని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. దేశవ్యాప్తంగా 11 చోట్ల ఈ వెరిఫికేషన్లకు దరఖాస్తులొచ్చినట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రత్యేకించి ఎక్కడైనా రెండు లేదా మూడో స్థానంలో ఉన్న అభ్యర్థులు వారికి సందేహం కలిగితే ఎన్నికల ఫలితాలు వెలువడిన 45 రోజులలోపు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కాగా మొత్తం ఎనిమిది లోక్‌సభ నియోజక వర్గాల్లోని 92 పోలింగ్ కేంద్రాల్లో, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 26 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ కోసం దరఖాస్తు వచ్చినట్టు ఈసీఐ స్పష్టం చేసింది. అయితే దరఖాస్తు చేసిన నాలుగు వారాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించింది. అందులో లోక్‌సభ కోసం ఎనిమిది, అసెంబ్లీ కోసం మూడు దరఖాస్తులొచ్చాయని పేర్కొంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ నుంచి ఐదు దరఖాస్తులందాయని తెలిపింది.

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం లోక్‌సభ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాల్లో, బొబ్బిలి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రంలో వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసింది. ఏపీలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 13 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని వైసీపీ విజ్ఞప్తి చేసింది.

తెలంగాణలోని జహీరాబాద్ పార్లమెంటు నియోజక వర్గంలోని 20 పోలింగ్ స్టేషన్లలో వాడిన ఈవీఎం (ఓటింగ్ మిషన్లు)లను వెరిఫికేషన్ చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నారాయణఖేడ్‌లో 7, జహీరాబాద్‌లో 7, అందోల్(ఎస్సీ)లో 6 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ దరఖాస్తులు వచ్చాయని ఈసీఐ తెలిపింది.

అలాగే ఒడిశాలోని ఝర్సుగూడ అసెంబ్లీ పరిధిలోని 13 పోలింగ్ కేంద్రాలలో వెరిఫికేషన్ చేయాలని బీజేడీ రిక్వెస్ట్ చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ లోక్‌సభ పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో, హర్యానాలో కర్నాల్, ఫరిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 6 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని కాంగ్రెస్ పార్టీ అప్లికేషన్‌లో పేర్కొంది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ లోక్‌సభ నియోజక వర్గంలో 40 పోలింగ్ కేంద్రాల్లో, తమిళనాడులోని వెల్లూర్ లోక్‌సభ నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని బీజేపీ కోరింది. తమిళనాడులోనే విరుధ్ నగర్ లోక్ సభ పరిధిలో 14 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ చేయాలని డిఎండికే దరఖాస్తు చేసింది.

లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్

• ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈ సందర్భంగా గురువారం ఆయనతో రాష్ట్రపతి ప్రమాణం చేయించారు. ఈ నెల 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న విషయం తెలిసిందే. కొత్తగా ఎంపికైన ఎంపీలతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్లను ఎన్నుకోనున్నారు. భర్తృహరి మహతాబ్ ఒడిశాలోని కటక్ ఎంపీగా గెలుపొందారు. ఇలా ఆయన ఎంపీగా గెలువడం ఇది ఏడోసారి కావడం విశేషం. గతంలో ఆయన నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ పార్టీలో కొనసాగారు. మళ్లీ ఎన్నికలకు ముందు బీజేడీలో చేరి ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. ఈయన మాజీ సీఎం హరేకృష్ణ మహతాబ్ తనయుడు. మహతాబ్ నియామకంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 95(1) ప్రకారం ఎంపీ భర్తృహరి మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

గురుకుల డిగ్రీ కాలేజీ సీట్ల

రెండో జాబితా విడుదల

• ఈనెల 26లోగా రిపోర్ట్ చేయాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని బీసీ వెల్ఫేర్ , సోషల్ వెల్ఫేర్ , ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కాలేజీల్లో మెరిట్ ప్రకారం సీట్లను భర్తీ చేస్తూ రెండో జాబితా విడుదల చేశామని టీజీఆర్‌డీసీ సెట్ - 2024 కన్వీనర్ ఐడుగు సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్ల కేటాయింపు వివరాలు https://tgrdccet.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చనీ, సీట్లు కేటాయించబడిన విద్యార్థులు ఈనెల 26 లోగా సంబంధిత కాలేజీల్లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు. ఆయా కోర్సుల్లో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు https://tgrdccet.cgg.gov.in వెబ్ సైట్ సంప్రదించాలని సూచించారు.

బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

• కేవీ రమణాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ నేత, బ్రాహ్మణ పరిషత్ మాజీ చైర్మెన్ కేవీ రమణాచారి ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో అర్చకులకు దూపదీప నైవేద్యాల కోసం నిధులు వెచ్చించారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయిందని ఆయన వాపోయారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రమణాచారి మాట్లాడుతూ... బ్రాహ్మణులు అగ్రవర్ణాలకు చెందిన వారైనప్పటికీ ఆ కులంలో కూడా అనేక మంది పేదవారున్నారని తెలిపారు. అందువల్ల వారి సంక్షేమంపై దృష్టి సారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

విదేశాలకు వెళ్లేందుకు బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలివ్వాలని కోరారు. సంక్షేమ పరిషత్‌లో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలనివ్వాలని విజ్ఞప్తి చేశారు. విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, బీఆర్ఎస్ నేత దేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని గురుకులాల్లో జేఇఇ మెయిన్స్, నీట్ కోచింగ్

• ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని గురుకులాల్లో జేఇఇ మెయిన్స్, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పించాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ జాతీయ అధ్యక్షులు పాపని నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. అందరికి ప్రారంభం నుంచే అవకాశాలను కల్పించాలని కోరారు. అలా కాకుండా సీఒఇ పేరుతో కొద్ది మందికే చెప్పించడం విద్యార్థుల్లో వివక్షతను ప్రేరేపించినట్టేనంటూ ఆ విధానాన్ని తప్పుపట్టారు. ల37 రకాల జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సమానంగా శిక్షణ నిర్వహించడం అవసరమని అభిప్రాయపడ్డారు.

ప్రయివేటు, ప్రభుత్వ విద్యాలయాలనే తేడా లేకుండా విజ్ఞానాన్ని అందించే ఒక రకమైన పాఠ్యాంశాలను అన్ని విద్యాలయాల్లో బోధించేందుకు సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్కారు బడుల్లో స్కావెంజర్లను నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని కోరారు. పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. బీఎడ్ అర్హత ఉన్న ఎస్జీటీలకూ పదోన్నతి అవకాశం కల్పించాలని సూచించారు. 317 జీవో బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని తెలిపారు. పీఆర్సీ నివేదికను తెప్పించి అమలు చేయాలని పేర్కొన్నారు.

కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్ సిద్ధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్లు సిద్ధం చేసినట్టు ఐఐటీ- జేఈఈ, నీట్ ఫోరం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందొచ్చని సూచించింది. స్టడీ మెటీరియల్‌తోపాటు అసైన్‌మెంట్లను పొందొచ్చని పేర్కొంది. మరింత సమాచారం కోసం ఐఐటీఎఫ్, ఎంఈడీఎఫ్ అని టైప్ చేసి 9849016661 నెంబర్‌కు వాట్సాప్ మెసేస్ చేయాలని సూచించింది.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

• విద్యాశాఖ కమిషనర్‌కు పీఆర్టీయూ తెలంగాణ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోన్నతులు, బదిలీలు పొందుతూ అనేక రకాల సాంకేతికంగా ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ కలిసి వినతిపత్రం సమర్పించారు. పదోన్నతుల కౌన్సెలింగ్‌లో ఒకటి కంటే ఎక్కువ పదోన్నతులు పొందడం వల్ల మిగిలిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్లతో ప్రస్తుత కౌన్సెలింగ్‌లోనే పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రాథమిక విద్య బలోపేతం చేయడానికి రాష్ట్రంలోని ప్రతి పాఠశాలకూ గతంలో మంజూరు చేసిన ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులను అర్హులైన డీఎడ్ లేదా బీఎడ్ అర్హతలు కలిగిన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించే విధంగా 12 జీవోను సవరించాలని సూచించారు. గతంలో పరస్పర బదిలీలపై వెళ్లిన వారికి కూడా అవకాశం కల్పించడానికి కటాఫ్ తేదీని వచ్చేనెల 30కి మార్చాలని కోరారు. ప్రభుత్వ అనుమతితో పరిశీలిస్తామన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, కె రత్నాకర్‌రావు, సూరినేని గంగాధర్, కొండేటి శ్రీనివాస్‌రెడ్డి, జి రవీందర్‌గౌడ్, రాజు జాదవ్, మన్నె చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి 2.79 లక్షల దరఖాస్తులు

• ముగిసిన దరఖాస్తు గడువు : విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే గడువు గురువారం అర్ధరాత్రి 12 గంటలతో ముగిసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి తొమ్మిది గంటల వరకు 2,85,086 మంది ఫీజు చెల్లించారని తెలిపారు. వారిలో 2,79,112 మంది దరఖాస్తులను సమర్పించారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 73,606 మంది దరఖాస్తులను సవరించారని పేర్కొన్నారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే రాతపరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. వచ్చేనెల 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్‌ను గత ప్రభుత్వం విడుదల చేయగా, 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆ నోటిఫికేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. 5,973 ఉపాధ్యాయ పోస్టులను కలిపి మొత్తం 11,062 పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. అయితే గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని విద్యాశాఖ తెలిపిన విషయం తెలిసిందే. అభ్యర్థులు ఇతర వివరాలకు https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

పదోన్నతుల్లో మిగిలిన పోస్టులను అర్హులైన వారికివ్వాలి : టీఆర్టీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ పదోన్నతుల్లో మిగిలిన పోస్టులను అర్హులైన వారికి ఇవ్వాలని టీఆర్టీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆఫ్‌లైన్‌లో పదోన్నతులను కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి కావలి అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్కో టీచర్‌కు మూడు సబ్జెక్టుల్లో పదోన్నతులు రావడంతో గందరగోళం ఏర్పడిందని తెలిపారు. దీంతో 40 శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా మిగిలే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఆ ఖాళీలను సీనియార్టీ జాబితాలో అర్హులైన వారితో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో పదోన్నతుల్లో భర్తీ కాని స్థానంలో అర్హులైన వారికి ఆఫ్‌లైన్‌లో ప్రత్యక్ష పద్ధతిలో పదోన్నతులు కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని కోరారు.

వృత్తి విద్యా కాలేజీలపై విచారణ జరపాలి : టీఎస్‌టీసీఈఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి వృత్తి విద్యా కాలేజీలపై విచారణ జరపాలని టీఎస్‌టీసీఈఏ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయినేని సంతోష్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలను జమ చేసి తిరిగి తీసుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. కొన్ని కాలేజీల్లో లక్షల రూపాయలను అకౌంట్‌లో జమ చేసి తిరిగి తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. మరికొన్ని కాలేజీ యాజమాన్యాలు నెలల కొద్ది జీతాలివ్వడం లేదని వివరించారు. అలాంటి కాలేజీలకు జేఎన్టీయూ హైదరాబాద్ ఏ విధంగా అనుబంధ గుర్తింపును ఇస్తుందని ప్రశ్నించారు. ఈ అంశాలపై దృష్టిసారించాలని సూచించారు. వృత్తి విద్యా కాలేజీలపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

రష్యా నూతన పొత్తుల వేగం తీరుపై

ఆశ్చర్యపోయిన అమెరికా

• వాల్ స్ట్రీట్ జర్నల్



చైనా, ఉత్తర కొరియా, ఇతర అమెరికా విరోధులతో మాస్కో కుదుర్చుకున్న భద్రతా భాగస్వామ్యాలను వాషింగ్టన్ ఊహించలేదని అనామక గూఢచార మూలాలను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ రాసింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం వియత్నాంకు వెళ్లే ముందు డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం, పరస్పర రక్షణ ఒప్పందంపై సంతకం చేశాడు. మాస్కో, బీజింగ్‌లను మిత్ర దేశాలు కాకుండా చేయటానికి దశాబ్దాలుగా అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదని గత నెలలో పుతిన్ చైనా పర్యటన తేటతెల్లం చేసిందని ఒక అమెరికా విధాన నిర్ణేత ప్రకటించాడు. అమెరికా విరోధులతో రష్యాకు విస్తరిస్తున్న భద్రతా సంబంధాల వేగం, లోతు కొన్నిసార్లు అమెరికన్ ఇంటెలిజెన్స్ విశ్లేషకులను ఆశ్చర్యపరిచాయి.

అమెరికా ఆధిపత్య ప్రపంచ వ్యవస్థగా భావించే వాటిని సమిష్టిగా ఎదుర్కోవడానికి రష్యా, ఇతర దేశాలు చారిత్రాత్మక ఘర్షణలను పక్కన పెట్టాయని వాల్ స్ట్రీట్ జర్నల్ బుధవారం పేర్కొంది. ఆయుధాలను ఉత్పత్తి చేసేందుకు రష్యాకు ఉత్తర కొరియా కార్మికులను పంపుతున్నట్లు వాషింగ్టన్ ఆరోపించింది. మెషిన్ టూల్స్, మైక్రోఎలక్ట్రానిక్స్, ట్యాంక్‌లు సాయుధ వాహనాలకు ఆప్టిక్స్, క్రూయిజ్ క్షిపణుల కోసం ఉపయోగపడే టర్బో ఇంజిన్‌లతో సహా భారీ మొత్తంలో ద్వంద్వ- వినియోగ పరికరాలను పంపిణీ చేయడం ద్వారా రష్యా సైనిక పరిశ్రమను పాశ్చాత్య దేశాల ఆంక్షలను అధిగమించడానికి చైనా తోడ్పాటును అందజేసిందని అమెరికా విశ్వసిస్తోందని, ఉక్రెయిన్‌లో ఉపగ్రహం ఇతర అంతరిక్ష ఆధారిత సామర్థ్యాలను మెరుగుపరచడానికి రష్యాకు చైనా సహాయం చేసిందని కూడా అమెరికా భావిస్తున్నట్టు వాల్ స్ట్రీట్ జర్నల్ రాసింది. అమెరికా ఆరోపణలను చైనా తిరస్కరించింది. రష్యాపై విధించిన ఆంక్షలు ఏకపక్షం, చట్టవిరుద్ధం అని చైనా ప్రకటించింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలను సరఫరా చేయడం ద్వారా సంఘర్షణకు ఆజ్యం పోస్తున్న అమెరికా కపటత్వాన్ని చైనా ఎండగట్టింది. ఇరాన్ రష్యా ప్రాథమిక ఆయుధాల సరఫరాదారుగా మారిందని, టాటర్‌స్తాన్ ప్రాంతంలో వేలాది షాహెద్-136 డ్రోన్‌లను తయారు చేయగల సామర్థ్యం గల ఫ్యాక్టరీని నిర్మించడంలో టెహ్రాన్ సహాయం చేసిందని పేరులేని పెంటగాన్ అధికారులు జర్నల్‌తో చెప్పారని కూడా ఆ పత్రిక అన్నది. అయితే ఉత్తర కొరియా, చైనా, ఇరాన్‌లతో రష్యాకు ఏర్పడిన విస్తరించిన భద్రతా సంబంధాలు నాటో సైనిక కూటమికి సమానం కాదు. కానీ సాంకేతికతల బదిలీలతో దీర్ఘ కాలంలో అన్ని దేశాల సామర్థ్యాలు మెరుగుపడి అమెరికాకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుందని వారు అన్నారు.

ఈ నెల ప్రారంభంలో, సెయింట్ పీటర్స్ బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరమ్‌లో, గ్లోబల్ సౌత్‌తో రష్యా ఆర్థిక సంబంధాల వ్యూహం మార్కెట్ నియంత్రణ కంటే సాంకేతికత సామర్థ్య బదిలీల ఆధారంగా భాగస్వామ్యాలను కలిగి ఉంటుందని పుతిన్ ప్రకటించాడు. ఉక్రెయిన్ వివాదంలో పశ్చిమ దేశాల ప్రవర్తనతో దూరమైన గ్లోబల్ సౌత్ వైపు రష్యా మళ్లుతుందని మాస్కో కూడా సంకేతాలు ఇచ్చింది. రష్యాను ఏకాకిని చేసేందుకు అమెరికా, దాని మిత్రదేశాలు చేసిన ప్రయత్నాలు పూర్తి వైఫల్యాన్ని చవిచూశాయి అని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఫిబ్రవరిలో చెప్పాడు.

జెలెన్స్కీని పదవి నుంచి తొలగించేందుకు

పశ్చిమ దేశాల ప్రణాళిక

• రష్యన్ ఇంటెలిజెన్స్



వ్లాదిమిర్ జెలెన్స్కీ అధికారం పూర్తిగా పాశ్చాత్య మద్దతుపై ఆధారపడి ఉంది. అయితే అమెరికా, దాని మిత్రదేశాలు ఎటువంటి సందేహం లేకుండా అతనిని బలి తీసుకుంటాయని రష్యన్ విదేశీ గూఢచార సేవ (ఎస్‌వీఆర్) తెలిపింది. జెలెన్స్కీని రష్యా ఒక దోపిడీదారునిగా పరిగణిస్తుంది. ఎందుకంటే అతని ఐదేండ్ల అధ్యక్ష పదవీకాలం మేలో ముగిసింది. ఉక్రేనియన్ రాజ్యాంగం ప్రకారం పార్లమెంటు చట్టబద్ధంగానే ఉంటుందని జెలెన్స్కీ పదవీకాలం ముగిసినప్పుడు అధ్యక్ష అధికారం దాని స్పీకర్‌కు పంపబడిందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వాదించాడు. అయితే, కీవ్‌లోని అధికారులు జెలెన్స్కీని అధ్యక్షుడిగా కొనసాగించడానికి కుట్ర పన్నారు. రష్యా యుద్ధభూమిలో తన విజయాలను పటిష్టం చేసిన తర్వాత, అలిసిపోయిన, నిరుత్సాహానికి గురైన ఉక్రేనియన్ దళాలకు ఎలాంటి మార్గం లేకుండా పోయిన తర్వాత జెలెన్స్కీని బలిపశువుగా ఉపయోగించుకుంటారని ఎస్‌వీఆర్ నమ్ముతుంది. జెలెన్స్కీతో ఉపయోగం లేనప్పుడు, అమెరికా అతనిని రెండో ఆలోచన లేకుండా చరిత్ర చెత్త కుప్పపై విసిరేస్తుంది. అతని స్థానంలో రష్యాతో వివాదంపై శాంతియుతంగా చర్చలు జరపడానికి తగినవాడుగా భావించే మరొక ఉక్రేనియన్ రాజకీయవేత్తను అమెరికా నియమిస్తుందని, రిటైర్డ్ జనరల్ వాలెరి జలుజ్నీ, సాయుధ దళాల మాజీ టాప్ కమాండర్, అందుకు సంభావ్య అభ్యర్థిగా మారే అవకాశం ఉందని ఎస్‌వీఆర్ భావిస్తోంది. రష్యాపై ఉక్రేనియన్ సైనిక విజయం సాధ్యమేనని విదేశీ ప్రేక్షకులను ఒప్పించేందుకు జెలెన్స్కీ చేసిన ప్రయత్నాలను రష్యన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ హాస్యభరితమైన అంశం అని కొట్టిపారేసింది. గత వారం రష్యన్ విదేశాంగ విధానంపై కీలక ప్రసంగంలో పుతిన్ తన విశ్లేషణను వివరించాడు. జెలెన్స్కీ ప్రజాదరణలేని అనేక విధానాలను జారీ చేయగలడు, అమలు చేయగలడు. అయితే రష్యాతో శత్రుత్వాన్ని పొడిగించేందుకు పశ్చిమ దేశాల ప్రోత్సాహం ఉక్రెయిన్‌కు ఉంటుంది. అందుకోసం చేసే నిర్ణయాలకు జెలెన్స్కీనే బాధ్యత వహించాల్సి ఉంటుందని పుతిన్ జోస్యం చెప్పాడు. అమెరికాతో ఇటీవలి ద్వైపాక్షిక పదేండ్ల భద్రతా ఒప్పందం వంటి విదేశాలతో జెలెన్స్కీ సంతకం చేసిన ఒప్పందాలను ఇతర పార్టీలు సులభంగా విస్మరించవచ్చని, ఎందుకంటే అతనికి ఉక్రెయిన్‌కు ప్రాతినిధ్యం వహించే చట్టపరమైన అధికారం మే 20 తర్వాత ఉండదని పుతిన్ పేర్కొన్నాడు.